మార్చి 1, 1990

నలుపు

ప్రజల పక్ష పత్రిక

ప్రజాకళాకారుడు గద్దర్

మానవత్వ మనిషి
దళితుని వ్యవస్థ





పుస్తక ప్రదర్శన

మార్చి, ఏప్రిల్ నెలలో కరీంనగర్, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్ జిల్లాలలో పుస్తక ప్రదర్శనలను హైదరాబాద్ బుక్‌ట్రస్టు నిర్వహిస్తున్నది. ఈ ప్రదర్శనలో ఇతర ప్రచురణ సంస్థలు – నేషనల్ బుక్‌ట్రస్టు, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, జన విజ్ఞాన వేదిక, మైత్రి, జయంతి వగైరా అనేక సంస్థల ప్రచురణలు కూడా చోటు చేసుకుంటాయి.

ప్రజలలో శాస్త్రీయ దృష్టిని ప్రగతి శీల విలువలను పెంపొందించే మంచి పుస్తకాలను వారి ముంగిట్లోకి కొనిపోవాలన్నదే ఈ ప్రదర్శనల లక్ష్యం. ఉత్తమ పుస్తకాల ప్రదర్శనలను సమరశీలకమైన చొరవతో ఉధృత స్థాయిలో ముందుకు తీసుకుపోనిదే చవకబారు బూతు సాహిత్య వ్యాప్తిని విజయవంతముగా నిరోధించలేము. సామాజిక ప్రయోజనాల దృష్ట్యా ఈ కృషిని అంకురితంగా కొనసాగించాల్సి ఉంటుంది.

ఈ సందర్భంగా పఠనాశక్తిగల ప్రజలు కూడా తమ వంతు పాత్రను నిర్వహించాలి. మీ పరిచితులందర్నీ సమీకరించాలి. విద్యాలయాలు, గ్రంథాలయాలు తదితర అభ్యుదయ సంస్థలను సంప్రదించి చక్కని పుస్తకాలను ఎక్కువగా కొనుగోలు చేసేట్టు చూడాల్సిన బాధ్యత కూడా పుస్తకాభిమానులందరి మీద ఉంది.

పుస్తక ప్రదర్శనలు ఈ సెంటర్లలో జరుగుతున్నాయి

జమ్మికుంట	మార్చి 21,22 తేదీల్లో		
హుస్నాబాద్	మార్చి 23, 24 తేదీల్లో	మందమర్రి	ఏప్రిల్ 9, 10 తేదీల్లో
సిద్ధిపేట	మార్చి 25, 26 తేదీల్లో	పెల్లంపల్లి	ఏప్రిల్ 11, 12 తేదీల్లో
సిరిసిల్లా	మార్చి 27, 28 తేదీల్ల	మంచిర్యాల	ఏప్రిల్ 13, 14 తేదీల్లో
కామారెడ్డి	మార్చి 29, 30 తేదీల్లో		

అభినందనలతో,

హైదరాబాద్ బుక్‌ట్రస్టు

నలుపు

ప్రజల పక్ష పత్రిక

సంపుటి: 1 సంచిక:18 మార్చి 16-31,1990

విడిప్రతి రు. 3.00
సంవత్సర చందా రు. 65.00

సంపాదకవర్గం
బొజ్జాతారకం
కె. బాలగోపాల్
డి. నరసింహారెడ్డి
కె. ఐలయ్య
సిరిల్ రెడ్డి
పి.ఎల్. విశ్వేశ్వరరావు
ఆర్. అఖిలేశ్వరి

సంపాదకుడు
బొజ్జాతారకం

ఉప సంపాదకులు
ఎన్. జయ
ఎన్. జగన్ రెడ్డి

రూపకల్పన
ఏ. షరీఫ్

ప్రచురణ, ముద్రణ
హైద్రాబాద్ బుక్ ట్రస్ట్ తరుఫున సిరిల్ రెడ్డి

అక్షరాలు
ఓం సాయి లేజర్ గ్రాఫిక్స్
నారాయణగూడా.

అచ్చు:
హైదరాబాద్ ప్రింటర్స్
హైదరాబాదుకుగాను,
గాయత్రి ఎంటర్ ప్రైజెస్, హైదరాబాద్.

సర్క్యులేషన్ మేనేజర్
శరత్‌చంద్ర
'నలుపు' పక్షపత్రిక
ఇం.నెం. 1-1-342/బి, వివేకనగర్
హైదరాబాద్ - 500 020
ఫోన్ నెంబర్ 67412

లోపలి పేజీల్లో

వాస్తవచిత్రణ

గత డిసెంబర్ నుండి మీ పత్రికను రెగ్యులర్‌గా చదువుతున్నాను. మనరాష్ట్రంలో జరిగిన విశేషాలను, దళితులు, బలహీన వార్గల వారి భూమి, తదితర సమస్యల పోరాటాలను వాస్తవికంగా అందిస్తున్న మీ పత్రిక నిజంగా సమాజానికి ప్రతిబింబం కావాలని ఆశిస్తున్నాను. జీవగాథ శీర్షిక చాలా బాగుంది. రాజ్యాంగం గురించి, పౌరహక్కుల గురించి శీర్షికలు ప్రవేశపెట్టి సామాన్యుడికి చట్ట పరిజ్ఞానం కల్గించడంలో సహకరించండి.

ప్రశ్నోతర్తర శీర్షిక ద్వారా పాఠకులు అనేక సమస్యలకు మీనుంచి పరిష్కారాలు ఆశిస్తున్నాను. విజ్ఞాన విషయాలు, భూమి, మనిషి కథ చాలాబాగున్న అంశాలు. సమాజంలోని చెడును ఎత్తి చూపడమే కాక, దాని నిర్మూలనకు కృషి చేయడంలో ఎలాంటి పద్ధతి పాటిస్తే బాగుంటుంది. తెలియజేయండి.

వి. మల్లేశం

టీచరు, ఇల్లంతకుంట.

వింతప్రపంచంలో

ఈ వింత ప్రపంచంలో ఎన్నో వింత మోసాలు జరుగుతున్నాయి. ఈ వింత విషయాలను ఇతర పత్రికలు (వీక్లీ, మాస) ప్రచురిస్తున్నాయి. కాని, నిజంగా "నలుపు" పత్రిక నిరుపేద ప్రజల సమస్యలను వెలికి తీస్తూ తమ సమస్యలను తామే అర్థం చేసుకునేట్లు చేస్తున్నది. చాలా బాగుంది! మీ పత్రిక మరెన్నో ప్రజాసమస్యలను ప్రచురించి నిరుపేదలకు సహాయపడగలదని ఆశిస్తున్నాను.

ఎం. రవిశంకర్

అశ్వారావు పేట

బలహీన వర్గాలకోసం

మీరు ఈ మధ్య నలుపు పత్రికలో "చాకలి వీరులు - చాకిరి వీరులు" అనేశీర్షికతో ప్రచురించిన విషయాలు బాగున్నవి. బలహీనవర్గాల కొరకు మీరు చేస్తున్న కృషికి ధన్యవాదాలు, మన "నలుపు' పత్రిక గురించి ప్రచారం కొరకు మా యథాశక్తి రజక దీపిక పత్రిక చివరి పేజీలో ప్రకటన ఇచ్చాం.

బహుశా కులవ్యవస్థకు మీరు సపోర్టు ఇవ్వక పోవచ్చు. కాని రజక సంఘం - అతి బీద, దీన, హీన, నికృష్ట పీడిత వర్గం - వీరికి సేవ చేయటం బలహీన వర్గాలకు సేవచేసినట్లే అవుతుందని భావిస్తున్నాను.

జూపెల్లి సత్యనారాయణ

ఖమ్మం

ప్రతిస్పందన

'నలుపు' మార్చి 1-15 సంచికలో స్పందన శీర్షికలో ఎవరు ప్రజల మనిషి అనే శీర్షికలో వచ్చిన ప్రకాశ్‌గారి లేఖకకు ఇది నా ప్రతిస్పందన.

ప్రకాశ్‌గారి లేఖలో ఉన్న సారాంశాన్ని బట్టి పీపుల్స్‌వార్ గ్రూపు మాత్రమే ప్రజల పార్టీనా? లేకపోతే భారతదేశంలో కార్మిక వర్గ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీనా? ఈ రోజు భారతదేశంలో విప్లవోద్యమం ఏ స్థితిలో ఉంది? ఏ గ్రూపైనా కార్మికవర్గ పోరాటాలకు నాయకత్వం వహించ గలిగిన పరిస్థితి ఈ రోజు ఉందా? సత్యమూర్తిని గెంటివేసిన పీపుల్స్‌వార్ గ్రూపు కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు. ఏ గ్రూపుకూడా అన్ని కోణాల నుండి ప్రజల్ని చైతన్యపరిచే కార్యక్రమం తీసుకోలేకపోయింది. మార్క్సిస్టు -లెనిస్టులుగా ఈ రోజు సత్యమూర్తి గురించి మాట్లాడేవారు, ఆయన ప్రజల మనిషాకాదా అని చర్చించేవాళ్ళు, ప్రశ్నించేవాళ్ళు విప్లవం పేరుతో పితృస్వామికభావ జాలల రొంపిలో దిగబడి చేస్తున్న చర్యలకు సమాధానం చెప్పుకోవాలి? వీటి గురించి పట్టించు కోకుండా, వీటిగురించి ఆలోచించకుండా గుడ్డిగా ఏదో ఒక గ్రూపును నమ్మటం, దాని అరాచకాలను భుజాన వేసుకుని ప్రచారం చేయటం మార్క్సిస్టు లెనినిస్టులుగా చేయదగిన పనికాదేమో?

- ఉష, హైదరాబాద్

(దీనిపై చర్చను ముగిస్తున్నాం.సం॥)

చట్టాలు - సలహాలు

"నలుపు" పత్రిక చాలా బాగున్నది. దళితుల, సాంఘిక ఆర్థికాభివృద్ధికి దోహదపడే దళితుల చైతన్య జ్యోతిలాగా, ఉన్నది. దళితుల సామాజిక చరిత్రను తెలియచేస్తూ, వారి విముక్తికి, అభివృద్ధికి, ప్రధానమైన పాత్ర వహించుచున్నది. "నలుపు" ప్రతి భారతీయ దళితుని దగ్గరకు చేరినపుడు తప్పకుండా, దళిత ఉద్యమంలో భాగస్వాములు కాగలరు. దళితుల, అభివృద్ధి కార్య క్రమాలకు సంబంధించిన G.Oలను, ఏఏరంగాలలో ఏఏ అవకాశాలు, దళితులకు, ప్రభుత్వము ప్రకటించు చున్నదో, వాటి G.O వివరాలు కూడా "నలుపు"లో ప్రకటిస్తే బాగుంటుంది. చట్టాలు - సలహాలు, లాంటి విషయాలు, దళితుల వైజ్ఞానిక అభివృద్ధికి దోహదపడతాయి. ప్రభుత్వము ప్రకటించే అభివృద్ధి కార్య క్రమాలను తెలుపు, G.O వివరాలను కూడా ప్రకటిస్తే, దళితులు, వాటిని సద్వినియోగ పరచుకొనగలరు.

- పి. కోటయ్య

దుర్గి (మ.ప్ర)

దీర్ఘకాలం కొనసాగాలి

ఈ రోజు దిన పత్రికల వెలుగునే చూస్తున్న జనానికి "నలుపు" ద్వారా ఆ వెలుగు వెనుక చీకటిని చక్కగా వివరిస్తూ పల్లెలూ, పట్టణాలు, గూడేలూ అనకుండా భూస్వాములు, పెట్టుబడి దార్లు, ప్రభుత్వాలు అనే వ్యత్యాసాలు లేకుండా అన్యాయాన్ని, అక్రమాలని, దోపిడీలను ప్రజలకు వివరిస్తున్నందుకు చాల సంతోషంగా ఉంది. ప్రజల మధ్య విభేదాలు తెస్తున్న "ప్రజలమనుషుల' వెనుక ఉన్న చీకటిని ప్రజలకు వివరించిన "నలుపు" ప్రజల పక్షపత్రిక దీర్ఘకాలంగా కొనసాగలని కోరుచున్నాను.

హన్మంతు

నిర్మల్.

ఉత్తర భారతంలో కొత్త ప్రభుత్వాలు

ఇంచుమించు పార్లమెంటు ఎన్నికల్లో ఎలా అయితే ఓటు వేశారో, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అలానే ఓటు చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను గద్దెదించారు. మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్ తప్ప మిగిలిన ఏ రాష్ట్రం లోనూ స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకీ దక్కలేదు. మహారాష్ట్రలో కాంగ్రెస్ (ఐ) ఎలాగో గట్టెక్కానని పించుకున్నది. ఈ రాష్ట్రంలో కూడా ఓటర్లు కాంగ్రెస్ (ఐ)కి పట్టం కట్టదలుచుకోలేదు. ఈ ఫలితాలు కాంగ్రెస్ (ఐ) వ్యతిరేకతను తెలియజేస్తున్నాయనటానికి సందేహం లేదు.

ఒక కాంగ్రెస్ వ్యతిరేకత మాత్రమే బయటపడిందా లేక వేరే అంశం ఏదైనా ఉన్నదా అంటే ఆయా రాష్ట్రాలలోని పరిస్థితులు విడిగా పరిశీలించవలసి ఉంటుంది.

ఈ ఎన్నికల్లో ఒకటి రెండు విషయాలు చాల స్పష్టంగా బయటపడ్డాయి. ఒకటి - ఓటర్లు సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీని ఓడించాలనుకోవటం; రెండు - అధికారాన్ని అందుకోవాలనుకున్న రాజకీయపార్టీలు డబ్బును, బలాన్ని విపరీతంగా వినియోగించటం. అటు కాంగ్రెసూ ఇటు ప్రతిపక్షాలూ ఎలా గయినా సరే అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నించాయి. స్వేచ్ఛగా, ప్రజలు తమకు ఇష్టం వచ్చిన పార్టీకి ఓటు వేసుకొనే పరిస్థితులు దాదాపు లేకుండా పోయాయి. డబ్బుకు లొంగడం లేదని తెలిసిపోయేసరికి హింసను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. అసలు ప్రత్యర్థులను ఎంపిక చేసుకునే దగ్గరనుంచి హింసకు అత్యంత ప్రాముఖ్యాన్ని ఇచ్చారు. తుపాకి పట్టుకొని అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేశారంటే అంతకంటే ప్రజాస్వామ్యం సిగ్గు పడవలసిన విషయం మరొకటి ఉండదు.

హార్యానాలో మేహం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పోటీ చేస్తున్న చోట ఎంతటి హింసాకాండ జరిగిందో చూస్తే సభ్య మానవ ప్రపంచం సిగ్గుతో తలెత్తుకోలేదు. ఒక ముఖ్యమంత్రి తిరిగి తాను ఎన్నిక అవటం కోసం ఎన్ని దారుణాలకైనా ఒడిగట్టటం చూస్తే అసలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుపుకొనే విషయంలో మరోసారి ఆలోచించు కోవాలేమో అనిపిస్తుంది. అంతచేసి కూడా ఆ ముఖ్యమంత్రి కుర్చీ దిగననటం, ఆ కుర్చీని ఎలాగయినా దక్కించుకోవాలని ప్రయత్నించటం, అతనిని ఆ కుర్చీ నుంచి దింపే సాహసం ఎవరూ చేయలేకపోవటం, కనీసం తప్పు అని కూడా ఖండించలేని దుస్థితిలో జనతాదళ్ ఈవేళ ఉన్నదంటే ఎంత దయనీయమైన స్థితిలో ప్రజాస్వామ్యం ఉన్నదో మనకు అర్థం అవుతున్నది. ఎన్నిక అయి, అధికారం చేజిక్కించుకోవటానికి ఈవేళ డబ్బు, బలప్రయోగం రెండూ అవశ్యకమయ్యాయి. ఈ పరిస్థితి నుంచి ప్రజలకు విముక్తి కలుగచేయలేకపోతే చాల ప్రమాదకరమైన పరిణామాలు సంభవిస్తాయి.

ఒకవక్క బలం, మరోవక్క డబ్బును ఉపయోగించి అధికారంలోకి రావటానికి ప్రయత్నిస్తుంటే ఇంకో పక్క మరో ప్రమాదకరమైన అంశం ఈ ఎన్నికల్లో కాలుమోపింది. అది మతశక్తుల ప్రభావం. మతం పేరుమీద, మతాన్ని రక్షిస్తామనే హామీమీద, మతాన్ని ఉద్ధరిస్తామనే ప్రచారం మీద రాజకీయశక్తులు అధికారంలోకి రావటం రాజకీయాధికారం కోసం మతాన్ని ఉపయోగించటం భారత దేశానికి కొత్తవిమీ కాదు. కాంగ్రెస్ చేస్తున్నపని అదే - అయితే దానికి మిగిలిన రాజకీయపార్టీలకు తేడా ఏమంటే కాంగ్రెస్ కనపడనీయ కుండా మతాన్ని వాడుకొనేది, మిగిలినవాళ్ళు బాహాటంగా చెప్పివాడుకుంటున్నారు. డబ్బు, బలప్రయోగం ఎంత ప్రముఖమైన పాత్ర వహిస్తున్నాయో మతం కూడా అంతే ప్రాముఖ్యాన్ని సంపాదించింది. ఇది మరీ ప్రమాద కరమైన పరిస్థితి.

మహారాష్ట్రలో శివసేన బిజెపి చేతులు కలిపాయి. బిజెపి జనతాదళ్ మరోచోట చేతులు కలిపాయి. సిద్ధాంతాలు, ప్రణాళికలు లేవు - ఒకటే కార్యక్రమం అధికారాన్ని సంపాదించటం. దానికి ఎవరితోనైనా సరే ఎటువంటి పొత్తు అయినా సరే! ఇది బాగా పనిచేసింది ఈ ఎన్నికల్లో. లౌకికశక్తులు, ప్రజాస్వామ్యవాదులు మరుగున పడిపోయాయి.

ఎన్నో ప్రవవాదాలకు గురి అవుతున్న ప్రజాస్వామ్యానికి ఇదే కొత్త ప్రమాదం తగిలింది. ఆకలి పోగొట్టటం కంటే, అజ్ఞానం నిర్మూలించటం కంటే, పేదరికాన్ని పారదోలటంకంటే, వసతి లేకుండా రోడ్ల మీద చెట్ల కింద నివసించటాన్ని లేకుండా చేయటం కంటే, మందిరాలకు ఇటుకలు మోయటం గాని గణేశునికి భజనలు చేయటం గాని ముఖ్యం కావటం అనేది ప్రజలకు, ప్రజాస్వామ్యంలోని జవాన్ని జీవనాన్ని పెల్చివేయటమే అవుతుంది. ఈ పరిస్థితిని మార్చటం తిరిగి రానీయకుండా చేయటం దేశానికి ఎంతో అవసరం!

ప్రజల కళాకారుడు – గద్దర్


అతను పాదం మోపితే జల పాతం జోరు. అతను గళం విప్పితే కడలి హోరు. అతను జన సముద్రంలో జలాంతర్గామి.

అతను ఎవరోకాదు పాట, నృత్యం, నటన కలగలిసి మూర్తీ భవించిన ప్రజాకళాకారుడు గద్దర్. ఏ పాట అయితే తరతరాలుగా జనపదాల సానువుల్లో జీవిస్తుందో ఏ పాట అయితే జానపదుల కళారూపంగా కదులుతూ ఉంటుందో ఆపాటకు పోరాటమనే జీవ ధాతువును సంధించి ప్రజల శ్రమైక జీవన సౌందర్య వ్యక్తీకరణగా తీర్చిదిద్ది తిరిగి ప్రజల చేతుల్లో పెట్టిన మహాకళా కారుడు గద్దర్.

జన నాట్యమండలి - గద్దర్ - పాటల సంగమం వెనుక సుదీర్ఘమైన చరిత్ర ఉంది. ఆ చరిత్ర ప్రజా కళాకారుల త్యాగాల చరిత్ర, నిర్బంధాల చరిత్ర, పోరాటాల చరిత్ర. ఆచరిత్ర క్రమానికి ప్రజల నుంచి - ప్రజలకు, అనే అవగాహన ఉంది. కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో తెలంగాణ ప్రజలు ప్రారం భించిన పోరాట ప్రభావం పాట, ఇతర సాంస్కృతిక కళా రూపాల పైకూడ పడింది. అప్పుడే పాట తన పాత రూపాన్ని మార్చుకుని ప్రజల శ్రమైక జీవన సౌందర్యాన్ని వ్యక్తీ కరించే వాహికగా రూపు దిద్దు కుంది. అపుటివరకు భూస్వామ్య భావజాలంతో కుళ్ళు కంపు కొడుతున్న కళారూపాన్ని ప్రజా కళారూపాలుగా ఎదిగిన కాలమది. పాట ప్రజా పోరాట వాణిగా రూపు దిద్దుకున్నది అప్పుడే.

ఏ పాట అయితే ప్రజల జీవన్మరణ పోరాటంలోంచి పుట్టు కొచ్చిందో, అదే పాట పోరాటం ఆగి పోయినపుడు స్ఫూర్తినిచ్చే శక్తిని, ఉత్తేజాన్ని కోల్పోయింది. "నీ భరతం పడతం కొడుకా నైజాం సర్కరోడా, అంటూ గర్జించిన అమర కళాకారుడు యాదగిరి తదితర వేలాది మంది ప్రజల ఆశయం అర్థవంతంగా నిలిచి పోయింది.

తర్వాత సాంస్కృతిక కళారంగం అనేక ప్రభావాలను, అవాంతరాలను, సిద్ధాంత రాద్ధాంతాలను ఎదుర్కొంటూ, నక్సల్బరి వసంత మేఘ గర్జన తిరిగి జన పదాల్ని మేల్కొలిపినపుడు పాటతన ఉడిగి పోయిన జవసత్వాలను స్ఫూర్తిని, ఉత్తేజాన్ని కలిగించే జీవధాతువును తిరిగి సంతరించుకుంది. ఆ ఊపును తిరిగి జననాట్యమండలి అందు



కున్నది. దీనికోచరిత్ర ఉన్నది. గద్దర్ అసలు పేరు. గుమ్మడి విఠల్‌రావు. విఠల్‌రావు పుట్టింది ఎపుడు కరువు కాటకాలతో విద్యా సాంస్కృతిక రంగాలలో తెలంగాణలో కెల్లా వెనుక బడ్డ జిల్లా పేరొందిన మెదక్ జిల్లాలో. గజ్వేల్ తాలూకా తూఫ్రాన్ అనే గ్రామంలో విఠల్ జన్మించాడు. విఠల్ తల్లి దండ్రులు అట్టడుగు వర్గానికి చెందిన హరిజన కార్మికులు. బాల్యంనుంచే అనేక అవమానాలకు గురయిన విఠల్ మెట్రిక్యులేషన్ వరకు తూఫ్రాన్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. అందుకే ఆయన కార్మికవర్గానికి చెందిన హరిజన కులంలో పుట్టడమే తాను గర్వంగా భావిస్తున్నాని, తాము సృష్టిస్తున్న సంపదలను దోచుకునే పాలకవర్గాలే బిచ్చగాళ్ళని తాము కాదని "గర్వంగా చెప్పు కోగలిగాడు." ఇప్పటికి భూస్వామ్య శకలాలు ఉన్న ప్రాంత మది. విఠల్‌రావు పేరు పెట్టు కోవడానికి కూడ అప్పటి తెలంగాణాలో అమలయిన భూస్వామ్య కుహనా సంస్కృతి ఉంది. అది గద్దర్ మాటల్లో చెప్పాలంటే. "నాకు ఎల్లయ్యో, మలయ్యో అని పేరు పెడితే మావూరి దొరలు ఎల్లిగా, మల్లిగా, అని పిలుస్తారని మా అయ్య విఠల్ రావ్ అని పెట్టిండు. అది నేను స్కూల్లో చదువు కుంటున్నపుడు నీకు రావెందుకని రావ్‌ను మా పంతులు తిసేషిండు. ఇప్పుడు విఠల్ మిగిలిందని" గద్దర్ ఇటీవల ఒకసారి చెప్పాడు. మెట్రిక్యులేషన్ పూర్తయిన తర్వాత విఠల్ ఇంజనీరింగ్ చదవడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో చేరాడు. తమ కుటుంబంలో అలుముకున్న పేదరికం వల్ల ఇంజనీరింగ్ పూర్తి చేయలేక పోయాడు. చిన్నప్పటినుంచే జానపద కళా రూపాలపై మక్కువ పెంచుకుని జీర్ణించుకున్న విఠల్ తన ఇంజనీరింగ్ చదువు అర్థాంతరంగా ముగియడంతో బుర్ర కథలు చెప్పడం మొదలు పెట్టాడు. అపుడే "బాపూజీ" పేరుగల బుర్రకథ చెప్పిన విఠల్‌ను విఠల్ బాపు అనే పేరుతో ప్రజలు పిలిచారు. ఇంజనీరింగ్ చదువుతున్న రోజుల్లోనే నక్సల్బరీ శ్రీకాకుళాల ప్రభావం పడ్డ విఠల్ "బాపూజీ" గూర్చి కథలు చెప్పే మార్గంలో ఎంతో కాలం కొనసాగలేదు. 1970 నాటికి పేద ప్రజల జీవితాలలో సాంస్కృతిక వికాసం

కోసం "ప్రజల నుంచి ప్రజలకు" అనే అవగాహనతో జంట నగరాల సమీపంలోని అల్వాల్ గ్రామంలో పని చేస్తున్న ఆర్టిలవర్స్ సంస్థలో చేరాడు విఠల్. అప్పటికి విఠల్ మార్గం, స్పష్టమయిపోయింది. ఆర్ట్‌లవర్స్ సంస్థ రాజకీయ విశ్వాసాల దృష్ట్యా తాను రచించే పాటలు ఎవరు రాసారో తెలియకుండా ఉండడానికి విఠల్ తాను ఎంచుకున్న కొత్త మార్గంతో పాటు ఒక కొత్త పేరు కోసం వెదికాడు బ్రిటిష సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల నుంచి భారతదేశ విముక్తికి రక్త తర్పణం చేసిన హర్దాయాల్ సింగ్ స్థాపించిన గదర్ పార్టీలోని "గదర్" అనే పేరు గోచరించింది. (గదర్ అంటే పంజాబీలో విప్లవకారుడనే అర్థం ఉంది). గదర్ అనే పేరే విఠల్ రావు స్థానే వచ్చి చేరింది. పేద ప్రజల ఉచ్చారణ వల్ల గదర్ గద్దర్‌గా మారి పోయింది. ఆర్ట్‌లవర్స్ సంస్థ జన నాట్య మండలిగా పరిణామం చెందింది. కమ్యూనిస్టు పార్టీ వర్గ సంకర రాజకీయాల వల్ల ప్రజాకళలు ప్రజలకు దూరమైనపుడు గద్దర్ తిరిగి వాటిని మేల్కొలిపి ప్రజల్లో విస్తృత ప్రచారం చేశాడు. గద్దర్ తాను రాసిన పాటలన్నటిలో పేద ప్రజల, కార్మికుల జీవన పరిస్థితులు వారి జీవద్భాష స్వీకరించాడు. వివిధ రకాల మాండలీకాలున్న ప్రాంతాలకు వెళ్ళినపుడు అక్కడి మాండలికంలోనే గద్దర్ ప్రదర్శన ఇస్తాడు.

గద్దర్ రాసిన పాటలన్నీ వివిధ వర్గాల ప్రజల పోరాటానికి ఉద్యుక్తులయ్యి అది కొనసాగిస్తున్నపుడు రాసినటువంటివే. అది ఉద్యోగుల పోరాటం కావచ్చు. గుడిసెవాసుల పోరాటం కావచ్చు. పోలీసుల సమ్మె కావచ్చు. అందుకే గద్దర్ పాటలలో జీవం, సమరశీల గుణం, సృజనాత్మకత ఉంది.

నిజానికి గద్దర్ వివిధ రకాల ప్రజల భాషలో పాటలు రచయించి తెలుగు సాహిత్యంలో నూతన ప్రయోగానికి నాంది పలికాడని చెప్పుకోవచ్చు. గద్దర్ పాటలలో విశాల వైవిధ్యం ఉంది. అందుకే ఆ పాటలు జనసామాన్యంలోకి చొచ్చుకు పోగలిగాయి. ఇంతేగాక గొప్ప ప్రకృతి రమణీయకత సహజ సిద్ధమైన దృశ్యాలు బొమ్మ కట్టెలా వచన కవిత కంటే మిన్నగా వచన కవితా,. పాటా అని పోల్చుకోని విధంగా, రాయడం, మరో గొప్పతనం. పాట అంటే ప్రజల జీవితాలను, చిత్రించి స్ఫూర్తిని కలిగించేదని ఎటువంటి ఆధునిక ప్రచార సాధనాలు లేకుండా, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయిన గద్దర్‌కు ప్రజా కళారూపాల ఆశయాల దృష్ట్యా తెలుగు సాహిత్య చరిత్రలో నూతన అధ్యాయాన్ని గద్దర్ ప్రారంభించాడనే చెప్పుకోవాలి. గద్దర్ రాసిన ప్రతి పాటకు ప్రసవ వేదన లాంటి వేదనతో పాటు ఈ సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న సాంఘిక దురాచారాలపై దోపిడి పీడనలపై కసి ఉక్రోశం ఉంది. ఇంతేకాదు తనతల్లి లాంటి పేద కార్మిక స్త్రీలు పడుతున్న కష్టాలకు పోరాటమే మార్గమని చెపుతూ "సిరిమల్లే చెట్టుకింద లచ్చుమమ్మో చినబోయి కూసున్న వెందుకమ్మో ఎందుకని" గద్దర్ ప్రశ్నిస్తాడు.

పాట ద్వారా ప్రజల్ని చైతన్యవంతం చేసున్న గద్దర్ పై ప్రభుత్వం దాడి చేసింది. దీని పర్యవసానమే ఎమర్జెన్సీ కాళరాత్రిలో 30 రోజుల పాటు తీవ్ర చిత్ర హింసలకు గురయ్యాడు. గుంటూరు, నిజామాబాద్ తదితర ప్రాంతాలలో జన నాట్యమండలి ప్రదర్శన లివ్వడానికి వెళ్ళినపుడు ఆయన బృందంతోపాటు పోలీసుల దౌర్జన్యానికి గురయ్యాడు. ఆయన నమ్ముకున్న మార్గం పట్ల ఆయనకున్న అచంచల దీక్షను ఈ నిర్బంధాలన్ని దృఢతరం చేశాయే తప్ప ఇవేవి అడ్డగించలేక పోయాయి.

1985 తర్వాత రాష్ట్రంలో రచయితల పై కళాకారులపై రాజ్యం తన కర్కశహస్తాలు చాచినపుడు గద్దర్ జలంతర్గామి అయ్యాడు. ఆయన పాట జననాట్యమండలి డప్పుల చప్పుడయి భారత దేశమంత ప్రతిధ్వనించింది. 1985లో జన నాట్యమండలి కేవలం రాష్ట్రానికి పరిమితమై పోతే 1990 నాటికి భారత దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రజా కళాకారులను తయారు చేసి జన నాట్యమండలి తనకు హద్దులు లేవని చాటి చెప్పింది.

గద్దర్ ఒక పత్రికా విలేఖరుల సమావేశంలో చెప్పినట్లు "నాలుకను కోసి, నేరుకుట్టేసి, జైల్లో బందిస్తే కాళ్ళ గజ్జలతో చప్పుడు చేస్తాను. కాళ్ళునరికేస్తే మొండెంతో పొర్లుకుంటూ డాన్సు చేస్తాను. చివరికి నన్ను ఉరి తీస్తే, రక్త చలన సంగీత స్మృతిఅయి అలలుగా జనసామాన్యంలోకి చొచ్చుకు పోతాను," అని ప్రకటించాడు.

జన నాట్యమండలి లాంటి సంస్థ వల్ల, తాను నమ్ముకున్న రాజకీయాల వల్ల తాను ఈ స్థాయికి చేరుకున్నానని వినయంగా చెప్పుకునే గద్దర్ దేశంలోనే మహాకళాకారుల కోవకు చెందినవాడు.



జననాట్యమండలి ప్రదర్శనలో ఒక భాగం

దచ్చన్న దారిలో....

గద్దర్

దచ్చన్న దారిలో
దచ్చన్న దారిలో
నీదారి నా దారి
పోరు దారేరో .... ||దచ||

దోపిడి రాజ్యమ్ములో
నీ యాస నా యాస
అడియాసలాయెరో
దచ్చన్న దారిలో .... ||దచ||

దొరల రాజ్యమ్ములో
దూపగంజి జీతమాయె
దూపదీర దాయెరో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
పుట్లకొద్దీ పండించి
పూటకు సస్తిమిరో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
పగడాల పంటదీసి
పస్తులు పంటిమిరో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
ఋద్దపైన కమ్ముకోని
రూపాయికి కొంటిమో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
అద్దాల మేడగట్టి
ఆకులల్ల బంటిమో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
దోసెడు రక్తం కొలిచి
పిడికెడు తింటిమిరో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
సెమట ధర తగ్గిందని
సమ్మెచేసి నందుకే
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
దొరలంతా గలిసి నిన్ను
సెరలేసినారురో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
కుమిలి కుమిలి మనసంతా
కుంపటైనాదిరో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
కాగి కాగి మనసంత
కాగ డైనాదిరో
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
సెరబోయ్యైనా నిన్ను
సెర యిడిపిస్తానే
దచ్చన్న దారిలో .... ||టచ||

దచ్చన్న దారిలో
కూలోళ్ల నందర్నీ
కూడగట్టుకోనిరో.
దచ్చన్న దారిలో .... ||దచ||

దచ్చన్న దారిలో
మిడతల దండోలె
దొర మీద బడుతరో
దచ్చన్న దారిలో .... ||దచ||

బజారున పడ్డ బట్టల మిల్లు కార్మికుల బతుకులు

కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ బట్టల మిల్లు కార్మికుల బతుకులు చిరిగిన కాగితాల్లా తయారయ్యాయి. ఏటా ఆరుకోట్ల రూపాయలు లాభాలు ఆర్జించిన సర్‌సిల్క్ బట్టల మిల్లు అకస్మాత్తుగా నష్టాలతో నడుస్తున్నదనే సాకుతో యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. నాలుగు వేలమంది కార్మికుల బతుకుల్ని రోడ్డున పడేసింది. మిల్లు మూతపడగా, పనులు లేక, తినటానికి తిండి లేక కార్మికులు ఎముకల గూళ్ళయినారు. వందమందికి పైగా కార్మికులు ఆకలి చావులకు గురయ్యారు. కార్మికుల పిల్లలు చదువులు మానేసి వీధుల్లో అడుక్కుంటున్నారు. మిల్లు మూతపడి ఐదేళ్లు పూర్తి కావొస్తుంది. కార్మికుల బతుకుదెరువు కోసం ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మిల్లును దోచుకొని, నష్టాల్లో ముంచి, మిల్లును ఖాయిలాపడ్డ పరిశ్రమగా ముద్రవేసి మూసేశారు. మిల్లు కార్మికులు ఎంత దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారో తెలియజేస్తుందీ వ్యాసం.

భారతదేశంలోని ప్రధానమైన పరిశ్రమల్లో సర్‌సిల్క్ బట్టల మిల్లు ఒకటి. గ్రామీణ ప్రజలకు అతి చౌకగా నాణ్యమైన బట్టలను ఉత్పత్తి చేయడంలో ప్రముఖపాత్ర వహించింది. సర్‌సిల్క్ బట్టల మిల్లుకు అదిలాబాదు జిల్లా కొత్తపేటలో 1952లో పునాదులు పడ్డాయి. మిల్లు 1954లో ఉత్పత్తిని ప్రారంభించింది. 1952-1970 వరకు బిర్లా యాజమాన్యం, అధికారులు, మేనేజింగ్ ఏజెంట్లుగా ఉండి మిల్లును నడిపించారు. మేనేజింగ్ ఏజెన్సీ తొలిగి, సర్‌సిల్క్ బోర్డు ద్వారా బిర్లా యాజ మాన్యం అధికారులు మిల్లును నడిపారు. సర్‌సిల్క్ మిల్లు మేనేజ్ మెంట్ పూర్తిగా బిర్లాలదే. ఈ మిల్లులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాటా 27% నిజాం చారిటబుల్ ట్రస్టు వాటా 46%, పబ్లిక్ షేర్లు 27% మిగిలిన 3% మాత్రమే బిర్లాషేర్లు.

కొత్తపేట ప్రాంతం దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, చల్లని ప్రదేశం కావడంతో బట్టల పరిశ్రమకు అనువైన ప్రాంతం. అంతేగాక, ఆంధ్ర, మహారాష్ట్ర సరిహద్దున ఉండటం వల్ల ఉత్పత్తి అయిన సరుకులను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయటానికి, పరిశ్రమకు కావలసిన ముడిసరుకులు తెచ్చుకోటానికి రైలు, రోడ్డు రవాణాసౌకర్యాలు ఉన్నాయి. సర్‌సిల్క్ మిల్లు నిర్మాణాన్ని ఆదివాసులతో అతి తక్కువ జీతభత్యాలు చెల్లించి పూర్తిచేశారు. మిల్లుకు కావలసిన బొగ్గును సింగరేణి కాలరీసు నుంచి తెప్పించుకున్నారు. దగ్గర్లోనే పెద్దవాగు ఉండటం వల్ల కావలసినంత నీరు. సమీపంలోని రామగుండం థర్మల్ విద్యుత్తును వినియోగించుకున్నారు. సర్‌సిల్క్ బట్టల మిల్లుకు నైపుణ్యంగల నేతకార్మికుల్ని భీవండీ, బొంబాయి, ఆంధ్రరాష్ట్రం నుంచి రప్పించుకోగలిగారు. నైపుణ్యంగల కార్మికులను ఎన్నో ఆశలుపెట్టి, ప్రయాణఖర్చులు తామే చెల్లించి, ముందే డబ్బు ఇచ్చి తీసుకువచ్చారు.

సర్‌సిల్క్ బట్టల మిల్లులో ముడిపత్తిని శుభ్రపరిచి ఏసిడ్‌తో కరిగించి సెల్యులోన్-ఎసిటేట్ తయారుచేసి దానిని ఎసిటోల్‌లో కరిగించి సిల్క్ దారం తీస్తారు. ఇట్లా చేయడం వల్ల దారం మెరుస్తూ, నాణ్యత కలిగి ఉంటుంది. ఈ దారానికి అందమైన రంగులు అద్దుతారు. ఈ రంగుదారాలు చేనేత కార్మికుల చేతుల్లో వస్త్రాలుగా తయారుఅవుతాయి. బట్టల మిల్లులోని బట్టలకే కాక, మిల్లులో తయారయ్యే దారం, స్టైపుల్‌కు కూడా మంచి డిమాండ్ ఉంది. బట్టలు, దారం పేద ప్రజలు కొనడానికి అందుబాటులో ఉండేవి. చిన్న పరిశ్రమలు ఈ మిల్లులో తయారయిన దారంను కొని స్టైపుల్‌గా వాడి జవుళి వస్త్రాలు, బ్లాంకెట్లు వగైరాలు తయారుచేసేవి. ఎన్నో చిన్న పరిశ్రమలు సర్‌సిల్క్ మిల్లుపై ఆధారపడి నడిచేవి. ఈ మిల్లులో ఉత్పత్తి అయ్యే ఏ వస్తువునైనా మార్కెటులో అమ్మవచ్చు. కెమికల్ కాటన్ పేపరు మిల్లు పరిశ్రమకు ఉపయోగపడేది. ఎసిటోన్ యాసిడ్, ఎసిటిక్ ఎన్ హైడ్రాయిడ్ డిఫెన్స్ ఫ్యాక్టరీలకు అమ్మేవారు. ఇన్ని హంగులతో, అనేక డిపార్టుమెంట్లు ఒకే చోట ఉండటంతో ఇంజనీరింగ్, సర్వీసింగ్, జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లకు అయ్యే ఖర్చులు చాల తక్కువగా ఉండేవి.

మిల్లుకు కావలసిన ముడిసరుకులు కాటన్ లింటర్స్, ఈథైల్ ఆల్కహాలు మన దేశంలో పుష్కలంగా లభ్యమవుతాయి. కాటన్‌లింటర్స్‌ను మహారాష్ట్ర, గుజరాత్, ఆదేని నుంచి దిగుమతి చేసుకున్నారు. ఆల్కహాలు బోధన్‌లోని చక్కెర కార్మాగారం నుంచి సరఫరా అయ్యేది.

సర్‌సిల్క్ మిల్లులో 1900 మంది పర్మినెంట్ కార్మికులు, 1000 మంది క్యాజువల్ కార్మికులు, 500 మంది కాంట్రాక్టు కార్మికులుగా కష్టపడి పనిచేశారు. 700 మంది ఉద్యోగ సిబ్బంది ఉండేది. పర్మినెంట్ కార్మికులకు 450/- నుంచి 800/- రూపాయలు నెలసరి వేతనంగా ఉండేవి. టెంపరరీ కార్మికులకు రోజువారీ వేతనం 12/- రూపాయలు ఉండేది. సిబ్బందికి 450/- నుంచి 1000/- వరకు జీతం చెల్లించేవారు. సీనియర్ అధికారులకు 3000/- నుంచి5000/- వరకు వేతనాలు ఉండేవి.

కార్మికుల పరిస్థితి:

ఈ మిల్లును స్థాపించిన కొత్తలో కార్మికుల్ని బానిసలు కన్నా హీనంగా పరమనికృష్టంగా హింసించేవారు. యాజమాన్యాన్ని నిలదీసి అడిగే ధైర్యం కార్మికులకు ఉండేదికాదు.ఎవరైనా అన్యాయాన్ని సహించలేక ఎదిరిస్తే, దారుణంగా కొట్టి వీధుల వెంట తిప్పి నీచంగా అవమానించేవారు. రోజుకు 12 గంటలు మిల్లులో పనిచేయాలి. మిల్లులోని పనికాక, అధికారుల ఇళ్ళల్లో కూడా ఊడిగం చేసేవారు. కార్మికుల్ని బెదిరించుకొని పనులు చేయించుకొనేవారు అధికారులు. కార్మికుల్లో కొందరు దృఢకాయుల్ని చూసుకొని యాజమాన్యం గుప్పిట్లో ఉంచుకునేది. వారికి పనులు చెప్పక, చెప్పినా సులువైన పనులు చెబుతూ కార్మికులపై అజమాయిషికి పెట్టేవారు. యాజమాన్యాన్ని తిట్టేవారిని వీరు కని పెట్టుకుని ఉండేవారు. ఎదిరించే కార్మికుల్ని దారుణంగా కొట్టేవారు. పనుల నుంచి తీసేసేవారు. కొందరికి ఇంక్రిమెంట్లు ఆపేసేవారు. ఫలితాలు ఇంతదారుణంగా ఉండడంతో ఎవరూ అధికారుల అన్యాయాలను ఎదిరించే వారుకారు. 1972 వరకు మేనేజ్ మెంటును ఎదిరించినందుకు అధి కారులు నియమించుకున్న గుండాల చేతుల్లో 18 మంది చేనేత కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

1962 నుంచి 1972 వరకు సర్‌సిల్క్ మిల్లు డైరెక్టరుగా సింగ్ ఉన్నాడు. 1972 . సంవత్సరంలో ఎన్నికలు లేకుండానే కేశవులు కార్మిక సంఘం నాయకుడుగా ఉన్నాడు. 1975 వరకు ఓటింగ్ ద్వారా యూనియన్ నాయకులను ఎన్నుకునే పద్ధతి లేదు. 1975లో ప్రప్రథమంగా ఓటింగు ద్వారా కేశవులును యూనియన్ నాయకుడు గా ఎన్నుకున్నారు. 1972 నుంచి కార్మికులు తమ సమస్యలను కార్మిక సంఘం నాయకుల ద్వారా మిల్లు అధికారుల చేత పరిష్కరించు కున్నారు. 1972 కార్మిక వేతన ఒప్పందం వల్ల రోజుకు కార్మికునికి కనీస వేతనం 25/- రూ॥లు నిర్ణయించారు. కాని 1972లో రోజువారీ వేతనం 18 రూ॥లు, 1973లో 21-50 రూ.లు, 1974లో 25 రూ.లు వేతనం చెల్లించారు.

ఒప్పందాలు

కార్మికుల కనీస సౌకర్యాల కోసం, వేతన సవరణల కోసం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఒప్పం దాలు జరిగేవి. జరిగిన ఒప్పందాలను అధికారులు అమలుపరిచేవారుకారు. 1985లో చేనేత కార్మికునికి నెల వేతనం 550/- రూపాయలు చెల్లించేవారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశా న్నంటుతుంటే, కుటుంబాలను పోషిం చుకోవడానికి కార్మికులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. కార్మికులు అప్పుల భారంతో కుంగిపోయారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేశారు.

మిల్లు మేనేజర్ కార్మికులతో, యూనియన్‌తో సంప్రదించి, వేతనాలు పెంచుతామని చెప్పి హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ్నుంచి కలకత్తాకు వెళ్లి, సర్‌సిల్క్ మిల్లు లాకౌట్ ప్రకటించాలని అధికారులకు సమాచారం పంపాడు. 1985 ఏప్రిల్ 25న అర్ధరాత్రి మిల్లుకు తాళాలు వేసి లాకౌట్ బోర్డు తగిలించారు.

మిల్లు అధికారులు, యూని యన్‌తో కలిసి మిల్లు లాభాలను పంచుకొని, మిల్లు నష్టాలతో నడు స్తున్నదని, తప్పుడు లెక్కలు చూపుతూ ప్రభుత్వం నుంచి సహకారం పొందే వారు. మూడు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ కోసం ఒప్పందం జరిగిన ప్రతిసారీ 2 కోట్ల రూపాయలు అప్పుగా తీసుకొనేవారు. అప్పు 9 కోట్లు తీసు కోగా, వడ్డీ మరి 2 కోట్లకు చేరింది. 1985లో మళ్లీ ఒప్పందం సమయంలో ప్రభుత్వాన్ని అప్పు అడిగారు. బకాయి తీర్చనందుకు అప్పు ఇవ్వడం కుదర దని ప్రభుత్వం అప్పు ఇవ్వటానికి నిరాకరించింది. ఇదే అదనుగా చూసు కొని యాజమాన్యం మిల్లు లాకౌట్ ప్రకటించింది. కార్మికులు ఉత్తి చేతులతో రోడ్డున పడ్డారు.

దయనీయస్థితి:

మిల్లు లాకౌట్ ప్రకటించడానికి యాజమాన్యమేకాక, కార్మిక సంఘాల చేతకానితనం కూడా కారణం. మిల్లు నష్టాలతో నడుస్తున్నదని తెలిసినా బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చర్య తీసుకోలేదు. యూనియన్ కూడా యాజమాన్యాన్ని మిల్లు ఎందుకు నష్టాలతో నడుస్తున్నదో అడిగిన పాపాన పోలేదు. యూనియన్ నుంచి ఎలాంటి వత్తిడి లేదని తెలిసే యాజమాన్యం లాకౌట్ ప్రకటించగలి గింది. లాకౌట్ మూలంగా కార్మిక కుటుంబాలు దయనీయస్థితిలో జీవనం గడుపుతున్నారు. చాలమంది కార్మికులు మిల్లు గేట్లు తెరుచుకుంటా యేమోనని ఎదురుచూస్తూ ఉండి పోయారు. మరి కొందరుకుటుంబాల్ని వదిలి బొంబాయి, భీవండి, సూరత్ పట్టణాలకు బతుకుదెరువుకోసం వలసపోయారు. మరికొంతమంది బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, రామకృష్ణాపూర్ ప్రాంతాలలో రకరకాల కూలీపనులు చేస్తున్నారు. మరి కొందరు కార్మికులు వీధుల్లో అడుక్కుంటున్నారు. నువవారు 1000 మంది సర్‌సిల్క్ కార్మికులు ఇటుకలు తయారుచేస్తున్నారు. ఇటుక బట్టీలలో షిర్కెక్వాటర్ల నిర్మాణంలో సిమెంట్ కలిపి అందించే కూలీలుగా రోజువారీ వేతనం కోసం పనిచేస్తున్నారు. కొందరు చిన్న చిన్న టేలాలు, బళ్ళు పెట్టుకొని, అమ్ముకుంటున్నారు. కాన్వెంట్లలలో, స్కూళ్ళల్లో ఎంతో శ్రద్ధగా చదివిన వందలాదిమంది కార్మికుల పిల్లలు వీధుల్లో తిరుగుతూ బిచ్చం అడుక్కుంటున్నారు. హోటళ్ళలో, అధికారుల ఇండ్లలో పనిచేస్తున్నారు. చాలమంది కార్మికులు తమ పిల్లల చదువులు మాన్పించారు. ఎదిగిన పిల్లలకు వివాహాలు చేయలేక మానసికక్షోభ అనుభవిస్తున్నారు. రోజువారీ ఖర్చులకు, రోగాలకు ప్రావి డెంట్‌ఫండ్, జీవితభీమా డబ్బులు ఖర్చు చేసుకొని నానా ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు కార్మికులు మతిస్థిమితం పోగొట్టుకొని పిచ్చి వారయ్యారు. వందలాదిమంది తిండి

లేక అస్వస్థత పాలైనారు: దుర్భర దారిద్ర్యాన్ని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొందరు మిల్లు ముందే చెట్లకు ఉరేసుకున్నారు. ఆకలిచావులకు గురైనారు. ఇలా మరణించిన వారు 100కు పైగానే ఉంటారు.

సర్‌సిల్క్ మిల్లు కార్మికులకు సింగరేణిలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ప్రభుత్వం జి.ఓ. విడుదల చేసింది. కాని సింగరేణిలో ఒక్క మిల్లు కార్మికునికి కూడా ఉద్యోగం లభించలేదు. సింగరేణి గనుల్లో ఉద్యోగాలిస్తున్నారని ప్రకటించగానే సంతోషపడిన కార్మికులకు 34 ఏళ్ళ లోపువారికే ఉద్యోగాలు ఇస్తారని, అది కూడా నియామకాల ప్రకారం పరుగు పందెంలో పాల్గొనాలని నిబంధనలు పెట్టారు. ఉద్యోగ వయోపరిమితి సర్‌సిల్క్ కార్మికులలో చాలమందికి దాటిపోయింది. నిజానికి మిల్లులో ఉద్యోగాలు కోల్పోయిన 4100 మంది కార్మికుల్లో ఏ ఒక్కరికీ సింగరేణిలో ఉపాధి లభించలేదు.

మరోవైపు మిల్లులోని యంత్రాలు తుప్పుపట్టి పాడై పోయాయి. వాటిని మరమ్మత్తు చేయటానికి, నిర్వహణకు నాలుగున్నర కోట్ల రూపాయలు అవసరమని సాంకేతిక నిపుణులు తెలియజేశారు. ప్రభుత్వాధికారులతో రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో రెండున్నర కోట్ల రూపాయలు ఎన్.సి.డి.సి. విడుదల చేయటానికి అంగీకారం కుదిరింది. కాని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక కోటి, వాటా ధనం కింద మరోకోటి వసూలు చేయటానికి యూనియన్ నాయకులు ప్రయత్నించడం లేదు. మిల్లు కార్మికులు తమ బతుకులకు విలువనిచ్చే యూనియన్ లేకపోయిం దని వాపోతున్నారు.

కార్మిక కాలనీలో కనీస సౌకర్యాల కోసం సర్‌సిల్క్ జి.ఎం.ను ఘెరావ్ చేసిన మహిళా కార్మికులు

సర్‌సిల్క్ మిల్లు ఐదేళ్లుగా మూతపడి ఉండడంతో, చేనేత కార్మికులు కూలి, నాలి చేసుకుంటూ కొన ఊపిరితో బతుకులీడుస్తున్నారు. గోరు చుట్టుపై రోకటి పోటులా ఇలాంటి దయనీయస్థితిలో మంచినీరు, కరెంటు లాంటి కనీస సౌకర్యాలను కూడా కార్మికులకు లభించకుండా యాజమాన్యం నిలిపివేసింది. 1989 ఆగష్టు 13న సర్‌సిల్క్ మిల్లు కార్మికవాడలో మంచినీరు, విద్యుత్తు సరఫరాకు కోత విధించినందుకు నిరసనగా మహిళా కార్మికులు సర్‌సిల్క్ జనరల్ మేనేజర్ శాయోజిరావును ఘెరావ్ చేశారు. అదే రోజు జిల్లా కలెక్టరు ఎ.కె.గోయల్ కాగజ్‌నగర్‌కు రావడంతో మహిళా కార్మికులు తమ బాధలను కలెక్టరుకు విన్నవించుకున్నారు. కార్మికులకు భృతికల్పించలేని ప్రభుత్వం కనీసం తాగేందుకు మంచినీరు కూడా సరఫరా చేయకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్మికుల విజ్ఞప్తి మేరకు కలెక్టరు మరునాడు కార్మికవాడల్లో పాదయాత్ర చేసి, పరిస్థితులు స్వయంగా పరిశీలించి, కార్మికులకు కనీస సౌకర్యాలను తీర్చాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.

ఆదర్శజిల్లాలో సర్‌సిల్క్ కార్మికులు లాకౌట్ అనే శాపంతో శాపగ్రస్తులైనారు. కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిమరణాలు ప్రభుత్వ లెక్కల్లోకి చేరడంలేదు. కార్మికుల ఆకలికేకలు, ఆర్తనాదాలు ప్రభుత్వం చెవికి సోకడం లేదు. కొందరు రాజకీయనాయకులు సర్‌సిల్క్ మిల్లును తెరిపించటానికి ఆమరణ నిరాహారదీక్షలు జరుపుతామంటే, మరికొందరు నాయకులు సర్‌సిల్క్ కార్మికులకు ఉపాధి కల్పిస్తామని వాగ్దానాలు చేశారు. నాయకులు వాగ్దానాలు నీటిమూటలని రుజువయ్యాయి.

సర్‌సిల్క్ మిల్లు వల్ల ఏటా 3 కోట్ల రూపాయలు లాభాలు రాగలవని ఐ.డి.బి.ఎల్. సూచించింది. ఎ.పి.ఐ.టి.సి.ఓ. దీన్ని బలపరిచింది. ఇదివరకే సర్‌సిల్క్ మేనేజ్‌మెంటే మిల్లు ద్వారా 5 కోట్ల రూపాయలు లాభం ఆర్జించవచ్చని అంచెనా వేసింది.

మిల్లును ఇప్పుడు బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అప్పగించినట్లు తెలుస్తున్నది. కార్మికులకు మిల్లులో భాగస్వామ్యం ఉండే విధంగా వర్కర్స్ కో ఆపరేటివ్ సొసైటీద్వారా నడిపించాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ఏదిఏమైనా సర్‌సిల్క్ మిల్లును నడిపించటానికి కొత్త ప్రభుత్వం ప్రయత్నించాలని కార్మికులు కోరుకుంటున్నారు.

– సి.హెచ్. సాంబయ్య

PARTICULARS OF OWNER SHIP IN RESPECT OF NALUPU

FORM IV

1.	Place of Publication	Hyderabad
2.	Periodicity of its Publication	Telugu Fortnightly
3.	Printer's	
	a) Name	Cyril Reddy
	b) Whether Citizen of India	Yes
	c) Address	1-1-342/B, Viveknagar, Hyderabad - 20
4.	Publisher's	
	a) Name	Cyril Reddy
	b) Whether Citizen of India	Yes
	c) Address	1-1-342/B, Viveknagar, Hyderabad - 20
5.	Editor's	
	a) Name	B Tharakam
	b) Whether Citizen of India	Yes
	c) Address	1-10-24, Ashok Nagar Hyderabad - 20
6.	Names and Address of Individual who own the Magzine and Partner of share holders holding more than one Percent of the total Capital	Hyderabad Book Trust 1-1-342/B, Viveknagar, Hyderabad - 20

I, Cyril Reddy here by declare that the Particulars given above are true to the best of my knowledge and belief

1-3-1990

Sd/-
Cyril Reddy
Publisher

ఏజెన్సీని మింగుతున్నారు

మైదాన ప్రాంతము నుండి, ఏజెన్సీ ప్రాంతానికి వలస వచ్చిన గిరిజనేతర భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ దళారులు, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని అనేక అక్రమ పద్ధతుల ద్వారా గిరిజనులను దోపిడీ చేస్తూ వారి భూములను కాజేసారు. గిరిజనులను ఆర్థిక క్షీణతకు గురిజేసారు. అదే రీతిలో తూర్పు గోదావరిజిల్లా - దేవీ పట్నం మండలం గోదావరీ తీరాన గల పురాతన గిరిజన కుగ్రామం 'నేలకోట'లో జరిగింది. సుమారు 500 జనాభాగల, 150 కొండరెడ్డి గిరిజన కుటుంబాలు నివసిస్తున్న, నేలకోట గ్రామం బ్రిటిష్, రెడ్డి రాజుల పాలన కూడా చవిచూసింది. సుమారు 40 సంవత్సరాల పూర్వం గిరిజనుల అధీనంలో ఉన్న 500 ఎకరాల సాగుభూమికి ఇప్పుడు 20 ఎకరాలు మాత్రమే ఉంది. మిగిలిన సాగుభూమి మైదాన ప్రాంత సరిహద్దు గ్రామాలైన రామచంద్రపురం, పురుషోత్తపట్నం వంగలపూడి మొ॥లగు గ్రామాల ధనిక రైతుల, వ్యాపారుల హస్తగతమయింది. బ్రిటిష్, రెడ్డిరాజుల పాలనలో బ్రతికినంత కాలం గిరిజనులు గూటాల ఎస్టేటుదారునకు కప్పం చెల్లించారు. స్వాతంత్రానికి ముందు సాగుచేసికున్న భూములు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కోల్పోయామని గిరిజనులు చెబుతున్నారు. అయితే మిగిలిన గిరిజన ప్రాంతములో భూసమస్య పరిస్థితులకు, వీరి పరిస్థితులకు భిన్నంగా ఉంది.

1945-50 మధ్యకాలంలో నేలకోట గ్రామంలో పెద్ద ఎత్తున కలరావ్యాధి సోకింది. పెద్దసంఖ్యలో ప్రాణనష్టం జరిగి గిరిజనులలో భయభ్రాంతులను సృష్టించింది. వ్యాధి సోకడానికి కారణం మూఢనమ్మకంతో కొండ దేవత ఆగ్రహంగా భావించారు. ఆనాటి పెద్దలు కొంతకాలం గ్రామం, భూములు, ఇండ్లు వదలి దూరంగా వెళ్ళి జీవించాలని నిర్ణయించారు. తమ అవసరాల నిమిత్తం సరిహద్దు మైదాన ప్రాంత గిరిజనేతర భూస్వాములు, వడ్డీవ్యాపారుల నుండి స్వల్పంగా డబ్బు, ఆహార ధాన్యాలు అప్పుగా తెచ్చుకున్నారు. గిరిజనుల లేమితనాన్ని ఆసరాగా తీసికుని గిరిజనేతరులు, గిరిజనుల సాగుభూమిని ఆక్రమించుకున్నారు. సంవత్సరకాలం తర్వాత తిరిగి గిరిజనులు నేలకోట చేరుకున్నారు. అప్పటికే భూములన్నీ గిరిజనేతర భూస్వాములు కబలించారు. గిరిజనులు తమ భూములు తమకు అప్పగించమని ఆక్రమదారులను కోరినప్పటికి అప్పగించలేదు. తప్పుడు లెక్కలు, వడ్డీలు, చూపించి బెదిరించి దొంగ కాగితాలపై వేలిముద్రలు వేయించుకున్నారు. నేలకోట గ్రామానికి చెందిన తుమ్మిడి రామిరెడ్డి కుటుంబం, నాగారపు రామమూర్తి అనే భూస్వామి వద్ద 12 కుంచాల ఎర్రధాన్యం అరువు తీసికుని తమ 12 ఎకరాల సాగు భూమిని కోల్పోయాడు. ఈ విధంగానే మిగిలిన గిరిజన కుటుంబాలు కూడా వారి భూములను పోగొట్టుకున్నారు.

అయితే గిరిజనేతర దోపిడీ, దౌర్జన్యాలను ప్రతిఘటించాలనే ఉద్దేశ్యంతో, గిరిజనేతర దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా 1965-70 మధ్యలో కమ్యూనిస్టు విప్లవకారుల నాయకత్వంలో ఏజెన్సీ గిరిజన సంఘం ఆవిర్భవించింది. నేలకోట గిరిజనులు తమ పంట భూముల కొరకు గిరిజన సంఘం ఏర్పరచి పోరాడారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం "నక్సలైట్ల" అణచివేత పేరుతో పోలీసు క్యాంపులు నెలకొల్పి గిరిజన సంఘ కార్యక్రమాలు సాగనివ్వకుండ అణచివేసింది. గిరిజనేతర భూస్వాములు పోలీసులతో కుమ్మకై గిరిజనులపై దాడి చేయించారు. గిరిజన ప్రజల ఆస్తులు, ఇండ్లను ధ్వంసం చేయించారు. గిరిజనులు భయపడి గ్రామం కూడా వదిలి పోవటం జరిగింది. గిరిజనులు నిరాశ్రయులైనారు. గిరిజన రైతులు దినకూలీలుగా మారిపోయినారు.

నేలకోట గిరిజనులు తమ భూమిని తిరిగి తమకు అప్పగించమని, గిరిజన రక్షణ చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వ అధికారులకు ఎన్నో సార్లు మొర పెట్టుకున్నారు. గిరిజనుల ఆర్తనాదాలు ప్రభుత్వం పెడచెవిని పెట్టింది. గిరిజన సదస్సులలో ఇస్తున్న ప్రభుత్వ అధికారుల హామీలు ఎండమావులుగా మిగిలాయి. అధికారులు భూములు ఇప్పిస్తారని ఆశతో అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అధికారులు మారినప్పుడల్లా కొత్త కొత్త హామీలు యిస్తూనే ఉన్నారు. గిరిజన చట్టాలు అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఇదిలా ఉండగ గిరిజనేతరులు గిరిజనుల భూములపై తప్పుడు రశీదులు సృష్టించి, దొంగపట్టాలు సంపాదించారు. ఆపట్టాల ఆధారంగా కోర్టుల నుంచి 'స్టే'లు కూడా పొందారు. కోర్టుల ద్వారా గిరిజనులకు భూమి ఇప్పిస్తామనే సాకుతో దళారీలు, లిటిగెంట్లు పైరవీలు చేసి పెద్ద ఎత్తున డబ్బు గుంజారు. గిరిజనుల పరిస్థితి గోరుచుట్టుపై రోకలిపోటు అయింది. గిరిజనేతరుల దోపిడి దుశ్చర్యలకు కడుపు మండింది. ప్రభుత్వ అధికారుల అలసత్వం, నిర్లక్ష్య వైఖరికి అసంతృప్తి పెల్లుబికింది. గిరిజనులందరూ సంఘటితమయినారు. 'పోరాటం' ఒకటే సరైన మార్గమని ఎంచుకుని, ఆ మార్గంలో నడుస్తున్నారు. గ్రామంలో రైతు - కూలీ సంఘం స్థాపించుకున్నారు. 1989 డిసెంబరు నెలలో నేలకోట సరిహద్దులలో భూస్వాములు సాగు చేసిన పంట భూములను ఆక్రమించి సుమారు 30 ఎకరాల వరిపంటను గిరిజనులు కోసి, నూర్చి ధాన్యం పంపిణీ చేసుకున్నారు. భూస్వాములు తమ పంటలకు రక్షణ కల్పించమని అధికారులకు ఫిర్యాదు చేసారు. దేవీపట్నం ఎమ్.ఆర్.ఒ నేలకోట ప్రాంత సరిహద్దు పంట భూమిలోనికి ఎవ్వరూ వెళ్ళరాదని ఆంక్షలు విధించారు. గిరిజనుల పోరాటానికి అండగా జిల్లా రైతు-కూలీ సంఘం నిలిచింది. సుమారు 150 ఎకరాల పంటను కోసి గిరిజనులు స్వాధీనం చేసుకున్నారు. దానిలో మధ్యతరగతి గిరిజనేతర రైతులకు సగభాగం ఇచ్చారు. ఇది భూస్వాములకు కన్నెర అయింది. గిరిజనుల పోరాటానికి ఆటంకం కల్గించాలనే ప్రయత్నంతో గిరిజనులపై భౌతికంగా దాడులు మొదలు పెట్టారు. గిరిజనులపై సాగిస్తున్న దాడులను ఖండిస్తూ తమ భూములు తమకు తిరిగి అప్పగించాలని డిమాండు చేస్తూ సుమారు 200 మంది గిరిజన - స్త్రీ, పురుషులు ప్రదర్శనలు జరిపారు. అధికారులకు మెమొరాండం ఇచ్చారు.

— పి. త్రినాధరావు

మృత్యుముఖంలో ఖమ్మంజిల్లా ప్రత్తిరైతులు

గత ఏడాది ప్రకాశంజిల్లా ప్రత్తి రైతులు దిక్కుతోచక ఆత్మహత్యలకు పాల్పడగా అదే పరిస్థితి ఇప్పుడు ఖమ్మంజిల్లా పత్తిరైతులకు దాపురించింది. మళ్లీ ఈసారి పత్తిరైతుల ఆత్మహత్యలు ఖమ్మం జిల్లాలో చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రోజు పత్తికి ఉన్నధర, పత్తిపంట దిగుబడి, రైతు పెట్టిన క్రిమిసంహారక మందులు ఒకసారి పరిశీలిస్తే ఈసారి కూడా మునుపటికన్నా ఎక్కువే ఆత్మహత్యలు జరుగుతాయా అన్న సందిగ్ధంలో ప్రజలున్నారు. అప్పుడే ఖమ్మం జిల్లాలోని ఏన్కూర్ మండలంలోని రైతుగాజుల నారాయణ పత్తిపై రానున్న నష్టాన్ని అంచనా వేసుకుని ఆ బాధల సాంగత్యాన్ని గుర్తు చేసుకుని పత్తిపై పురుగు నివారణకై తెచ్చిన మందును తానే త్రాగి మరణించిన సంఘటన, మరో రెండు ప్రాంతాలలో జరిగిన పత్తిరైతుల ఆత్మ హత్యలు జిల్లాలోని రైతులను కలవరపరుస్తున్నాయి.

మొన్నటి వరకు నాయకుల నందర్శనా నంబరంలో మునిగి ఆనందోత్సావాలతో ఉన్న రైతులకు ఇప్పుడు కన్నీటి సముద్రమే గతి అనిపిస్తున్నది. ఆశించిన మేర ఈ ఏడు వత్తి పంట దిగుబడి సాధించక పోవడంతో ఈ ప్రాంతంలోని పత్తిరైతులు ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డాయి.

ముఖ్యంగా జిల్లాలోని శింగ భూపాళెం, సుజాత్‌నగర్, ఏన్కూర్స్, తలతార్‌పాడ్, చంద్రుగొండ, టేకుల పల్లి, అశ్వాపురం, కొణిజర్ల, బూర్గంపాడ్ తదితర ప్రాంతాలలోని ఒక లక్ష ఎకరాలలో పత్తి పంటకు ఆదిలోనే హంసపాదుగా ఆరంభం నుంచే వర్షాలు లేక ఎదుగుదల చెందక ప్రత్తిమొక్కలు చాలా వరకు అడుగంటి పోయాయి. తరువాత అతివృష్టి చేత ఎదిగిన పంటలన్నీ నీటి ముంపుకు గురయినాయి. అప్పటికే పంట మొత్తం సర్వనాశనమైంది. ఇన్ని జరిగినా పంట అంటూ మిగిలి ఉంటే; ఆతర్వాత చీదపీడలు సోకాయి; ఆకు తెగులు, కాయతొలుచు పురుగు, బూడిదరంగు పురుగు వ్యాపించి పత్తిని సర్వనాశనం చేశాయి. రైతన్న వెన్నును విరిచి వేశాయి, ఈ పరిస్థితులన్నీ పత్తి రైతులకు గోటి చుట్టుపై రోకటి పోటుతో తీవ్ర మనస్తాపానికి గురిచేశాయి.. గత 4 నెలలుగా బొత్తిగా వర్షం లేకపోవడం వలన పూర్తిగా బెట్టుకొచ్చి, ఎండిపోయి చెట్టుకు 10 నుండి 15 కాయలు కాశాయి. వీటిలో అమిత ఎండలకు వాడిపోయి, రాలి పోయినాయి. విత్తనాలు కొనే దగ్గర నుండి ప్రత్తి అమ్మేవరకు రైతుకు దోపిడి తప్పటం లేదు. దుకాణాల్లో కొనే విత్తనాలు కల్తీ అయి మొలకెత్తక పోవడంతో రైతు నష్టపోయినాడు. ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయశాఖ అధికారులు అందజేస్తున్న మేలు రకం విత్తనాలైన ఎం.ఇ.సిహెచ్ -1, ఎల్.ఇ.సి.హెచ్-2, ఎం.ఇ.సి.హెచ్-20, ఎల్.ఆర్, స్వామినాథ్ విత్తనాలు మేలు రకాలే అయినా ఇవి కిలో 300 రూపాయల నుండి పైననే ధర ఉండుట చేత సామాన్య రైతు వీటిని కొనలేక పోతున్నాడు. అవే విత్తనాలు ప్రైవేట్ కంపెనీవారు, వద్మా, భాన్కర్, వెంకటగిరి విత్తనాలు విక్రయిస్తున్నప్పటికిని (ఇవి కిలో 40 నుండి 50 రూపాయల వరకు వుంటాయి) వీటిలో చాలా వరకు మొలకెత్తక మోస పోతున్నారు.

ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతం రైతులు అధికారుల సలహాల మేరకు పేనుబంక, తెల్లమచ్చ, బూడిదరంగు మొదలగు తెగుళ్ల నివారణకై రిఫ్‌గాడ్, ఎండోసల్ఫాన్, స్టార్‌తీన్, సింభూస్, వంటి శక్తివంతమైన పురుగు నివారణ మందులను లీటరు 6,7 వందల ధరతో తెచ్చి కొట్టినా వీటిలో డూప్లికేట్‌వి ఉన్న కారణంగా పురుగులు చావటం లేదు. పత్తి పంట వాణిజ్య పంట కావటం వలన ప్రభుత్వ పరంగా కూడ రైతుకు దోపిడి ఎదురైంది. పది కిలోమీటర్లకొక పత్తి కేంద్రాన్ని చేస్తానని చెప్పిన లోగడ 'దేశం' ప్రభుత్వం మాటలు చేతల్లో శూన్యమైనాయి. రైతులు పత్తి - విక్రయించాలంటే విజయవాడ, గుంటూరు లాంటి పెద్ద పట్టణాలకు వెళ్ళాలి. అసలే రైతు ఆర్థిక బాధతో కొట్టు మిట్టాడుతుంటే, దానిని ఆసరా చేసుకుని దళారీ పత్తి వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు అమ్ముకుంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఇకనైనా పట్టించుకొని రైతులకు గిట్టుబాటు ధర ఇస్తే రైతు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు.

— ఉదయిని

అన్నల దర్బారులో కొలిక్కి వచ్చిన ప్రభుత్వభూమి

"బంచరాయి" భూములను రెక్కలు ముక్కలుగా చేసుకుని, సాగుకు అనుకూలంగా మలచుకుని వాటిద్వారా జీవనోపాధి గడిస్తున్న కష్ట జీవులను మనం చూస్తాం. గ్రామ పెత్తందార్లు చట్టానికి వ్యతిరేకంగా వారినోట్లో మట్టికొట్టి ఆ భూములను ఇతరులకు అమ్మి సొమ్ము గడిస్తున్న సంఘటనలు హుజురాబాద్ ప్రాంతంలోనేగాక ఎల్కతుర్తి మండలంలో కూడా జరుగగా ఇందులో తీవ్ర వాదులు జోక్యం చేసుకున్నారు.

ఎల్కతుర్తి మండలకేంద్రంలో గల సర్వే.నెం. 389 లోని 40 ఎకరాల ప్రభుత్వ భూమిని 20 సంవత్సరాల క్రితం ఆగ్రామానికి చెందిన షెడ్యూల్డు కులాల వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చింది. వ్యవసాయానికి ఏమాత్రం అనుకూలంగాలేని ఆభూమిని వారు సేద్యానికి పనికివచ్చే విధంగా మలచుకుని సాగుచేసుకొంటుండగా ఎల్కతుర్తి మాజీగ్రామ సర్పంచ్ సురవరం బుచ్చిరెడ్డి పై కుటుంబాలవారికి తెలియకుండా తన అనుచరులకు పట్టా చేయించుకొన్నాడు. ఈ విషయమై కొన్ని సంవత్సరాల క్రితమే గ్రామంలో రెండు ముఠాలు ఏర్పడి ఉద్రిక్త పరిస్థితులకు దారితీసాయి. ఆనాటి నుండి ఈ భూమిలో ఎవరుకూడా సాగు

చేయకుండా దూరంగా ఉండటం జరుగుతున్నది --....

మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి లోగడ పట్టాచేయించిన తన అనుచరులను కూడగట్టుకుని ప్రభుత్వానికి గాని, సంబంధిత అధికారులకుగాని తెలియకుండా 389 సర్వే నెంబరులోని 40 ఎకరాల 'బంచరాయి' భూమిని హుజూరాబాద్‌లోని గ్రామ నవనిర్మాణ సమితి అనే స్వచ్ఛంద సంస్థకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఎల్కతుర్తి గ్రామ ప్రజలు తెలిపారు. ఈ భూమికి ఎకరానికి 10వేల రూపాయల ధర పలుకుతుండగా బుచ్చిరెడ్డి దానిని కేవలం ఎకరానికి ఐదువేల రూపాయల చొప్పున 40 ఎకరాలను అమ్మి రెండులక్షల రూపాయలను సొమ్ము చేసుకున్నాడు. ఈ డబ్బులో నుండి తన అనుచరులైన నరిగె కట్టయ్య, అయిత రాజయ్య, కోరే కాజయ్య, అడిగే మనోహరి, కందుకూరి వీర నర్సయ్య, తోకల చంద్రయ్య, జంపాల రాజయ్య, వీణవంక నీలకంఠం, షేక్ హిమాం, శనిగరం జీడయ్య, భువనగిరి అయిలయ్య, నందనం సుధాకర్, ఇంగిచంద్రయ్య, మరో ఇద్దరికి ఎకరానికి రెండువేల రూపాయల చొప్పున 80 వేలను చెల్లించి మిగతా లక్షా 20వేల డబ్బును బుచ్చిరెడ్డి స్వాహాచేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు ---- ......

గతంలో ఈ భూమివిషయమై తీవ్రవాగ్యుద్ధాలు నడిచినప్పుడు మాజీ శాసనసభ్యుడు దుగ్గిరాల వెంకట్రావు, భీందేవరపల్లి సమితి మాజీ అధ్యక్షులు రంగారావులు జోక్యం చేసుకుని గ్రామంలోని రెండు ముఠాలమధ్య సయోధ్య కుదిర్చారు. అనంతరం గతసంవత్సరం నుండి ఈ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ భూమి ప్రభుత్వానికి చెందినదే అని రెవెన్యూ రికార్డులలో కూడా నమోదై ఉందని ఎల్కతుర్తి మండల తెలుగుయువత అధ్యక్షుడు రాజేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై ఎల్కతుర్తి మండల రెవెన్యూ అధికారిని ప్రశ్నించగా ప్రభుత్వ భూమిని ఎవరూ కూడా విక్రయించడానికి వీలులేదని, భూమిపై హక్కుగల పట్టాదారులు కూడా కలెక్టర్ అనుమతిలేనిది అమ్ముకోడానికి అర్హత లేదని పేర్కొన్నాడు.

ఇంతటి పగడ్బందీగల ప్రభుత్వ భూమి తమకు చెంది ఉన్నప్పటికి బుచ్చిరెడ్డి అఘాయిత్యంవల్ల తమ బ్రతుకులు బజారుపాలు అవుతున్నాయని మొన్నటి వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన శ్రీ. దుగ్గిరాల వెంకట్రావుకు, మాజీ ముఖ్యమంత్రి రామారావుకు కూడా విన్నవించుకున్న దళితులకు న్యాయం జరుగలేదు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం హుజూరాబాద్ గ్రామనవ నిర్మాణసమితి అనేస్వచ్ఛంద సంస్థకు ఈ భూమిని అమ్మిన రెండులక్షలు వసూలుచేసుకుని ఈనెల 11వతేదీన ఆసంస్థకు భూమి కొలతలు చూపెట్టే నిమిత్తం నవనిర్మాణ సంస్థకు చెందిన ఉద్యోగులతో కలిసి శ్రీ. బుచ్చిరెడ్డి "బంచరాయి" భూమివద్దకు ఉదయం 10 గంటలకు వెళ్ళగా ముందుగానే విషయం తెలుసుకున్న పీపుల్స్ వార్ గ్రూపుకు చెందిన "రాములు" దళం సభ్యులు 10 మంది ఆయుధాలు ధరించి (అందరివద్ద తుపాకులున్నాయి) తిష్ఠవేసి ఉన్నారు. భూమి విషయమై చర్చించడానికి ఎల్కతుర్తికి సమీపంలోని "చింతలపల్లి" గ్రామానికి తీసుకువెళ్ళి నవనిర్మాణ సమితినుండి తీసుకున్న రెండులక్షల రూపాయలను వెంటనే సంస్థకు చెల్లించి అట్టి 40 ఎకరాల భూమిని దళితులకు, వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలకు పది రోజులలో ఇచ్చివేయాలని బుచ్చిరెడ్డిని తీవ్రంగా హెచ్చరించి గ్రామస్తులందరి ముందు అతడి ముక్కును భూమికి రాయించి, చెప్పినట్లు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావని వందలించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

ఆసక్తికరమైన విషయమేమిటంటే బంచారాయి భూమి ఎల్కతుర్తి మండల పోలీస్ స్టేషన్‌కు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ పోలీసులకు ఈ విషయం తెలియకపోవడం విశేషం. ఈ భూమివద్ద తీవ్రవాదులు నాలుగు గంటలపాటు రహస్యసమావేశమై ఆ తరువాత పోలీస్‌స్టేషనుకు అతిదగ్గరలోగల "చింతలపల్లి" గ్రామంలో సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 11గంటలవరకు బహిరంగ సమావేశం ఏర్పాటు చేసినా ఎటువంటి సమాచారం పోలీసులకు తెలియరాలేదు.

గత 10-15 సంవత్సరాల నుండి వివాదాస్పద భూమి విషయంలో ఎల్కతుర్తి గ్రామంలో ముఠాలు, రాజకీయాలు నడిచి ఒక సమస్యగా తయారుకాగా ఏ అధికారి, ఏనాయకుడు పట్టించుకోకపోవడంతో ఎట్టకేలకు "అన్నల" చొరవతో బుచ్చిరెడ్డి బాధనుండి పేదప్రజలు విముక్తి చెందారు. చింతలపల్లి గ్రామంలో "అన్నల" మీటింగ్ జరుగడమేమోగాని ప్రజలు భయపడకుండా తండోపతండాలుగా సమావేశానికి హాజరు కావడం తీవ్రవాదులకు ఆనందం కలిగించింది -------.

-తిరునగరి ఆంజనేయస్వామి.

మాంగల్యానికి మలినం!!

మొగలు రాజుల పరిపాలనలో ప్రజల సాంఘిక జీవనంలో మామూలుగా ప్రారంభమైన బాల్యవివాహాలు, సతిసహగమనం, స్త్రీపునర్వివాహానికి అనర్హులు. ఇలా మతం పేరుతో మత చాందసులైన కొందరు పెద్దలు మగువల జీవితాలను "బలి" చేశారు. ఈ తరుణంలో మూఢాచారాల ముసుగులో స్త్రీలపట్ల జరిగే ఈ దురాచారాలను ఖండిస్తూ ధైర్యంగా నారీ జనోద్ధరణకు నడుం కట్టిన మానవతావాదులు, గొప్ప సంఘసంస్కర్తలైన రాజరామ్మోహన్ రాయ్, ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్. ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం పంతులు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ, మరొక ప్రక్క ప్రభుత్వంతో పోరాడి చట్టం ద్వారా వీటిని నిర్మూలించడానికి ప్రయత్నించారు.

మనం 21 శతాబ్దంలోకి అడుగిడుతున్న సమయంలో కూడ స్త్రీలకు బాధలు తప్పడం లేదు అనడానికి నిదర్శనం ఈ అనాచారం!!

మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ తాలూకా షంషర్‌బంద గ్రామంలో ఐదేండ్ల కొక్కసారి జరిగే భీరన్న ఉత్సవాలలో లోకం పోకడ తెలియని పసికందులను "దంవతులుగా" మార్చటం కురుమల ఆచారం. ఇప్పటికి కొనసాగడం ఆశ్చర్యకరం.

ఐదేండ్లకొక్కసారి వారు జరుపుకొనే భీరప్ప జాతర కురుమఉత్సవాల సందర్భంలో బాల్యవివాహాలను జరిపిస్తుంటారు. ఈ ఉత్సవాన్ని మూడు రోజులు బ్రహ్మాండంగా జరుపుకొంటారు. మొదటి రోజు గ్రామ దేవతల పూజాకార్యక్రమంతో ఈ ఉత్సవాన్ని ప్రారంభిస్తారు. ఆ రోజు సాయంత్రం కురుమ స్త్రీలు ఇంటి కొక్కరు చొప్పున గ్రామంలో ఉన్న భీరప్ప గుడి దగ్గరకు వచ్చి ఆకు చీరధారణతో అంటే ఒంటిపై ఎలాంటి నూలుపోగులేకుండ వేపమండలను శరీరం చుట్టూ చుట్టుకొని తలపై కర్పూరహారతుల పళ్లెం పెట్టుకొని డోళ్లు, డప్పుల చప్పుళ్ళతో ఊరేగింపులా గ్రామదేవతల గుళ్ళ దగ్గరకు వెళతారు. అక్కడ వేపమండల్ని విడిచి నూతన వస్త్రాలు కట్టుకొని, తమ శక్తికొద్ది ఒకటి నుంచి రెండు మేకపోతులను ఆ దేవతకు "బలి" ఇస్తారు. ఇదే విధంగా ఆ గ్రామంలో వున్న దేవతలందరికీ (అంజనేయ స్వామి, రామాలయాలు తప్ప) మేక పోతులను "బలి" ఇస్తారు. మరు నటిరోజు ఉదయానికల్లా భీరప్పగుడి ప్రాంగణంలోని పెండ్లి పందిరిలో నూతన వధూవరులను కూర్చోపెట్టి పెండ్లి జరిపిస్తారు. తల్లి ఒడిలో చల్లగా నిద్రిం చాలని ఆరాటపడే ఆ పసిపిల్లలకు బిస్కెట్లూ, చాక్లెట్లు చేతిలో పెట్టి బుజ్జగిస్తూ మూడు ముళ్ళు వేయించిన సంఘటనలు కూడా లేకపోలేదు. మూడు ముళ్ల బంధంతో జీవితాంతము పెనవేసుకు పోయే పెనిమిటి" అనేవాడు ఒకడుంటాడనే ఊహ తెలియని ఆ లేత మననుగల చిన్నారి పావలకు సాంప్రదాయం పేరిట ఈ అనాచారాన్ని అంటగట్టడం విచారకరం.

ఇప్పటికీ మన రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట డివిజన్‌లోని మఖ్తల్, ఆత్మకూరు, కోడంగల్ తాలుకాల్లోని గ్రామాల్లోనే కాకుండా, కర్నాటక రాష్ట్రంలోని గుల్బార్గ జిల్లా యాదగిరి తాలుకాలోని గ్రామాల్లో కూడ ఈ అనాచారం కొనసాగుతున్నది.

- షంషర్ బంద పరమేశ్వర్‌రెడ్డి

బహిరంగసభని జరపనివ్వని పోలీసులు

ఇటీవల చెన్నారెడ్డి ప్రభుత్వం నక్సలైట్లకు బహిరంగకార్యకలాపాలు నిర్వహించుకొనవచ్చని, కల్లోలిత ప్రాంత చట్టాన్ని ఎత్తి వేస్తున్నట్లు ప్రకటించింది. కాని ఆచరణలో భిన్నంగా వ్యవహరిస్తున్నది. ఏవైనా కొన్ని సంఘాలకు బహిరంగసభలకు పర్మిషన్ ఇచ్చి తిరిగి వాటిని నిర్వహించకుండ మధ్యంతరంగా నిలిపివేస్తున్నది. చెన్నారెడ్డి ప్రభుత్వపు రెండునాల్కల ధోరణిని ఖమ్మంలో జరిగిన కొన్ని సంఘటనలు స్పష్టంగా తెలియ చేస్తున్నాయి.

ఇటీవల సి.పి.ఐ. (ఎంఎల్) ప్రజాపంథా గ్రూపు అనుబంధ సంస్థ, ప్రగతిశీల యువజన సంఘం వారు తమ సంఘ అభివృద్ధికి మహాసభలను నిర్వహించడానికి ఖమ్మం జిల్లా ఎస్పీ, డిఎస్పీలను కలిసి అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. అయితే పోలీసుల అనుమతి లభించగానే తిరుమలాయపాలెం మండల ద్వితీయ మహాసభలను దమ్మన్నగూడెంలో జరుపుకొని రాత్రి బహిరంగ సభ జరుపుకోవడానికి నిశ్చయించింది. దీంతో కన్నుకుట్టిన పోలీసులు బహిరంగసభను విచ్ఛిన్నంచేయాలనే తలంపుతో సభ జరుగుతున్న సందర్భంలో కొంతమంది అల్లరిమూకలను పోగుచేసి ప్రశాంతంగా జరుగుతున్న సభను మధ్యంతరంగా నిలిపేసారు.

కూసుమంచి మండల ద్వితీయ మహాసభలు నిర్వాహణప్పుడు కూడా పోలీసులు ఇదే వైఖరి అవలంబించారు. మొదట పోలీసులు అగ్రహారం గ్రామంలో జరుపుకోవడానికి పర్మిషన్ ఇచ్చారు. తరువాత స్థానిక సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అనుమతి కోరగా అతను కూడ అనుమతిచ్చాడు. దీంతో ప్రగతిశీల యువజన సంఘం వారు ఉదయం నుంచి సాయంత్రంవరకు మహాసభలు విజయవంతంగా జరుపుకున్నారు. తరువాత రాత్రి బహిరంగ సభను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు గావించారు. ఈ సమావేశ స్థలానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. సభను మొదలు పెడదామనుకున్న సమయానికి రాత్రి 8 గంటలప్పుడు స్థానిక ఎన్.ఐ; సి.ఐ మరో పదిమంది పోలీసు కానిస్టేబళ్ళు వచ్చి సభ జరగడానికి వీలు లేదని ఖరాఖండిగా చెప్పారు. అక్కడికి వచ్చిన ప్రజలపై లాఠీఛార్జీ చేస్తామని బెదిరిస్తూ భయభ్రాంతులను చేశారు. తిరిగి ప్రజల వత్తిడి మేరకు ఒకగంట సేపు సభ జరుపు కోవడానికి పర్మిషన్ ఇచ్చారు. తరువాత వెంటనే సభను మధ్యాంతరంగా నిలిపి వేసారు.

ఈ సంఘటనలు చెన్నారెడ్డి ప్రభుత్వం నిజస్వరూపాన్ని బట్ట బయలు చేస్తున్నాయి. ఒకవైపు నక్సలైట్ల హక్కుల గూర్చి గంటల తరబడి ఉపన్యాసాలు ఇస్తున్న చెన్నారెడ్డి ద్వంద్వైఖరిని ఖండించాల్సిందిగా మేధావులను, ప్రజాస్వామ్య వాదులను కోరుతున్నాను.

- తాళ్ళూరి మురళీధరరావు.

మండుతున్న పద్మావతి బతుకును ఆదుకొనేవారు లేరా?

పద్మావతి పేద కార్మికుని కూతురు. 14 సంవత్సరాల క్రితమే వివాహమైన పద్మావతి జీవితంలో ఎన్నో అనుభవాలను గడించింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన పద్మావతి వివాహం జరిగేనాటికే ఆమె భర్త వివాహితుడు. అతను పిల్లలు తండ్రి. పిల్లలు పుట్టకుండ ఆపరేషన్ చేయిం చుకున్నాడు. ఆమె భర్తపేరు దన్యాసి నర్సింహులు.

పద్మావతిని పెళ్ళి చేసుకునే ముందు కల్లబొల్లి కబుర్లు చెప్పి తనకు పెళ్ళి జరిగి పిల్లలున్న విషయాన్ని దాచి మోసంతో పెళ్ళి చేసుకున్నాడు. అయినా పద్మావతి సహించి అతనితో కాపురం చేయడానికి నిర్ణయించు కుంది. తాగుడుకు బానిస అయిన దన్యాసి నర్సింహులును మార్వాడి సేట్ల ఇండ్లలో పాచిపనులు చేసి పోషించింది. అతను జబ్బుపడ్డా, తాగి ఎక్కడయినా పడిపోతే అనేక సపర్యలు చేసేది. ఇన్ని చేసినప్పటికీ పద్మావతిని దన్యాసి నర్సింహులు వేధించి రాచి రంపాన పెట్టని రోజంటూ లేదు. అయినా మగతోడు లేనిది స్త్రీలు జీవించ లేని ఈ సమాజంలో నర్సింహులు మొదటి భార్య కుమార్తెను కూడ పెంచి పెద్ద చేసింది పద్మావతి.

14 సంవత్సరాలు కాపురం చేసి అనేక సపర్యలు చేసిన పద్మావతిని వదిలేసి నిర్దాక్షిణ్యంగా గెంటేసాడు నర్సింహులు. అతనితో పద్మావతికి సంబంధం పూర్తిగా తెగి పోయింది. పద్మావతి ఏకాకిగా మిగిలి పోయింది.

ఆమె దైన్యస్థితిని తెలుసుకున్న పగడాల పురుషోత్తం అనే కార్మికుడు ఆమెను ఆదరించి చేరదీశాడు. పద్మావతి పురుషోత్తం కలిసి జీవించ సాగారు. ప్రశాంతంగా కాపురం చేసుకుంటున్న వారిని విడదీయడానికి పద్మావతి ఉంటున్న స్థలం తెలుసు కుని తిరిగి తనతో కాపురం చేయడానికి రమ్మని దభాయించి గొడవ పెట్టు కున్నాడు నీచుడయిన నర్సింహులు. ఎంత బలవంతం చేసినా, 'నీతో' కాపురానికి వచ్చే ప్రసక్తి లేదని తన బతుకు తనను బతుకనిమ్మని వేడు కుంది పద్మావతి. దీనితో ఆమెపై కక్ష గట్టాడు నర్సింహులు.

ఒకరోజు ఒంటరిగా వంట చేసుకుంటున్న పద్మావతి ముఖం మీద పథకం ప్రకారం తాను తెచ్చుకున్న సల్ఫర్‌యాసిడ్‌ను కుమ్మరించి ఆ ఇంటి గుమ్మం తలుపు గొళ్ళెం పెట్టి పారి పోయాడు కిరాతకుడయిన నర్సిం హులు. దీనితో బాధలకు తట్టుకోలేక పద్మావతి ఆ తలుపు గొళ్ళెం ఊడ తీసుకొని ఏడుస్తూ, కేకలు పెడుతూ, వీధిలోనికి వచ్చి పడిపోయింది. అదే బాట వెంబడి పోతున్న కొంత మంది ప్రజలు పద్మావతిని 1వ టవున్ పోలీస్ స్టేషన్‌కు రిక్షాలో తీసుకెళ్ళి రిపోర్టు ఇప్పించి తరువాత ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కాలిన గాయాలతో బాధ పడుతున్న పద్మావతిని ప్రభుత్వా సుపత్రి డాక్టర్లు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కనీసం మందులు కూడా ఇవ్వకుండా బతకదని, చనిపోయే వాళ్ళకు మందులెందుకని బాధ్యతా రహితంగా ప్రవర్తించారు. దీనితో పద్మావతి రెండవ భర్త భయపడి పుచ్చల పల్లి రామచంద్రారెడ్డి ప్రజావైద్య శాలలో చేర్పించాడు.

పద్మావతి ముఖము, చేతులు ఛాతి, భుజాలు శరీరం దాదాపు 20 శాతం సల్ఫర్‌యాసిడ్ ప్రభావానికి కాలి దెబ్బతిన్నాయి. ప్రస్తుతం చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న పద్మావతికి ఆపరేషన్ చేయాలని. రక్తం ఎక్కించాలని, అంటువ్యాధులు సోకకుండా మందులు వాడాలని డాక్టర్లు అంటున్నారు. రోజు కూలి చేసుకునే పద్మావతి భర్త ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇవేవి భరించలేని పరిస్థితిలో ఉన్నాడు. పద్మావతి కోలుకోడానికి కొన్ని నెలలు పడుతుందని ప్రజా వైద్యశాల డాక్టర్లు పేర్కొనడం జరిగింది.

ఇప్పటికే ప్రజావైద్యశాల వైద్యులు పద్మావతికి ఉచిత వైద్య సేవల నందిస్తున్నారు. పద్మావతి దీనస్థితికి స్పందించి తగురీతిలో ప్రజలు ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

వేముల పద్మావతి,
రూమ్ నెం. 430
కొత్తబిల్డింగ్, 4వ ఫ్లోర్
ప్రజావైద్యశాల, శంకర్ అగ్రహారం
నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

దేవపల్లి మస్తాన్ రావు
కిన్నెర మాల కొండయ్య

రాచర్ల సర్పంచ్ అవినీతి బాగోతం

ఒక వైపు గ్రామ సౌభాగ్యమే దేశ సౌభాగ్యమని గ్రామీణాభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్న కోట్లాది రూపాయలు ఏ విధంగా దుర్వినియోగం అవుతున్నాయో ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం రాచర్ల గ్రామాన్ని పరిశీలిస్తే సులభంగానే అర్థ మవుతుంది. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలాంటి రాచర్ల గ్రామ సర్పంచ్ సంచుల పోలయ్య లాంటి వ్యక్తులు, ప్రజల సొమ్ము 15 రూపాయలనుండి లక్షల వరకు ఎంతయినా స్వాహా చేయడానికి వెనుకాడరనేది రాచర్ల గ్రామంలో జరిగిన ఉదంతమే అందుకు తార్కాణం.

రాచర్ల గ్రామానికి 1989వ సంవత్సరానికి, కేంద్ర ప్రభుత్వం నెహ్రూ రోజ్‌గార్ యోజనా పథకంలో భాగంగా నాలుగు విడతలు నిధులు మంజూరు చేసింది. మొదటి విడత ఇరవై మూడువేల ఏడువందల ఒక రూపాయి యాభైపైసలు; రెండవ విడత పదిహేనువేల మూడువేల నూట పద్నాలుగు రూపాయలు. మూడవ విడత తొమ్మిది వేల ఆరువందల పద్దెనిమిది రూపాయలు నాలుగవ విడత యాభయి అయిదువేల ఎనిమిది వందల పద్దెని మిది రూపాయల డబ్బయి అయిదు పైసలు విడుదల చేసింది. అంటే మొత్తం లక్షా నాలుగు వేల రెండు వందల యాభై రెండు రూపాయలు. రోజ్‌గార్ నిధులు సంవత్సరంలోనే వినియోగం చేయాల్సి ఉన్నందున సర్పంచ్ సంచుల పోలయ్య అదరా బాదరా 89 ఆగస్టు 3వ తేది మొదలుకొని సెప్టెంబర్ చివరి వరకు మూడు రోడ్లు వేయించి మొత్తం పంతొమ్మిదివేల తొమ్మిది వందల అరవై రూపాయలు ఖర్చు పెట్టాడు. అటు తరువాత 1990 జనవరి 6నుంచి 9 వరకు మరో మూడు రోడ్లకు ఒక వేయి ఏడు వందల ముప్పయి రూపాయలు ఖర్చులో సైడు కాల్వలు

తప్పించాడు. మొత్తం కలిపి 21 వేల 690 రూపాయలు మాత్రమే రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి ఖర్చుకాగా బ్యాంకులోని గ్రామ పంచాయితీ ఖాతా నుంచి 68 వేల రూపాయలు డ్రాచేశాడు. చేయించిన పనుల మినహా మిగిలిన డబ్బు ఎందుకు డ్రా చేసినట్లు? 21, 690, రూపాయలు పోను మిగిలిన 47 వేలు తరువాత డ్రా చేశాడు, ఇందులో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు ఏవీ చేపట్టకుండానే అక్టోబర్, నవంబర్, డిశంబర్ మాసాలలో 27 వేల రూపాయలు, జనవరి రెండవ వారంలో 20 వేల రూపాయలు డ్రా చేశాడు.

ఇవే రోజ్‌గార్ నిధుల నుంచి దాదాపు నాలుగు వేల రూపాయలతో తన ఇంటికి సిమెంటు చేయించాడు. ఇంతేగాక బ్యాంకులో ఉన్న 36 వేల రూపాయలు కూడా నామమాత్రపు పనులు చేపట్టి కాజేయడానికి పథకాలు పన్నుతున్నాడు.

రోజ్‌గార్ నిధులను సంచుల పోలయ్య కాజేసిన వైనాన్ని రాచర్ల గ్రామ ప్రజలు పై అధికారులకు పూసగుచ్చినట్లు వివరించి ఫిర్యాదు చేశారు. చైతన్యవంతమైన రాచర్ల గ్రామ ప్రజల ఫిర్యాదులను అధికారులు బుట్టదాఖలు చేశారు. చివరికి పత్రికలలో సంచుల పోలయ్య అవినీతి బాగోతం పై కథలు కథలుగా వార్తలు రావడంతో జడుసుకున్న అతను రెండు చేదుడు బావులకు రిపేరు నిమిత్తం ప్లాట్‌ఫారాలు నిర్మించి పూర్తి చేశాడు. మరో నాలుగు వేల రూపాయలు ట్రెజరీకి జమచేశాడు. ఇవన్నీ చేయించింది తాను నిజాయితీ పరున్నని ప్రజల ముందు నిరూపించుకోడానికే.

రోజ్‌గార్‌నిధులను కాజేయడమే గాక ఈ ఘనుడు గతంలో సహకార సంఘం అధ్యక్షులుగా ఉన్నప్పుడు కొన్ని వేల రూపాయలకు ఎసరు పెట్టాడు. ఇందులో కొన్ని మచ్చుకు. సహకార సంఘం నుంచి క్యాష్ బ్యాలెన్సు కింద ఎనిమిది వేల రూపాయలు వాడుకుని ఇంత వరకు చెల్లించలేదు. అలాగే ప్రభుత్వం సహకార సంఘంలోని వాటాదారులకు ఋణ సౌకర్యం కల్పించగా, ఆయన బంధువుల పేర్ల మీద ఆరువేల రూపాయల చొప్పున దాదాపు ముప్పయి వేల రూపాయలు స్వాహా చేశాడు. ఇంతేకాదు ఈ అవినీతి శిఖామణి తన బంధువుల పేర్ల మీద డబ్బు కాజేయడమే గాక 1977 సంవత్సరంలో మెట్టిపల్లె అవులయ్య అనే అమాయకరైతు పేరు మీద ఐదు వేల రూపాయలు అక్రమంగా తినుకున్నాడు. ఈ సంచుల పోలయ్య పేరు మీద ఒక సెంటు స్థలం కూడ లేకుండా జాగ్రత్త పడి పిల్లల పేర్ల మీద ఆస్థినంతా రాయించాడు. నాలుగయిదు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వాటికి ఎగనామం పెట్టాడు. బ్యాంకు అధికారులు నోటీసులు పంపడంతో తనకు ఏ మాత్రం ఆస్తి పాస్తులు లేవని తాను ఋణం చెల్లించలేనని కోర్టుకు వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు.

సందు దొరికినప్పుడల్లా ప్రభుత్వం సొమ్ము నుంచి పంచాయితి సొమ్ము దాక కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్న సంచుల పోలయ్య చివరికి రాచర్ల పంచాయితీ కార్యాలయాన్ని ఊడ్చే వ్యక్తి కిచ్చే నెలసరి వేతనం 15 రూపాయలను కూడ కాజేయడం మానలేదు. పంచాయితీ కార్యాలయానికి అద్దెగా చెల్లించె డబ్బును కూడ స్వాహా చేశాడు. గ్రామం లోని ఒక బావికి పూడిక తీయించానని 200 రూపాయలు ఆగస్టు 15 జాతీయ పర్వ దినమునాడు చిన్న పిల్లలకు ఖర్చు పెట్టాల్సిన 25 రూపాయలు కూడా మింగిన అవినీతి చక్రవర్తి సర్పంచ్ సంచుల పోలయ్య.

ఒక రూపాయినుంచి 1 లక్ష వరకు కొల్లగొట్టే సంచుల పోలయ్య అవినీతి బాగోతానికి అంతూ పొంతూ లేకుండా పోతున్నది. ప్రజల డబ్బును విచ్చలవిడిగా తినడానికి మరిగిన పోలయ్య తన అవినీతి కార్యకలాపాలను సజావుగా సాగించుకోవడానికి అనేక మార్గాలు కనిపెట్టిన మార్గన్వేషి.

గ్రామ స్వరాజ్యం, ప్రజా స్వామ్యం గూర్చి గావుకేకలు పెట్టే నాయకులు, అధికారులు సంచుల పోలయ్యల వంటి వాళ్ళ వల్ల ఎంత విఘాతం కలుగుతుందో గమనించడం లేదు.

ఎవైనా అభివృద్ధి పనులకు పంచాయితి నిధులు విడుదల చేయాలంటే గ్రామ పంచాయితీ సభ్యుల సమావేశం జరిపి చర్చించాలి. కాని రాచర్ల గ్రామ పంచాయితీలో ఇవేవి కొనసాగడం లేదు. తన అవినీతి బాగోతం నిర్వహించ డానికి ఏ విషయం పై అయినా తీర్మానం కావల్సివస్తే గ్రామ పంచాయితీ సభ్యుల ఇళ్ళ వద్దకు వెళ్ళి తీర్మానంపై సంతకాలు చేయించుకుంటున్నాడు. పంచాయితీ సభ్యుల అసమర్థత కూడ సంచుల పోలయ్య అవినీతి విధానాలకు దోహదం చేస్తున్నది.

ప్రజలంతా జాగరూకలై అవినీతి పోలయ్యల బండారం బయట పెట్టి తగిన విధంగా బుద్ధి చెప్పాలి.

— పఠాన్ ఇస్ఫుల్లాఖాన్
ఉపసర్పంచ్

చందాదారులకు

విజ్ఞప్తి

మీరు 'నలుపు' పత్రికకు చందాదారులా? అయితే మీకు పత్రిక క్రమం తప్పకుండా అందుతున్నదా? అందకపోతే వెంటనే తెలియజేయగలరు. మీరు ఎప్పుడు చందాదారులైంది? ఎన్ని రోజులుగా మీకు పత్రిక అందడం లేనిది వివరాలు రాయండి. మీ పూర్తి చిరునామా ఇవ్వడం మరచిపోకండి

సర్క్యులేషన్ మేనేజర్,
'నలుపు' 1-1-342/బి,
వివేక్‌నగర్, హైదరాబాద్-20

మానవతకే మచ్చ దేవదాసీ వ్యవస్థ

చంద్రునికి గ్రహణం పడితే కొద్ది గంటల్లోనే గ్రహణం విడిచి పండు వెన్నెల కురుస్తుంది. కాని అమ్మాయిలకు 'దేవతగ్రహణం' పడితే పడుపు వృత్తిలోవారి జీవితం తెల్లారి పోవలసిందే. ఫిబ్రవరి 9న .. చంద్ర గ్రహణం రోజున కర్నాటకలోని బెల్గాం జిల్లాలో సౌందతి గ్రామంలో ఎల్లమ్మ దేవతకు 2 వేలమంది అమ్మాయిల్ని దేవదాసీలుగా ఇచ్చారు. ఏటా మాఘ పూర్ణిమనాడు ఎల్లమ్మ దేవతకు అమ్మాయిల్ని ఇవ్వడం అనవాయితీగా వస్తున్నది. ప్రతిఏడాది ఎనిమిదేళ్ళ నుండి 16 ఏళ్ళ వయసు అమ్మాయిల్ని దాదాపు 2 వేల మందిని దేవదాసీలుగా మారుస్తున్నారని తెలుస్తున్నది.

ఈ ఆచారానికి పురాణకాలం లోనే పునాదులు పడ్డాయి. క్రమేణా వ్యభిచారం వ్యవస్థీకరింప బడడానికి ఇదే కారణం అయింది ప్రస్తుతం దేవతలకు వదిలిన స్త్రీలు మరోగత్యం తరం లేక వ్యభిచారం చేస్తున్నారు. చాల మంది అమ్మాయిల్ని దేవ దాసీలుగా మార్చి బొంబాయిలోని 'రెడ్‌లైట్ ఏరియా'కు తరలిస్తున్నారు.

దేవదాసీ అంటే ఏమిటో, దేవతకు ఇచ్చి వేయడమంటే ఏమిటో తెలియని పసితనంలో గొర్రెపిల్లలకన్నా అధ్వాన్నంగా అమ్మాయిల జీవితాల్ని బలి చేస్తున్నారు. ఇంట్లో వరుసగా ఆడపిల్లలే పుడుతుంటే, మగ సంతానం కోసం అమ్మాయిని దేవదాసిని చేస్తారు, కొందరు. కుటుంబాల్లో ఎవరికైనా మలేరియా, మశూచి, క్షయ, క్యాన్సర్ లాంటి రోగాలు వచ్చినప్పుడు, గ్రామ దేవతకు కోపం వచ్చిందని, దేవతను శాంతింపజేయటానికని తమ కూతుళ్ళను దేవదాసీలుగా చేస్తుంటారు కొందరు. ఈ ఆచారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఉంది. కాని బాగా వెనుకబడిన ప్రాంతాల్లో అధికం. అందునా ఎస్.సి; బి.సి.ల ప్రజలే తమ బిడ్డలను దేవతల పేరున వదులుతుంటారు. దేవదాసీలు అవుతున్న వారిలో 90 శాతం మంది హరిజన బాలికలే ఉంటున్నారు.


పెళ్లితంతులాగా నాలుగు ఎర్రని పగడాలు, ఒక తెల్ల పగడం గుచ్చిన దారాన్ని పూజారి అమ్మాయి మెడకు కడితే దేవదాసి అయిపోతుంది. దేవతలకు వదిలిన స్త్రీలను దేవదాసీ, బసవి, జోగిని, పార్వతి, అని ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొరకంగా పిలుస్తారు. ఈ పూసలదారమే ఆమెకు మంగళ సూత్రం లాంటిది. ఇక ఆ అమ్మాయికి జన్మలో పెళ్లిజరగదు. సంసార జీవితం ఉండదు. ఎవరైనా తనను అమ్మూటకు కొనుక్కోవచ్చు. వ్యభిచారంపై ఆధారపడే జీవించాలి. ఉన్నత వర్గాల సంతానం ఆస్తుల్ని, పొలాల్ని, భవనాల్ని వారసత్వపు హక్కుగా పొంది నంత సహజంగా దేవదాసీ బిడ్డలు దేవదాసీలు అవుతారు. ఊహ తెలియని పసితనంలో దేవతకు వదిలిన అమ్మాయి, పెరిగి పెద్దయి, అందరిలా తనెందుకు బతకకూడదో అర్థంకాక, మరో దారిలేక వ్యభిచారం చేసి బతుకుతుంది. ఎన్నో జబ్బులతో, రోగాలతో మరణిస్తుంది. తనకు పుట్టిన పిల్లల్ని మనువాడ ఎవరూ రారు. కన్న బిడ్డకు కూడా అదేదారి చూపి కళ్ళు మూస్తుంది.

దేవదాసీ ఆచారాన్ని అరికట్ట టానికి కర్నాటక ప్రభుత్వం 1981లో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1987లో చట్టాలు చేశాయి. కాని చట్టాల కళ్ళు గప్పి ఈ ఆచారం కొనసాగుతున్నది. జాతర్లలో, ప్రత్యేక దినంనాడు జరిగే దేవదాసీ తంతును పోలీసులు చూసీ చూడనట్లు ఉంటున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చూస్తూ, జేబు దొంగలను పట్టుకోటానికే ఉంటున్నామంటారు. కాని పసివారి జీవితాల్ని బలిచేస్తున్న తంతును ఆపి, పూజారిని, తంతును ప్రోత్సహిస్తున్నవారిని అరెస్టు చేయడంలేదు. సరికదా, ఇలాంటి తంతు నిర్విఘ్నంగా సాగడానికి పోలీసులు సైతం సహకరిస్తున్నారని వెల్లడవుతున్నది. పరిస్థితి ఇట్లా ఉంటే. దురాచారాలు వట్టవగ్గాలు లేక నిర్విఘ్నంగా కొనసాగుతాయి. చట్టాల దారి చట్టాలది అవుతుంది.

బెల్గాం జిల్లాలోని ఎల్లమ్మ గడ్డలో మాఘపూర్ణిమ నాడు జాతర జరుగుతుంది. 2 లక్షలకు పైగా భక్తులు వస్తారు. ఇదేరోజు అమ్మాయిలను దేవదాసీలుగా చేస్తారని అందరికీ తెలుసు. తంతు సమయంలో మెడలోకట్టే పూసల దండల దుకాణాలే 150 పైగా వెలుస్తాయి. జాతరలో పూసలదండలకే గిరాకీ ఎక్కువ. ప్రతి సంవత్సరం 10వేల దండలకు పైగా అమ్ముడౌతాయి. పాతపడిన దండలకు బదులు కొత్తవి కొనేవారు ఉంటారు. దేవదాసిని చేసే అమ్మాయిని కొత్త బట్టలతో అలంకరించి తీసికెళుతుంటారు. దేవదాసిని చేస్తున్నారని అందరికీ తెలుస్తుంటుంది కాని ఎవరూ అడ్డగించరు. కారణం మతం పునాదిగల ఆచారం అవడం వల్ల, దేవత మొక్కును చెల్లించుకుంటున్నారని మిన్న కుంటారు. దేవత ముందు కొబ్బరి కాయను కొట్టినంత సహజంగా పూజారి అమ్మాయిని దేవదాసిని చేస్తాడు. తంతు జరిపినందుకు 25 రూ.లు దక్షిణ తీసుకుంటాడు. ఇంత బహిరంగంగా జరుగు తున్న తంతును బయట పెట్టి పూజారిని అరెస్టు చేయించటానికి బొంబాయికి చెందినా "భారతీయ ఆరోగ్యసంస్థ" (ఐ.హెచ్.ఓ.), బెంగుళూర్‌లోని "విమోచన" సంస్థ తీవ్రంగా ప్రయత్నించాయి. ఐ.హెచ్.ఓ. స్వచ్ఛంద సంస్థ గత ఆరేళ్లుగా ఎల్లమ్మగడ్డలో జాతర రోజున ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ, దేవదాసీ తంతుగురించి అధ్యయనం చేసింది. ఈ ఏడాది పకడ్బందీగా రంగంలోకి దిగింది. ఈ సంస్థ బొంబాయిలో వ్యభిచారిణుల పిల్లలకోసం రెసిడెన్షియల్ స్కూలు ఒకటి నడుపుతున్నది. సంఘ సేవకురాలు ఆ స్కూలులోని ఒక విద్యార్థినిని వెంట

బెట్టుకొని వెళ్ళి పూజారిని కలిసి దేవదాసీని చేయమని అడిగింది. తాను బొంబాయిలో వేశ్యా గృహాన్ని నడుపుతానని పూజారితో పరిచయం చేసుకుంది. దేవదాసి తంతు విషయం తెలిస్తే పోలీసులు అరెస్టు చేయరా? అని అనుమానం వెలిబుచ్చింది. ఈ ఏడాది ఒక్క అమ్మాయినే తెచ్చాను. ఈ సారి వచ్చినప్పుడు ఎక్కువ మంది అమ్మాయిలను తెస్తాను అని చెప్పింది. "పోలీసులేం అరెస్టు చేయరు వారికి అన్నీ తెలుసు అన్నాడు పూజారి. 25 రూ.లు దక్షిణ తీసుకొని అమ్మాయి మెడలో పూసల దారం కట్టి, అక్షింతలు చల్లి, తీర్థం ఇచ్చాడు. తంతు జరుగుతున్నప్పుడు కెమెరా క్లిక్‌మంది. పూజారి ఇతనెవరని అడిగాడు. తనకు తెలియదంది సంఘసేవకురాలు. తంతు ముగించుకొని ఇవతలకు వచ్చింది అమ్మాయితో సహా సంఘ సేవకురాలు. బయట ఐ.హెచ్.ఓ. స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విమోచన సంస్థ సభ్యులు కలుసుకున్నారు. ఎల్లమ్మ విగ్రహాలు ఉన్న చోటంతా దేవదాసీ తంతు జరుగుతున్నదని పూజార్లను అరెస్టు చేయాలని మెగాఫోన్‌లో ప్రచారం చేశారు. అమ్మాయిని తీసుకొని వెళ్లి, ఫోటోలు చూపించి, పూజారిపై కేసు నమోదు చేయమని పోలీసు అధికారులను పట్టు బట్టారు. అందుకు పోలీసులు దేవదాసీ తంతు జరగడం లేదని, మీమీదే కేసు పెడతామని, మీ అమ్మాయి బతుకు పాడవుతుందని బెదిరించారు. విమోచన సంస్థకు చెందిన న్యాయవాది బి.ఎల్. పటేల్ ముందుకు వచ్చి, తామెవరైందీ పరిచయం చేసుకుంటే కాని పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఎల్లమ్మ జాతర జరిగే ఆ ఒక్క వూరిలోనే 200 మంది పూజారులు ఉన్నారు. వీరిది ఒక కులం కాదు. అన్నికులాల వారు చివరికి ముస్లింలు కూడా ఎల్లమ్మ దేవత పూజారులుగా ఉంటున్నారు. ఐ.హెచ్.ఓ. సంస్థకు పట్టుబడింది ఇమామ్ సాహెబ్ బందివాద్ అనే ముస్లిం పూజారి. దేవదాసీ దురాచారానికి దేవుడు, మతం పునాదులుగా ఉండడంతో దీన్ని నిర్మూలించడం కష్టంతో కూడుకున్నపని. పైగా ఈ దురాచారానికి బలవుతున్న ప్రజల్లో నిరక్షరాస్యత అత్యధికంగా ఉండడంతో మూఢనమ్మకాల పట్ల వీరికి విపరీతమైన భక్తి, భయాలు ఉంటాయి. పేద ప్రజల్ని అక్షరాస్యుల్ని చేసి జ్ఞానవంతుల్ని చేసినప్పుడే మూఢ విశ్వాసాలకు తావు లేకుండా పోతుంది. దేవదాసీతంతువల్ల వ్యభిచారిణు లైన వారి పిల్లల కోసం ఐ.హెచ్.ఐ. బెంగుళూర్‌లో కూడా ఒక రెసిడెన్షియల్ స్కూలును నడుపుతున్నది. ఈ పిల్లలు పెరిగి పెద్దవారైతే, హిందూమతం తమల్ని అనాథల్ని చేసిందని, క్రిస్టియానిటీ తమకు వెలుగు చూపించిందని క్రిస్టియన్ మతమే పుచ్చుకుంటే మతం మార్పిడులు జరుగుతున్నాయని అప్పుడు 'హిందూ మతస్థులు' గగ్గోలు పెట్టవచ్చు. హిందూ మత సంప్రదాయాల వల్లే వేలాది మంది పేద స్త్రీలు నిర్భాగ్యపు బతుకులోకి నెట్టబడుతున్నారు. మతాలు, కులాలు పక్కకు పెట్టి ఈ దురాచారాన్ని రూపు మాపటానికి కృషి జరగాలి. ఈ దురాచారానికి వ్యతిరేకంగా స్వచ్ఛంద సంస్థలు, సంఘ సేవకులు, పురోగామి శక్తులు తీవ్రంగా ప్రయత్నించాలి. దేవదాసీలుగా అవుతున్నది నిరుపేద కుటుంబాల్లోని బాలికలు. 'బాలికల సంవత్సరం' సందర్భంగా నైనా ఈ ఏడాది, ఈ సమస్యకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలి.

— ఎస్. జయ



జాతరలో కొలువుదీరిన ఎల్లమ్మ దేవతలు: దేవతకు వదిలివేయబడ్డ ఓ అభాగ్య జీవి


మనభూమి

పర్వతాల నెక్కుదాం

పర్వతాల పైకి వెళుతూ ఉంటే మనకు చలి చలిగా అనిపిస్తుంది. ఎంత వేడి ప్రదేశాలలో అయినా పర్వ తాల పైకి చాల ఎత్తుకు వెళితే మీకు మంచు కనిపిస్తుంది. శితా కాలంలో పెద్ద పెద్ద పర్వతాల పైకెక్కితే విపరీత మైన చలి ఉంటుంది. పర్వతాల మీది భూమి ఏడాది పొడుగునా మంచుతో కప్పడిపోయి ఉంటుంది. పర్వతాల పైన పెరిగే కొన్ని రకాల చెట్లు మాత్రమే అంత చలిని తట్టుకొని పెరగ గలుగు తాయి. పైపైకి వెళుతూ ఉంటే పర్వత ప్రాంతం ఎలా మారిపోతూ ఉంటుందో పర్వతారోహకుణ్ణి అనుసరించిపోయి తెలుసుకుందాం.




కొనిఫరస్ అనే రకం చెట్లే పర్వతం మీద ఎంతో ఎత్తున కూడా పెరుగుతాయి. వీటికి సూదుల్లాంటి ఆకులు ఉండడం వల్ల వాతావరణం ఎంత చల్లగా ఉన్నా చనిపోవు.





పైకిపోతూ ఉంటే ఒక్కసారిగా చెట్లు అంత రించి పోతాయి. ఎత్తులో ఎక్కువగా మంచు కురియడం వల్ల చలిగా ఉండి చెట్లు పెరగ టానికి అవకాశం ఉండదు. ఇక్కడ కొనిఫరస్ చెట్లు కూడా పెరగవు. ఈ ఎత్తునే "ట్రీ లైన్" అంటారు. దీని తరువాత గడ్డి మాత్రమే పెరుగుతుంది.

హిమనది


పర్వతం మీదుగా కిందికి మెల్లగా ప్రవహించే (ఘనరూపంలో ఉన్న) మంచుముద్దలనే హిమనది అని అంటారు. ఇది పర్వతం శిఖరాన ఉన్న మంచునుంచి ప్రవహిస్తుంది.









కొసుగా ఉన్న పర్వతం, పెద్ద పర్వతం మీద ఉన్నవాళ్ళకు మీది నుంచి మంచు హఠాత్తుగా జారి తమ మీద పడుతుందన్న విషయం తెలుసు. ఒకవేళ అదే జరిగితే, దాన్ని హిమపాతం అని అంటారు.



ఒక్కసారిగా ఎవరో అరుస్తు న్నట్లు శబ్దమయినా, కదలిక అయినా మంచు జారడం మొదలైందని అను కోవచ్చు. పెద్దపెద్ద మంచుపెల్లలు కిందకు జారుతూ తమ దారిలో ఉన్న అన్నిటిని కప్పేస్తుంది.



హిమపాతంలో కప్పడిపోయిన వాళ్ళను వెలికి తీసేందుకు ప్రత్యేకమైన కొన్ని రకాల కుక్కలకు శిక్షణ ఇస్తారు. మంచులో కప్పడి పోయిన వారిని కనుక్కునేంత వరకూ ఆ కుక్కలు మంచుని వాసన చూస్తాయి. తరువాత మంచును తమ కాళ్ళతో తోడేసి వారిని వెలుపలికి తీస్తాయి.




ఇప్పుడు మీరు స్నోలైన్ చేరుకున్నారు. ఏ ప్రాంతంలోనైన ఎక్కడి నుంచి మంచుపడుతుందో దానినే స్నోలైన్ అని అంటారు. ఈ లైను నుంచి పర్వతం ఎల్లప్పుడూ మంచుతో నిండి ఉంటుంది. ఈ మంచు ఎంత లోపలికి పోయి ఉంటుందంటే, అక్కడ అసలు ఏమీ పెరగదు.



ఇంకాపైకి పోతే పర్వతం రాతిమయంగా ఉండి కోసిగా ఉంటుంది. గాలి చల్లగా ఉండి వేసవిలో కూడా మంచు పొరలు పొరలుగా ఉంటుంది. కొద్ది కొద్దిగా వేడిగా ఉండే నెలల్లో అక్కడక్కడ చిన్నచిన్న పువ్వులతో గడ్డిపరకలు మాత్రమే కనిపిస్తాయి.

మంచునది కరిగి పోయిన తరువాత


కొన్ని వేల సంవత్సరాల క్రితం వాతావరణం ఎంతో చలిగా ఉండేది. ఇప్పుడు ఉన్న మంచునదులకంటే అప్పుడున్న హిమనదుల సంఖ్య చాల ఎక్కువ. హిమనదిలోని మంచుకరిగి ఇటువంటి లోయలు ఏర్పడుతాయి.




ప్రపంచచరిత్ర
కొమ్ము, తురాయిగల రాక్షసిబల్లులు

కొన్ని రాక్షసిబల్లులకు తలమీద తురాయి లాగా బలమైన ఎముక ఉండేది. తురాయి ఉన్న రాక్షసి బల్లులను హాడ్రోసారస్ అని అంటారు. ఇది ఈ రాక్షసిబల్లులకు ముక్కులాగా ఉపయోగపడేది. దీని సహాయంతో ఎంతో దూరంలో ఉండే శత్రువును పసిగట్టేవి. మరోరకం రాక్షసి బల్లుల తలమీద కొమ్ములు ఉండేవి. మెడచుట్టూ పళ్ళెంలాంటి ఎముక ఉండేది. ఇవి సెరటోప్సియన్ రకానికి చెందినవి. హాడ్రోసారస్ , సెరటాప్సియన్స్ మొక్కలు తినే రాక్షసిబల్లులు. శత్రువు నుంచి కాపాడుకోటానికి వాటికి ఇలా ప్రత్యేకమైన తలలు రూపొంది ఉండొచ్చు.

బాతుముక్కు రాక్షసి బల్లులు






కొరిథోసారస్ హాడ్రోసారస్‌కు చెందిన రాక్షసి బల్లి. దీని తలమీది తురాయి హెల్మెట్‌లాగా ఉంటుంది. లోపల గాలిగొట్టాలు గల ఎముకతో తురాయి తయారైంది. ఇవి రాక్షసి బల్లులకు ఊపిరితిత్తుల్లా పని చేస్తాయి.

హాడ్రోసారస్‌లను బాతు ముక్కు రాక్షసి బల్లులు అని కూడా పిలుస్తారు. వీటి దవడల చివర ముళ్ళు ఉండి, పళ్ళులేని ముక్కు ఉండేది. చెట్లనుంచి ఆకుల్ని పట్టుకోటానికి వీటిని ఉపయోగించుకునేవి.

కొమ్ముగల రాక్షసి బల్లులు






సెరటొప్సియన్ రాక్షసి బల్లుల్లో ట్రిసిరాటొప్స్ ఒకరకం రాక్షసిబల్లి. దీనికి మూడు కొమ్ములు ఉండేవి. ఒకటి దాని ముక్కుమీద, మరోరెండు ఒక్కొక్కటి ఒక్కో కన్నుపై ఉండేవి. మెడచుట్టూ పెద్ద పళ్ళెంలాంటి ఎముక ఉండేది.

దీనినోటి చివర పక్షిముక్కు లాగా ఉండేది. దీనితో మొక్కలను తుంపేది. ఇది గట్టి దళసరి ఆకుల్ని తినేది దాని పళ్ళ ఉపరితలం సమతలంగా ఉండేది. ఆకుల్ని బాగా నమిలేది.


ఇది ట్రిసిరాటోప్స్ పుర్రె. సెరటొప్సియన్ రాక్షసిబల్లులకు బలమైన దవడలు ఉండేవి. గట్టి మొక్కలను కూడా నమలగలిగేది

ఎముక తలలు




ఎముక తలల రాక్షసి బల్లులకు 20 సెం మీ. మందమైన ఒకే ఒక ఎముకగల పుర్రె ఉండేది ఇవి పోట్లాడేప్పుడు బలమైన పుర్రె వాటిని రక్షించి ఉండవచ్చు.

ఈ రాక్షసి బల్లులు గుంపులుగా జీవించాయి. మగ రాక్షసి బల్లులు తమలో ఏది శక్తిమంతమైందో నిరూపించుకోటానికి పోట్లాడుతూ ఉండి ఉండొచ్చు.



పారాసారాలోఫస్ అనే రాక్షసిబల్లికి హాడ్రోసారస్ కంటే పొడవైన తురాయి ఉండేది అది ముక్కు నుంచి 2 మీటర్ల పొడవు ఉండేది. హాడ్రోసారస్ ఒక్కోసారి నీటిలో ఉండి ఉండొచ్చు. వీటి చేతులు బాతు కాళ్ళలా వేళ్లమధ్య చర్మం ఉండి తెడ్లలా ఉండేవి. వీటి కాళ్ళకు గిట్టలుండేవి.


హాడ్రోసారస్ పళ్ళు



హాడ్రోసారస్ దవడలకు కొన్ని వందల సంఖ్యలో చిన్నగా కోనుగా ఉండే పళ్ళుండేవి. అవి గట్టిగా సూదుల్లా ఉండే ఫైన్ చెట్ల ఆకులు తినేవి. పళ్ళు ఊడిపోతే మళ్ళీ కొత్త పళ్ళు వచ్చేవి

రాక్షసి బల్లుల నీడలు

సరీసృపాల నీడల నుంచి అవి ఏవిరకం రాక్షసి బల్లులు కనుగొందాం 1. డిప్లొడాకస్ 2. స్టెగొసారస్ 3. కొంప్సొగ్నాథస్ 4. ప్రొటొ సెరటొప్స్ 5. టిరన్నొసారస్ రెక్స్ 6. ట్రిసిరటొప్స్ 7. రంఫోరించస్ 8. ఇగొనొడన్ 9. పొల కంథస్ 10. స్కెలొ సారస్ 11. ప్టిరొ డక్టిలస్



ప్రాక్, పశ్చిమదేశాల్లో సిద్ధాంతాలకు చుక్కెదురు

1980 దశకం ముగిసిపోయింది. దాని జ్ఞాపకాలు మాత్రం మన మనోపథాలలో ఇంకా ప్రతిఫలిస్తున్నాయి. గత దశాబ్ది పరిణామాలన్నిటిలో అతిముఖ్యమైనదని అందరూ అంగీకరించే అంశం ఒకటున్నది. 1980 దశకం అంతమవుతున్న దశలో ఈ పరిణామం ముందుకొచ్చింది. కమ్యూనిస్టు - సోషలిస్టు ప్రపంచంలో నైతికధృతి పతనమే ఈ పరిణామం. ఇది -బహుశా రాను రాను మరింత కష్టభరితం కానున్న మరో పరిణామానికి దారి తీయవచ్చు. ఆయా దేశాలలో ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు ఉదార స్వరూపం సంతరించుకుంటున్నాయి. 1917 నుంచి సోవియట్ రష్యాలోనూ, రెండో ప్రపంచ యుద్ధానంతరం నుంచి తూర్పు యూరప్‌లోనూ వేర్లూనిన వ్యవస్థలివి. బయటికి చూడ్డానికి చాల పకడ్బందీగా కనిపించిన ఈ వ్యవస్థలు ఇన్నాళ్ళు కొనసాగి కూలిపోతున్నాయి. చైనాలోనూ ఇలాంటి పరిణామమే ప్రారంభమైంది. కాని - బహుశా, తాత్కాలికంగానే - అది వెనుకడుగు వేసింది. ఈ పరిణామాలను చూసి సంతోషపడినట్లుగా సోషలిస్టేతర రాజ్యాలలోనూ మార్పుల కోసం పెరుగుతున్న ఒత్తిళ్లను చూసి చాలమంది సంతోషించక పోవచ్చు. పశ్చిమ పరిశీలకులు - ముఖ్యంగా కన్జర్వేటివ్‌లుగా పేరెన్నికగన్న వారు తమ మాటే నెగ్గిందన్న ఆత్మానందంతో సోషలిస్టు శిబిరం పరిణామాల మీద దృష్టి పెట్టారు. తమ శిబిరంలో దాదాపు అదే విధమైన మార్పులు వస్తున్నాయనే సంగతి వారికి తెలియడం లేదు.

పెట్టుబడిదారీ విధానమూ పరిపక్వ సోషలిజమూ దాదాపు ఒకేరకమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇంతవరకు వారిని నడిపించిన భావజాలం, దానికి లొంగిరాని కఠిన వాస్తవికత - ఈ రెండింటి మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. ప్రధాన అంశాలకు సంబంధించినంతవరకు ఈ కఠిన వాస్తవికత ఇరు శిబిరాలకూ ఒక్కటే. మార్క్స్, లెనిన్‌ల భావజాలం వలెనే - ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో, ఆల్‌ఫ్రెడ్ మార్షల్, నిరంతరం ప్రభావం చేస్తూనే అంతగా గుర్తింపు పొందని హెర్బర్ట్ స్పెన్సర్‌ల భావజాలం కూడా ఈ నాటి వాస్తవ పరిస్థితులతో ఘర్షణ పడక తప్పడంలేదు.

సిద్ధాంతాల మీద జరుగుతున్న దాడి సోషలిస్టు దేశాల్లో అనుభవానికి వచ్చి పశ్చిమదేశాల్లో అనుభవానికి రాకపోవచ్చు, సుఖంగా, తృప్తిగా జీవించే మనుషులు పశ్చిమం కన్నా తూర్పున తక్కువగా ఉండటమే దీనికి కారణం కావచ్చు. మార్క్స్ నేటికీ జీవించి ఉంటే, ఇదంతా చూసి ఆయన ఆశ్చర్యపోయేవాడు కాదేమో. సమాజం నిరంతర పరిణామశీలియని భావించిన వారాయన. రాజకీయ విజయంతో, లేదా కమ్యూనిజం ఆధిపత్యం లోనికి రావడంతో పరివర్తన ఆగిపోలేదనే అవగాహనను ఆయన సులభంగా జీర్ణించుకునేవారు.

ప్రస్తుత చర్చల్లో పలువురు విస్మరిస్తున్న విషయం ఒకటుంది. సోవియట్ యూనియన్‌లోనూ ఇతర చోట్లా ఆర్థిక విషయాల రీత్యా - సోషలిజం చాల కాలం బాగానే పనిచేసింది. ఈ వ్యవస్థ కారణంగానే ప్రపంచ పారిశ్రామిక శక్తులలో రష్యా రెండోస్థానం ఆక్రమించగలిగింది. జార్ చక్రవర్తుల కాలంతో పోల్చి చూస్తే, సోషలిస్టు రష్యాలో జీవన పరిణామాలు ఎంతో మెరుగుపడ్డాయి. పంపిణీ వ్యవస్థ మరింత ఎక్కువగా మెరుగుపడింది. ఈ వ్యవస్థలోనే రష్యా విశాల ప్రజానీకాన్ని సమీకరించ గలిగింది. సాయుధుల్ని చేయ గలిగంది. పశ్చిమ రాజ్యాలకన్నా మరింత నిర్దయాత్మకంగా హిట్లర్ సైన్యాలను వెనక్కు మరలించ గలిగింది.

నిజానికి సోషలిజం అభివృద్ధిలో మూడు దశలున్నాయి. మొదటి రెండూ విజయవంతమైన దశలు, మూడవది తీవ్ర వైఫల్యం. మొదటిదశలో సోషలిజం అధికారాన్ని అంతకంటే ఎక్కువగా - ఆదాయాన్ని పునఃపంపిణీ చేయగలిగింది. అంతకు ముందు రాజూ అతనిపై ఆధారపడిన వారు ఫ్యూడల్ దొరలూ ఆదాయన్నంతా తీసుకునేవారు. మొదటిదాని వలెనే రెండోదశా విజయవంతమైంది. ఆధునిక పరిశ్రమలకూ, సాయుధశక్తికీ అత్యావశ్యకమైన పునాది చట్రం - ఉక్కు కర్మాగారాలు, రసాయనిక కర్మాగారాలు, విద్యుదుత్పాదన శక్తి, చమురు ఉత్పత్తి - శుద్ధీ, రవాణా యంత్రాంగాలు ఈ దశలోనే రూపొందాయి.

ఈ విజయాలకు కారణాలు స్పష్టమే. సోషలిజం ప్రారంభదశలోని ప్రణాళిక, ఆధిపత్య వ్యవస్థ ఈ కార్యకలాపాలకూ అలాగే ఆయుధాల ఉత్పత్తికీ ఎంతగానే దోహదం చేసింది. ఈ కార్యకలాపాలు సజావుగా కొనసాగడానికి అవసరమైన వస్తుసంపదా, శ్రమ శక్తీ - ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే ఉత్పాదకాలూ - ఉత్పత్తి వ్యవస్థకు అవసరమైనవన్నీ స్థిరంగా లభించాయి, దరిమిలా ఆర్థిక ఉత్పత్తికి సంబంధించిన కేంద్ర అధికార వర్గం నిర్దిష్ట ఫలితాలు లభిస్తాయనే విషయంలో ఎలాంటి అనుమానాలు లేకుండా - ఆదేశాలు జారీ చేయగలిగింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆయుధాల ఉత్పత్తికి సంబంధించి పెట్టుబడిదారీ దేశాలు సైతం ఈ ఆర్థిక నమూనానే అనుసరించాయి.

అంతేగాక, సోషలిజం అభివృద్ధిలోని ఈ దశలో, నియంత్రణకు సంబంధించి రాజ్యాంగ విభాగం ఆర్థిక నిరంకుశోద్యోగ చట్రం (బ్యూరాక్రసీ) - ఇంకా ముసలిది కాలేదు, ఉత్సాహాన్ని కోల్పోలేదు.

తదనంతర కాలపు పరిస్థితులతో పోల్చిచూస్తే, అప్పటి కింకా బ్యూరాక్రసీ పరిమాణం పరిమితులు దాటలేదు. 1920 ప్రారంభంలోనే, నూతన సోషలిస్టు ప్రభుత్వ స్వరూపంలో అయాస్థాయిల్లో కనిపించిన బ్యూరాక్రసీని లెనిన్ నిరసించాడు. ఇది వ్యవస్థకు సంబంధించిన ప్రధాన సమస్య.

అధునిక కాలంలో సోషలిజం మూడోదశలో ప్రవేశించింది. ఇక్కడ పాత పద్ధతి పనిచేయదు. కొన్ని విషయాల్లో ఇది ప్రతిపశక్తి. 1980 లో కనుగొనబడిన అద్భుతం.

ఈ సమన్వయకు రెండు ముఖాలు ఉన్నాయి. వినిమయ వస్తు వ్యవస్థ అనే కొత్త ప్రపంచంతో ఇది సర్దుకోలేక పోయింది. పశ్చిమ యూరప్‌లోని, అమెరికాలోని జీవన శైలి ప్రభావంతో ఉనికి లోనికి వచ్చింది వినిమయవస్తువ్యవస్థ: ఫలితంగా పారిశ్రామిక రంగం అభివృద్ధి, ప్రభావం వల్ల - అనుకున్న దానికన్న ఎక్కువగా, బౌద్ధిక, రాజకీయ డిమాండ్లకు మినహాయింపులు ఇవ్వాల్సి వచ్చింది.

ముఖ్యంగా, ఆధునిక వినిమయ ఆర్థికంలో కోరినన్ని, ఎన్నో రకాల వస్తువులు వరదలా వచ్చి పడుతున్నాయి. వినియోగదారుల అభిరుచులను ఎప్పటికప్పుడు మార్చుతున్నాయి. ఉదాహరణకు ఆటోమొబైల్‌నే తీసుకోండి. అవి ఎన్నో రకాల సర్వీసులను అందిస్తున్నాయి. సర్వీసులు జీవితంలో చాల ముఖ్యమై పోయాయి. ఎప్పటికప్పుడు కొత్తవి రావడం - డిమాండ్లు మారడంతో, పాత అంచనాలు తారుమారు అవుతున్నాయి.

మార్కెటు వల్ల వినియోగదారునికి, ఉత్పత్తిదారునికి మధ్య కొంత మేరకు సంబంధం ఉంటుంది. పాత పద్ధతులకు పరిమితులు ఏర్పడడంతో, బ్యూరాక్రసీ విశృంఖలంగా పెరగడానికి అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా విస్తృతమైన మంత్రిత్వ శాఖలు వస్తువుల, సర్వీసుల ఉత్పత్తులను ఆదేశిస్తూ పర్యవేక్షిస్తున్నాయి. తన వ్యవస్థను ఎన్నో శాఖల కింద విస్తరింప చేసుకోవడం, సంపదలను పెంచు కోవడం బ్యూరాక్రసీ స్వభావం. ఇది ఒక్క సోషలిజంకు మాత్రమే పరిమితమైన సమస్యకాదు.

నేను మొదట్లో ప్రస్తావించినట్లు ఇది మనం కోరుకున్న సిద్ధాంత ఫలితం కాదు. పరిస్థితుల ఆధిపత్యమే దీనికి కారణం. అనేక ఫ్యాషన్ల దుస్తులు, కాస్మోటిక్స్, ఖరీదైన ఆటోమొబైల్ సర్వీసులు పెట్రోలు డిమాండ్‌గల వినిమయ వస్తువుల ప్రపంచాన్ని మార్క్సుకాని, లెనిన్ కాని, స్టాలిన్ కాని ఊహించలేదు. వారి కాలంలో ఉన్న కోరికలు - సామాన్యమైన ఆహారం. సాధారణమైన బట్టలు, ఇంధనం, పాతకాలంనాటి ఇళ్ళు - ఇంటి సామాన్లు - అంతే. తప్పకుండా కొంతమంది వినిమయ వస్తువుల ఆర్థికాన్ని సోషలిస్టు ప్రపంచం అనుమతించడం తప్పని అనుకుంటారు. అయితే వినిమయ వస్తు ఆర్థికం - రాజకీయ, సాంఘిక ఆధిపత్యం లక్ష్యాన్ని అధిగమించింది.

ఇక్కడ 1980 తరువాతే, పరిస్థితుల ఆధిక్యత అకస్మాత్తుగా కనిపించింది. ఈ మార్పులకు చాల వరకు మిఖాయిల్ గోర్బచేవ్, హంగరి, పోలండ్, ఇతర సోషలిస్టు దేశాల ప్రజాస్వామ్య ఉద్యమాలే కారణమని రోజూ వింటుంటాం. ఈ నాయకుల ఘనతను తిరస్కరించలేను. వీరి విజయం ఏమైనప్పటికీ, ప్రతిఘటించలేక లొంగిపోయింది.

బ్యూరాకసీ పెరగడం ఒక్కటే ఈ మార్పుకు కారణం కాదు. పారిశ్రామిక రంగం మొదటి లక్ష్యాలను పరిపూర్తి చేయడంతో నగర పౌరుల నుంచి స్వేచ్ఛ, భాగస్వామ్యంకోసం అనివార్యమైన డిమాండ్ వచ్చింది. పేద రైతాంగ ప్రజానీకాన్ని మౌనంగా ఉంచడం కష్టమేమి కాదు. రోజువారీ శ్రమ, జీవన పోరాటం వారి శక్తులన్నిటిని పీల్చి వేస్తున్నాయి. భౌగోళిక సరిహద్దులు చర్చలకు, ఐక్యకార్యాచరణకు అవరోధం కలిగిస్తున్నాయి.

పారిశ్రామికీకరణ వల్ల బాగా చదువుకున్న కార్మికులు, మేనేజర్లు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, జర్నలిస్టులు తయారయ్యారు. నగరాల్లో వీరు ప్రజల డిమాండ్లను వ్యక్తం చేయగలుగుతున్నారు. అన్ని పారిశ్రామిక దేశాలలోనూ చివరకు రష్యాలో, ఇతర సోషలిస్టు దేశాల్లోనూ జరిగింది ఇదే. మానవ హక్కులను గౌరవించడం 'అంటే ప్రభుత్వంలో అందరికీ భాగస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం కల్పించడమేనని తరుచు అభిప్రాయ పడుతుంటాం. వాస్తవానికి ఇవి ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే అంశాలే. అందుకే ఈ విషయంలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు ఎక్కువ సహనం కనబరుస్తుంటాయి.

ఈ పరిస్థితులే, సోషలిస్టు ప్రపంచంలో పెనుమార్పులకు గురి చేశాయి. మార్పులకు ప్రేరణ కలిగించిన శక్తుల సంగతేమైనా, జరిగిన మార్పుల విషయంలో మాత్రం చాలవరకు అందరికీ ఏకాభిప్రాయమే ఉంటుంది. అందువల్ల సిద్ధాంతానికి, వాస్తవికతకు మధ్య వ్యక్తమైన సంఘర్షణ సోషలిజానికి ప్రత్యేకం అనుకుంటే పొరపాటు అవుతుంది.

పశ్చిమ పారిశ్రామిక ప్రపంచంలో మరింత స్పష్టంగా బ్రిటన్, అమెరికాలలో 1980 లో సైద్ధాంతిక నిబద్ధత శక్తిమంతంగా వ్యక్తమయింది. ఈ పరిణామం ప్రయివేటు వాణిజ్యం ఆధిక్యాన్ని, ప్రభుత్వరంగ నష్టకర స్వభావాన్ని విస్పష్టం చేసింది. ఏ సమస్యకూ ప్రభుత్వం పరిష్కారం కాదు. ప్రభుత్వమే సమస్య అని ప్రసిడెంట్ రీగన్ తన ఎనిమిదేళ్ళ అధికారం ప్రారంభంలో చాలగట్టిగా వ్యక్తం చేసిన కొద్ది అభిప్రాయాల్లో ఇది ఒకటి. కొంతమంది మేధావులు ఈ భావాన్ని అందిపుచ్చుకొని బృందగానం చేశారు, బ్రిటన్, అమెరికాలకు సంబంధించినంతవరకు దీని గురించి గట్టిగా మాట్లాడ్డమన్నది ఏమంత ముఖ్యం కాదు. మనుషుల వైఖరి మట్లాడ్డం కంటే ముఖ్యమైంది. స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థకు అన్ని పనులను విజయవంతంగా నిర్వహించే ప్రేరణ లభించింది. అమెరికాలో దేవుడు గట్టి రిపబ్లికన్. బ్రిటన్‌లో అయితే ఆయన "టోరి" పక్షీయుడు. సంప్రదాయిక విలువలే రాజ్యం చేశాయి. ఇక్కడ మతధర్మశాస్త్రం సిద్ధాంతానికి ఇచ్చిన బలం తక్కువేమీ కాదు.

ఈ సిద్ధాంతం ప్రకారం దేశరక్షణ మినహా ప్రభుత్వానికి ఏ

పాత్రా లేకుండా పోయింది. ఆడమ్‌స్మిత్ నుంచి కాక పోతే ప్రొఫెసర్ మిల్టన్ ఫ్రెడ్ మన్ నుంచో, ఫ్రెడరిచ్ ఒన్ హయన్ నుంచో ప్రభుత్వ మార్గ దర్శక విధానం రూపొంది ఉండేది. సోషలిస్టు ప్రపంచంలో లాగానే పెట్టుబడి దారీ ప్రపంచంలో కూడా సిద్ధాంతం ప్రస్తుత వాస్తవికత మధ్య తీవ్రఘర్షణ ఏర్పడింది. సోషలిజమైన మరొకటైనా ఆధిక్యం ఎల్లప్పుడూ భౌతిక వాస్త వికతదే.

వాస్తవ ఆచరణలో, సైద్ధాంతిక నిబద్ధతకు తీవ్ర పరిమితులు ఉంటాయి. పలు ప్రభుత్వ కార్య కలాపాలు సామాజిక రక్షణ, వ్యవ సాయానికి మద్దతు, ఖాయిలా పడే బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలకు సాయం రాజకీయంగా తప్పని సరి అయ్యాయి. నిజానికి సిద్ధాంతానికి ప్రచారం కల్పిస్తూవచ్చిన వారు ఒక్కసారిగా చిక్కుల్లో పడి పోయారు.

ఇంతకుముందు నేనోసారి అన్నట్లు, అమెరికాలో సోషలిజం అంటే మరేంలేదు; పెద్ద పారిశ్రామిక వేత్తలు వాషింగ్టన్‌లో విమానాలు దిగి స్వేచ్ఛావాణిజ్యంలో తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూనే, తక్షణం ప్రభుత్వం తమకు సాయపడాలని కోరుతారు చూడండి, అదే అమెరికా సోషలిజం.

ఏది ఏమైనా, సైద్ధాంతిక నిబద్ధత సామాజికంగా మరింత నష్టకరమైంది. అమెరికన్ నగరాలలోని నోరులేని పేదవారికి ప్రభుత్వ సహాయం, అల్పాదాయవర్గాలకు ఇళ్ళు, విద్యారంగానికి నిధులు, రోడ్లు, బ్రిడ్జీలు మొదలైన పునాది సౌకర్యాల నిర్వహణ, పర్యావరణ సంరక్షణ, పారిశ్రామిక వ్యర్థాలపై అదుపు, వాటి తొలగింపు – వీటిలో అత్యవసరమైన డిమాండ్లు కూడా – సైద్ధాంతిక నిబద్ధత కారణంగా మరుగున పడిపోతున్నాయి.

అంతేగాక, ప్రత్యేకించి ఆదాయ వర్గాల వారికి ఎక్కువ మేలు జరిగేలా పన్నులు తగ్గించారు. పేదవారికి ఆదాయం ఎక్కువ కావడంవల్లనే సరిగ్గా పనులు చేయడంలేదని, అందువల్ల ఆదాయాన్ని పెంచడం కోసం సంపన్నులకు ప్రోత్సాహాలు ఉండాలని అభిప్రాయం వ్యక్తమైంది.

ఫలితంగా, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తగ్గింది. దీనికి తోడు దేశరక్షణ వ్యయం పెరిగింది. ఎన్నడూ లేనంతగా బడ్జెటులోటు పెరిగింది. ఫలితం ద్రవ్యోల్బణం. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం కోసం అధిక వడ్డీరేట్లు. వినిమయ వస్తు వులపై, సర్వీసులపై అధికంగా వ్యయం చేయడంతో పరిశ్రమల పెట్టుబడులు, గృహనిర్మాణాలు తగ్గాయి. ఈ విధంగా అధిక సంఖ్యాక ప్రజల డిమాండును (గిరాకిని) తగ్గించి, ద్రవ్యోల్బణాన్ని అధిక వడ్డీరేట్ల సాయంతో అదుపు చేయడమంటే ఇదే,

ఈ పరిస్థితి మన (అమెరికా) పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపించింది. ప్రపంచ మార్కెటు పోటీలో మన సరుకుల్ని బలహీనపరిచింది. అంతకంటే ముందు అధిక వడ్డీరేటే విదేశీ నిధుల్ని – ముఖ్యంగా జపాన్ నుంచి నిధులను ఆకర్షించాయి. అమెరికా సెక్యూరి టీలను, ఎస్టేటులను ఫ్యాక్టరీలను, క్షేత్రాలను వీరు కొనేయడం మొదలెట్టారు.

కొంతకాలం పాటు డాలరు రేటు కృత్రిమంగా పెరిగింది. అమెరికా మార్కెటులోనికి దిగుమతులు పెరిగాయి. ఎగుమతులు నష్టకరంగా పరిణమించాయి. పాత తరహా సరుకులు వాణిజ్యం లాగా కాకుండా; ఆటోమొబైల్స్, టెలివిజన్ సెట్లు, తదితర వినిమయవస్తువులు మార్కెట్లలో గట్టిగా నిలదొక్కు కున్నాయి. వాటిని తొలగించడం సులభంకాదు. దశాబ్దం మొదట్లో అమెరికా అతిపెద్ద రుణదాత. ఈనాడు అదే ప్రపంచంలోనే అతి పెద్ద రుణగ్రహీత. ఈ విషయంలో అమెరికా మెక్సికోను కూడా మించి పోయింది.

సిద్ధాంతానికి – వాస్తవికతకు మధ్య అమెరికాలో సంభవించిన సంఘర్షణను వివరించాను. బ్రిటన్‌లో కూడా కాస్త తక్కువ నాటకీయంగా ఇదే జరిగింది. నాటకీయత తక్కువ అయినా దాని ప్రాముఖ్యం మాత్రం తక్కువకాదు. రెండు దేశాల్లోనూ ఫలితాలు ఒక్కటేనని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. దేశీయంగా, బయటకూడా వీటి ప్రభావాన్ని చూడవచ్చు.

దేశీయంగా, బ్రిటన్‌లో లాయిడ్ జార్జి కాలంలో ఉనికిలోకి వచ్చి, రెండవ ప్రపంచ యుద్ధానంతరం మరింత బలపడిన సోషల్ కాంట్రాక్ట్ విధానం ... రూజ్‌వెల్ట్ హయాంలో "న్యూడీల్" కాలంలో అమెరికన్లు సైతం ఆమోదించిన సోషల్ కాంట్రాక్ట్ విధానం విచ్చిపోసాగింది. సోషల్ కాంట్రాక్ట్ వల్ల కొందరు ధనవంతులు కావొచ్చు. కొందరు పేదవారు కావచ్చు. ఈ సాంఘిక వ్యవస్థ ఇరువర్గాలకు రక్షణను, అవకాశాలను కల్పిస్తుందని అభిప్రాయం ఉంది.

1980 దశాబ్దంలో బ్రిటన్‌లో, అమెరికాలో ఈ అవగాహన మరుగున పడింది. అమెరికాలో పేదలు పేదలుగానే ఉండిపోయారు. వారి సంఖ్య అంతకంతకు పెరుగుతూనే ఉంది, ఆదాయం అత్యధికం సంపన్నులకే పోతున్నది. పెద్దనగర కేంద్రాలలో జీవన పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇండ్లు పాడయి పోయాయి, చాలమంది ప్రజలు తల దాచుకోను గూడు లేక జీవిస్తున్నారు. వారి ఆదాయం ఆకలిని తీర్చలేక పోతున్నది. పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉంది. యువకులు, వృద్ధులు బతకటానికి నేరాలు చేయాల్సి వస్తున్నది. తాత్కా లికంగా బాధలు మరిచి పోవటానికి మత్తు పదార్థాలను ఆశ్రయిస్తున్నారు.

బ్రిటన్‌లో రక్షణ చట్రం చాల బలంగా ఉందనడం లో సందేహంలేదు. అయితే, ఉత్తర, దక్షిణ ప్రాంతం మధ్య ఆర్థిక వ్యత్యాసాలు, నిరుద్యోగాల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. అమెరికాలో పట్టణపేద ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రేలుడు సంభవించడానికి సిద్ధంగా ఉందని చెప్పవచ్చు. ఈ పరిస్థితి స్వేచ్ఛ వాణిజ్య సిద్ధాంతానికి మచ్చ అని చెప్పక తప్పదు. కమ్యూనిజానికి ఎదురైన ఆర్థిక ప్రతిష్ఠంభన లాంటిదే ఇదీనూ.

జె.కె.గాల్‌బ్రెత్

ఉత్తరాది రాష్ట్రాల్లో ఎన్నికలు

పార్లమెంటుకు ఎన్నికలు జరిగిన మూడునెల్లకే రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ఫలితాలు కూడ తెలిసాయి. పార్టీల పరిస్థితిల్లో పెద్దగా మార్పులేమి రాలేదు. పార్లమెంటు ఎన్నికల్లో ఏ బలాబలాలు ఉన్నాయో? దాదాపు అదే పరిస్థితి ఈ ఎన్నికల్లో ఉంది. కాంగ్రెస్ మహారాష్ట్రాలో తప్ప ఎక్కడా ప్రభుత్వాన్ని ఏర్పరచలేదు. ఐతే ఈ ఎన్నికల్లో అందరికంటే ఎక్కువ లాభపడింది బి.జె.పి. ఆ పార్టీ పార్లమెంటులో మూడవ పెద్ద పార్టీగా ఎదగడమే కాకుండా రెండు రాష్ట్రాల్లో స్వయంగాను మరో రెండు రాష్ట్రాల్లో జనతాదళ్‌తో కలిసి ప్రభుత్వాలను ఏర్పరిచింది.రామ జన్మభూమి వివాదం బి.జె.పి.కి కావలసినంత ఫలితాన్ని తెచ్చిపెట్టింది. దేశంలోని మతోన్మాద శక్తులు బాగా బలం పుంజుకున్నాయి. ఒక్క దక్షిణాది రాష్ట్రాల్లో తప్పితే మిగతా అన్ని రాష్ట్రాల్లో బి.జె.పి. రామ జన్మభూమి సమస్యతో సొమ్ము చేసుకున్నది. అది చిన్నగా కేంద్రంలోనే స్వయంగా అధికారాన్ని చేజిక్కించు కోవాలని చూస్తున్నది.

కాంగ్రెస్ పార్టీ గత నలభై ఏండ్లలో ఓట్లకోసం అన్ని రకాల మాత్రలను ఉపయోగించింది. అవసర మనుకున్న ప్రతి సందర్భంలోనూ మతతత్వాన్ని రెచ్చగొట్టింది. హిందూ, ముస్లిం ప్రజల మధ్య ఒక తీవ్రమైన గండి ఏర్పడింది. బి.జె.పి. అధికారంలోకి వచ్చిన అన్ని రాష్ట్రాల్లో ముస్లిం ప్రజల మధ్య ఒక తీవ్రమైన గండి ఏర్పడింది. బి.జె.పి. అధికారంలోకి వచ్చిన అన్ని రాష్ట్రాల్లో ముస్లిం ప్రజలు భయ ఆందోళనకు గురౌతున్నారు. దేశంలో మత కల్లోలాలు రెచ్చిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. ఐతే బి.జె.పి. కేంద్రంలో పూర్తి అధికారం చేతిలోకి వచ్చేంతవరకు, కొంత జాగ్రత్తగానే వ్యవహరిస్తుంది. ఆ తరువాత అది తన 'అఖండభారత్' నిర్మాణానికి పూనుకుంటుంది. ఈ అఖండ భారత్ నిర్మాణంలో ముందు ప్రమాదాన్ని ఎదుర్కొనేది ముస్లిం ప్రజలు. ఆ తరువాత దేశంలోని దళితశక్తులు బి.జె.పి. పార్టీ మౌలిక సిద్ధాంతం వర్ణధర్మాన్ని కాపాడడం. వర్ణధర్మాన్ని కాపాడడమంటే ఆయా కులాలు ఆ వృత్తులే చేసుకోవాలి. చెప్పులుకుట్టే మాల మాదిగలు చెప్పులే కుట్టుకోవాలి. బట్టలు నేసే శాలీలు బట్టలే నెయ్యాలి. క్షవరం చేసే మంగలివాళ్ళు క్షవరాలే చెయ్యాలి. క్షత్రియులు రాజ్యాన్నే ఏలాలి. కోమట్లు వ్యాపారం చేసి ధనాగారాలను సంపాదించుకోవాలి. బ్రాహ్మణులు పూజా పునస్కారాల ద్వారా ఈ మొత్తం సమాజం మీద ఆధిపత్యం చలాయించాలి. కాకపోతే ఈ వర్ణధర్మ సిద్ధాంతాన్ని కాస్తా మారుస్తారు. రూపం మారినా సారం మారదనేది సత్యం. అదే వారికి కావాలి.

దేశంలో కులవ్యతిరేక శక్తులు, లౌకిక ప్రజాస్వామ్య శక్తులు బాగా చీలి ఉన్నాయి. కమ్యూనిస్టు శక్తులు అందరి కంటే ఎక్కువగా చీలి ఉన్నాయి. ఇది బి.జె.పి.కి మంచి సమయం. జనతాదళ్ ప్రభుత్వం కూడ తాను బి.జె.పి. మద్దతు లేకుండా కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపలేమనే స్థితిలో పడ్డది. ఉత్తరాది రాష్ట్రాల్లో కూడ బి.జె.పి. పాలకశక్తిగా ఎదిగాక అది ప్రభుత్వం మీద తెచ్చే వత్తిడులు భిన్న రూపాల్లో ఉంటాయి. సోషలిస్టు నాయకుడైనటువంటి జార్జిఫెర్నాండెజ్ స్వయంగా బి.జె.పి.ని కేంద్ర ప్రభుత్వంలో చేరమని కోరాడు. ఈ పిలుపుకు బి.జె.పి. తన సంపూర్ణ ఎత్తుగడల్లో భాగంగానే ప్రభుత్వంలో చేరేది లేదని ధిక్కరించింది. యల్.కె. అద్వాని ఆ పార్టీని జాగ్రత్తగా కేంద్రంలో అధికారం వైపుకు నడపాలని చూస్తున్నాడు. పత్రికల్లో, టి.వి.లో రేడియోలో బి.జె.పి. అండగా నిలిచే శక్తులు చాలా బలంగా ఉన్నాయి.

బీహార్‌లో ఐ.పి.యఫ్. 7 స్థానాలను గెలిచి తిరిగి తన ప్రతిష్ఠను నిలబెట్టుకున్నది. సి.పి.ఐ. కూడా బీహార్‌లో మంచి సంఖ్యలోనే సీట్లను గెలిచింది. సి.పి.యం.కు ఒక్క బెంగాల్‌లో తప్ప ఎక్కడా బలం లేదు. దేశం మొత్తం మీద చూస్తే సి.పి.యం. కంటే సి.పి.ఐ.కే కొంత పలుకుబడి ఉన్నట్లు కనబడుతున్నది. సి.పి.ఐ., సి.పి.యం.లు కలిస్తే ఎన్నికల్లో దేశంలో ఒక బలమైన శక్తిగానే ఉంటాయి. అవి నమ్ముకున్న సిద్ధాంతంలోనైనా వాటి అనైక్యత వాటి పతనానికి దారి తీస్తుంది. బహుజన సమాజ్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒక ప్రభావాన్ని పడెయ్యలేదనే చెప్పాలి. మధ్యప్రదేశ్‌లో 2 సీట్లు గెలిచినప్పటికి పార్లమెంటు ఎన్నికల్లో అది చూపించిన ప్రచార సత్తాను కూడ అసెంబ్లీ ఎన్నికల్లో అది చూపించలేకపోయింది.

ఒక్కమాటలో చెప్పాలంటే దేశంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీలు క్రమంగా ప్రాంతీయ పార్టీలుగా మారుతున్నాయి. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క పార్టీకి పలుకుబడి ఉంటున్నది. ఐతే ఇప్పటికే కాంగ్రెస్‌కే అన్ని రాష్ట్రాల్లో ఇంకా కొంత సత్తా మిగిలి ఉన్నది. తమిళనాడు నుండి కాశ్మీర్ వరకు, మహారాష్ట్ర నుండి మిజోరం వరకు అది గణనీయంగా సీట్లు గెలవడమో, ప్రభుత్వాలను స్థాపించడమో చెయ్యగలుగుతున్నది. దేశంలోని మతతత్వ మేధావి వర్గమంతా బి.జె.పి.ని జనతాదళ్‌లోని హిందూ మత అనుకూల శక్తుల్ని ఒకటి చెయ్యాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్య వాదులు, వామపక్ష మేధావులు అనుకునేవారు రాజీవ్‌గాంధీని పక్కకు నెట్టి కాంగ్రెస్‌లోని లౌకిక శక్తులను, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల్ని ఒక్కటి చెయ్యాలని చూస్తున్నారు.

ఇది కాకుండా చిన్నదైనా మూడవ ఆలోచన గలిగిన మేధావి వర్గం దళితశక్తుల్ని, విప్లవశక్తుల్ని ఐక్యం చేసి కుల వ్యతిరేక, వర్గవ్యతిరేక పోరాటాలను నడపాలని ఆలోచిస్తున్నది ఐతే ఈ శక్తులకు ప్రచారం దొరకటం కష్టం. దళిత శక్తులతో ఐక్యత అంటేనే విప్లవ శక్తుల్లోని శక్తులు కొన్ని ముక్కు విరుస్తున్నాయి. కాని మతోన్మాద, అవకాశవాదశక్తులు దేశంలో బలపడకుండా ఉండాలంటే అదొక్కటే మార్గమని వారు ఇంకా గ్రహించడం లేదు.

కె. ఐలయ్య

థానేలో వెట్టికూలీల ధిక్కారం



చలిరాత్రి .. బాబు దాందార్ వణికి పోతున్నాడు. చలికన్న ఎక్కువగా ప్రాణభీతితో వణికి పోతున్నాడు. బాబు వయసు 13 ఏళ్లు. యజమాని చగన్‌భాయ్ ప్రజాపతి, బాబు పారిపోకుండా కట్టి పడేశాడు. తన మనుషుల్ని కాపలా పెట్టాడు - బాబు చేసిన నేరం ఏమిటి?

బాబు పందార్ వర్లీ ఆదివాసి తెగకు చెందిన వాడు. అతని కుటుంబ సభ్యులు కొందరు వెట్టి చాకిరిని ధిక్కరించి స్వేచ్ఛకోసం ప్రజాపతి పట్టునుంచి తప్పించుకుపోయారు. బాబు ప్రజాపతికి దొరికిపోయాడు. బాబు కోసమైన పెద్దలు వస్తారని అతన్ని కట్టిపడేశాడు. ప్రజాపతి మనుషులు గంటగంటకు బాబు ముఖం పై లైటువేసి అతను తప్పించుకోకుండా కాపలా కాస్తున్నారు. ప్రాణానికి ముప్పు ఏర్పడడంతో బాబు స్వేచ్ఛకోసం పారి పోవటానికి ప్రయత్నించలేదు. ఇక తెలవారదని భయంతో వణికి పోతున్నాడు.

కాని తెల్లారింది ... సరాసరి బాబు జీవితంలోకి వెలుగు ప్రసరించింది. ప్రముఖ సంఘ సేవకులు ఫాదర్ ఆడ్రిన్ డిక్రూజ్ పోలీసులతో వచ్చి బాబును విడిపించాడు. బాబు నిర్బంధం సంఘటన తరువాత ఫాదర్ డిక్రూజ్ థానే జిల్లా కల్యాణ్ తాలూకాలోని కటేరియన్‌పాడ్‌కు వెళ్లి మిగతా ఆదివాసి ప్రజలను కూడా ప్రజాపతి పట్టునుంచి విముక్తి చేయించాడు. కళ్యాణ్‌లో ఇటుక బట్టీలలో ఆదివాసులు వెట్టికూలీలుగా బతుకుతున్నారు. పేదరికంవల్ల, తమ కుటుంబ అవసరాల వల్ల అప్పులు తీసుకున్న వారంతా, అతి తక్కువ కూలికి ఇటుకబట్టీలలో పనులు చేస్తున్నారు. బాబు కుటుంబం తమ అవసరాల నిమిత్తం అక్కడక్కడ అప్పులు చేసింది. ప్రజాపతికి ఈ విషయం తెలిసి వారికి 3వేలు అప్పుఇచ్చి అందరి అప్పులు తీర్చండని, మెల్లిగా తన అప్పు తీర్చుకోవచ్చని కల్లబొల్లి కబుర్లు చెప్పాడు. ప్రజాపతి మాటలకు మోసపోయి, ఆ కుటుంబం అందరి అప్పులు తీర్చారు. బాబు కుటుంబం చాల పెద్దది. కుటుంబం కుటుంబమే ప్రజాపతికి వెట్టికూలీలుగా మారారు. అతి తక్కువ కూలికి రోజుకు 18 గంటలు పనిచేయించుకున్నాడు. ప్రజాపతి ఇచ్చే కూలి రేటుకే వారి శ్రమ విలువను లెక్కించినా 5వేల రూ.లు అవుతుంది. అయినా అప్పు తీరలేదన్నాడు. బాకీ అలానే ఉందన్నాడు. బాబు కుటుంబం ప్రజాపతి దోపిడీని, క్రూరత్వాన్ని నిలదీసింది. ప్రజాపతి తన మనుష్యుల ద్వారా ఇటుక బట్టీలవద్ద నిద్రిస్తున్న వారిని కొందరిని మరో చోటికి ఎత్తుకెళ్ళాడు. కుటుంబాన్ని విడదీసి, బెదిరించి వెట్టి కూలీలుగా వారిని ఉంచుకోవాలని ఈ దుర్మార్గానికి పాల్పడ్డాడు అలా ఎత్తుకెళ్లిన నలుగురిలో ముగ్గురు పెద్దవారు తప్పించుకుని పారిపోయారు. 13 ఏళ్ళ బాబు పందార్ ప్రజాపతికి దొరికి పోయాడు. బాబును నిర్బంధించి కాపలాపెట్టాడు. ఫాదర్ డిక్రూజ్ పోలీసులతో బాబును నిర్బంధించిన చోటుకు వెళ్లేసరికి, ప్రజాపతి తప్పుకున్నాడు. అతని సోదరి పరిస్థితిని అవగాహన చేసుకొని, "బాబును వాళ్ల కుటుంబమే ఇక్కడ వదిలి వెళ్లింది. మీరు అబ్బాయిని తీసికెళ్లవచ్చు" అని సెలవిచ్చింది.

పేవ్‌మెంటు వాసులపై దౌర్జన్యం.

మధ్య బొంబాయి లోని మరాఠీ మందిర్ మార్గ్ రోడ్డు పేవ్‌మెంటుపై గత కొన్నేళ్ళుగా 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే స్థానికులకు ఇది మింగుడు పడకపోవడంతో పేవ్‌మెంటును ఆకర్షణీయంగా తయారు చేయాలనే నెపంతో అక్కడ నివసిస్తున్న 300 కుటుంబాల పేద ప్రజలను ఖాళీ చేయించాలని పథకం పన్నారు. స్థానికుల వత్తిడి మేరకు గత నెల 13న బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ అక్కడి పేవ్‌మెంటును తవ్వడంతో అక్కడ నివసిస్తున్న ఇండ్లులేని పేద ప్రజల బ్రతుకు రోడ్డు పాలయ్యింది.

పేవ్‌మెంట్ వాసులకు ఈ పరిస్థితి దాపురించడానికి పూర్వ రంగం చాలా వుంది. కొన్ని నెలల క్రితం మరాఠి మందిర్ రోడ్డు ఇరువైపుల పెద్ద భవనాలలో నివసించే కొంతమంది, పక్కనే గల రిజర్వు బ్యాంకు క్వార్టర్లలో నివసించే ఉద్యోగుల కలయికతో మరాఠి మందిర్ మార్గ్ పరిరక్షణ సమితి ఏర్పాటయ్యింది. ఈ సమితి ఏర్పాటయిన వెంటనే అందులోని సభ్యులు పట్టణాభివృద్ధి శాఖమంత్రి (మహారాష్ట్ర) బి.ఎ. దేశామ్‌ని కలిసి తమ నివాస ప్రాంతానగల రోడ్డు పేవ్‌మెంటును ఆకర్షణీయంగా తయారు చేయడానికి చర్చించారు. ఇంతేకాదు అక్కడి పేవ్‌మెంటు మీద నివసిస్తున్న పేద వాళ్ళు అక్కడి ప్రాంతాన్ని మురికి కూపంగా తయారు చేస్తున్నారని రోజూ కొట్లాడుకుని తమ ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారని మంత్రికి చెప్పారు. పాదచారులు నడవడానికి రోడ్డుమీద స్థలం లేదని ఆయనకు లేనిపోనివి కల్పించి చెప్పారు. తాము సొంతంగా నిధులు సేకరించి పేవ్‌మెంటును అందంగా తీర్చిదిద్దుతామనిఆయనతో అన్నారు...

పేవ్‌మెంటు మీద నుంచి తొలిగించి వేసిన వారికి ప్రభుత్వమే ప్రత్యామ్నాయం చూపాలని నిక్కచ్చిగా చెప్పారు.

దీంతో పెద్ద పెద్ద భవనాలలో నివసించే ప్రజలు మంత్రిగారిని కలిసి మాట్లాడితే అతను చర్య తీసుకోకుండా పోతాడా! వీరు కలిసిన మర్నాటి కల్లా పోలీసులు రానేవచ్చారు. పేవ్‌మెంటు మీద పేదప్రజలు తలదాచుకోవడానికి సేకరించుకున్నా సామాగ్రినంత మున్సిపల్ ఉద్యోగుల మూక ధ్వంసం చేసింది. ఇదంతా పోలీసుల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే జరిగింది. పోలీసులు తమ పని మామూలే అన్నట్లు ఇప్పటికీ కనీసం తలదాచుకోవడానికి కూడ నీడలేని పేదవాళ్ళను తమ చిత్తం వచ్చిన రీతిలో వేధించడం మొదలు పెట్టారు. ఒక గర్భిణి స్త్రీని జీపులో బాదడం వల్ల తీవ్రంగా గాయపడింది. స్త్రీ పేరు అనిసామహమ్మద్. ఆమెకు దాదాపు 33 ఏళ్ళుంటాయి. ఆమెను అసుపత్రికి తరలించడంతో అక్కడ ఆ స్త్రీ వక్షస్థలంపైన, చేతులపైన, పొత్తికడుపుపైన, తీవ్రగాయాలయ్యాయని ఆమెకు చికిత్స చాల అవసరమని వైద్యులు తమ నివేదికలో వ్రాశారు. ఈ విషయంలో పోలీసులు చాలా క్రూరంగా ప్రవర్తించారని, గర్భిణీ అయిన అనిసామొహమ్మద్‌ను తోపు తోశారని. ఈ దుర్ఘటనలన్నిటికి సాక్షిగా నిలిచిన మదీనా కాబూన్ వివరించాడు.

ఇదే పేవ్‌మెంటు మీద రోజంతా పనిచేసి అలసిపోయిన శంసుల్ మహమ్మద్, మంచం వేసుకుని నిద్ర పోతున్నాడు. అతన్ని అర్ధరాత్రి పోలీసులొచ్చి పట్టుకపోయారు. అతన్ని ఒక రోజంతా లాకప్పులో ఉంచి కనీసం తిండి కూడ పెట్టలేదు. ఇతనితో పాటు అరెస్టయిన తయ్యబ్ అన్సారి 1973 నుంచి అదే పేవ్‌మెంటు మీద నివసిస్తున్నాడు. అతను జౌళిమిల్లులో పనిచేసే కార్మికుడు. తమ గుడిసెలను ధ్వంసం చేసిన తర్వాత మంత్రిని ఇతర నివాసుల కొంతమందితో పాటు కలుసుకున్నట్లు చెప్పాడు. తమకు అంధేరీ ప్రాంతంలో నివాసస్థలం కేటాయించనున్నట్లు మంత్రి హామీ ఇచ్చాడని తెలిపాడు. హామి హామీగానే ఉంది తప్ప ఆచరణ రూపం దాల్చలేదు. తమకు 1982 నుంచి రేషన్‌కార్డులున్నాయని, తమ పేర్లు ఓటర్లలిస్టులో కూడ ఉన్నాయని చెప్పాడు. ఇక్కడి స్థానికులు పేవ్‌మెంట్లను అందంగా తీర్చి దిద్దడం పేరుతో పేద ప్రజలకు నీడ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాముంటున్నది కనీసం జనసమర్దం ఉండే ప్రాంతం కాదని తాము. వాహనాలరాక పోకలకు ఎటువంటి అంతరాయం కలిగించడం లేదని వివరించాడు. నిజానికి వారి పూరి గుడిసెలు ధ్వంసమయిన తర్వాత రోడ్డు మీదనే నివసిస్తున్నప్పటికీ, వారి ఉనికి రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలిగించడంలేదు. పేవ్ మెంట్లనేవి ప్రజల సౌకర్యం కోసమే ఉన్నాయి కాని కొంతమంది వినోదపడడానికి కాదని, వాటి మీద గార్డెన్లు ఏ విధంగా నిర్మిస్తారని అన్సారి ప్రశ్నించాడు.

పరిస్థితి యధాతదంగా కొనసాగుతూనే ఉన్నా పేవ్‌మెంట్ వాసుల రోజువారి పనులకు పోనివ్వకుండా పోలీసులు వేధిస్తూనే ఉన్నారు. తమని వంట చేసుకోనివ్వడం లేదని, వేరే ప్రాంతానికి తరలి వెళ్ళాలని వత్తిడి చేస్తున్నట్లు అన్సారి ఆరోపించాడు.


ఈ సంఘటనపై స్పందించిన పేవ్‌మెంటు నివాసులకు ప్రాతినిధ్యం వహించే మహిళా మిలాన్ అనే సంస్థ పోలీసులు దురుసు ప్రవర్తనపై అధికారులకు ఒక మెమోరాండాన్ని సమర్పించింది. పోలీసుల చర్య పుణ్యమా - అని పేవ్‌మెంటు వాసుల రోజులవారి పనులకు తీవ్ర విఘాతం కలిగిందని మంత్రి దృష్టికి తెచ్చింది.

మొత్తం ఈ సంఘటనకు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్త అమీనాసయ్యద్ కారణం. పేవ్‌మెంట్లను అందంగా తీర్చి దిద్దే పథకానికి, మూల కారణం కూడ ఈ ఘనురాలే. పేవ్‌మెంట్లకు పట్టిన దుర్గతి పట్ల భవనాలలో నివసించే స్థానికులు గతనెలలో మంత్రి దేశాయ్ ఈ ప్రాంతాన్ని సందర్శించినపుడు పేవ్‌మెంటుపై నివసిస్తున్న పేదల విషయాన్ని మాత్రం దృష్టికి తీసుకొచ్చి, వారికి స్థానిక సంఘ విద్రోహక శక్తులకు సంబంధాలున్నా యని ఆరోపించింది. పేవ్‌మెంట్ల ఆకర్షణ కోసం ఏర్పడ్డ కమిటీ ఒక్క భవనానికి 15 వేలు చొప్పున 8 లక్షల రూపాయలు వసూలు చేసింది. మీటర్ పేవ్‌మెంటుకు 1000 రూపాయలు చొప్పున ఖర్చు పెట్టడానికి నిర్ణయించారు. తమ ఆధ్వర్యంలో పేవ్‌మెంట్లను ఆకర్షనీయంగా తయారు చేయడానికి మున్సిపల్ అధికారులు ఒప్పుకున్నట్లు చెప్పారు.

కాని పేవ్‌మెంటు నివాసుల గుడిసెలను తొలగించేటపుడు బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ తమకు ఒక నోటీసు కూడ ఇవ్వలేదని ఆరోపించారు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చేశామని బల్లగుద్ది మరీ చెపుతున్నారు. పైగా పేవ్ మెంటు నివాసులు అక్కడ అక్రమంగా నివసిస్తున్నందువల్ల తాము వారికి ప్రత్యామ్నాయం కల్పించే ప్రశ్నేలేదని అంటున్నారు. పోలీసులు కూడా తాము దౌర్జన్యం చేశామనే ఆరోపణలను ఖండిస్తున్నారు. తాము పేవ్‌మెంట్లపై ఉన్న కట్టడాలను అధికారులు కూల్చి వేసినపుడు తగు రక్షణ కల్పించామని పేర్కొన్నారు. పోలీసుల దౌర్జన్యంగా ఒక స్త్రీ ఆసుపత్రి పాలయ్యిందని వచ్చిన ఆరోపణలో నిజం లేదని ఆమె అంతకుమునుపే అనారోగ్యంతో బాధపడుతుందని అన్నారు.

అయినప్పటికి స్థానిక ప్రజలు మాత్రం బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ మీద వత్తిడి తెస్తూనే ఉన్నారు. కాని పేవ్‌మెంటు వాసులు మాత్రం ఇంకా 10 సంవత్సరాలయినా అక్కడే నివసించడానికి కృత నిశ్చయంతో ఉన్నారు.

డిస్నీలాండ్ నాటకం



కిషన్‌చంద్ బోండ్సి గ్రామరైతులకు పెద్ద తలకాయలాంటి వాడు. పొద్దున్నే ఇంటి ముందర వరండాలో కూర్చుని గ్రామానికి చెందిన నలుగురు పెద్దలతో ఈసారి సమృద్ధిగా పండిన పంటలవల్ల తన ఆనందాన్ని పంచుకుంటున్నాడు. చంద్‌తో ఆ నలుగురు పెద్దలు కూడా శృతి కలిపారు. మధ్య మధ్యలో హుక్కా పీలుస్తూ పొగ వదుల్తూ మంచం మీద ఒరిగి కూర్చున్నాడు చంద్. అంతలోనే రెండు మైకులతో పెద్దగా శబ్దం చేసుకుంటూ తమ గ్రామంలోకి ప్రవేశించిన జీపు ఆయన కంట పడింది. అప్పటికే జీపు తమ గ్రామంలోకి ఎందు కొచ్చిందబ్బా అని చంద్ ఆశ్చర్యపోతున్నాడు. జీపుకున్న రెండు మైకులు హోరెత్తుతూ "గ్రామవాసులకు తెలియచేయాల్సింది ఏమనగా, మీ భూముల క్రయ విక్రయాలుగాని వాటిలో ఎట్టి నిర్మాణాలుగాని చేపట్టరాదు. ఒకవేళ ప్రభుత్వం విధించిన నిబంధనలు ఎవరైనా అతిక్రమించినట్లయితే జరుగబోయే పరిణామాలకు మీరే బాధ్యులు." అని మైకులు గర్జించాయి. ఇంతలోనే ఆశ్చర్యం నుంచి తేరుకున్న చంద్ అతనితో పాటు ఉన్న రైతులకు జీపు దుమ్ము రేపుకుంటూ తమ గ్రామాన్ని దాటుతున్న దృశ్యం లీలగా కనపడుతున్నది. ఇదే ప్రభుత్వ ప్రకటనను హర్యానాలోని గురుగాంవ్ జిల్లా, దందమా, యాత్ర కేంద్రమైన సొన్హా పట్టణ ప్రాంతాల మధ్యగల దాదాపు 28 గ్రామాలను హోరెత్తించింది.

తమ గ్రామీణ ప్రాంతంలో దాదాపు 28 వేల ఎకరాల భూమిని అమెరికాలో ఉన్న డిస్నీలాండ్ నమూనాలో నిర్మాణం చేపట్టడానికి హర్యానా ముఖ్యమంత్రి ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం కబళించడానికి నిర్ణయించిందని పాపం బోండ్సి గ్రామ రైతులు చుట్టుపక్కల 27 గ్రామాల ప్రజలకు తెలిసినట్లు లేదు. కొద్దిపాటి గుట్టలతో కొన్ని పంట పొలాలతో దేశ రాజధాని నగరం ఢిల్లీకి 50 కిలోమీటర్ల దూరంలోనే ఉంది ఈ ప్రాంతం. ఓంప్రకాష్ చౌతాలా ప్రభుత్వ నిర్ణయం 28 గ్రామాల ప్రజలను దిగ్భ్రాంతుల్ని చేసింది. ఎందుకంటే తరతరాలుగా ఆ భూమినే నమ్ముకుని జీవిస్తున్నారు అక్కడి రైతులు. దాదాపు తొమ్మిది వేల కుటుంబాలు చౌతాలా నిర్ణయం వల్ల వీధిపాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పరిస్థితిని అవగతం చేసుకున్న 28 గ్రామాల రైతులు, స్త్రీలు పిల్లలందరు మూకుమ్మడిగా చౌతాల ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటించడానికి నిర్ణయించారు. వెనువెంటనే 'డిస్నీ లాండ్ విరోధ మోర్చా" నేతృత్వంలో సంఘటిత మయ్యారు. తమ భూముల విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకోకుంటే ప్రధాని వి.పి. సింగ్ నివాసగృహం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో ఒక విజ్ఞాపన పత్రాన్ని ప్రధాని వి.పి.సింగ్‌కు, కేంద్ర మంత్రులు అజిత్‌సింగ్, మేనకా గాంధీలకు డిస్నీలాండ్ విరోధిమోర్చా సమర్పించింది. హర్యానా ప్రభుత్వంపై వెంటనే వత్తిడితెచ్చి డిస్నీలాండ్ నిర్ణయాన్ని మార్చుకోవడానికి కృషి చేయాలని మోర్చా అభ్యర్థించింది.

ప్రస్తుతం మెహాంనియోజక వర్గం నుంచి హర్యానా అసెంబ్లీకి పోటి చేస్తున్న ఓం ప్రకాష్ చౌతాలా అదే నెలలో అదే ప్రాంతంలో జరిగిన ఒక బహిరంగసభలో డిస్నీలాండ్ నిర్ణయాన్ని ప్రకటించారు.

వెనువెంటనే హర్యానా ప్రభుత్వం భూసేకరణకు ఒక నోటీసును విడుదల చేసింది. అయినప్పటికీ మొత్తం 28 గ్రామాల రైతులు ఈ నిర్ణయానికి వ్యతిరేకత తెలియచేస్తూ వందలాది మహజర్లు గురుగాంవ్ జిల్లా అధికార్లకు సమర్పించారు. ప్రభుత్వం వెంటనే భూసేకరణ విడుదల చేసిన నోటీసును వెనక్కి తీసుకోవాలని ఈ నిర్ణయం ప్రభుత్వం యొక్క మౌలికమైన ఆశయాలైన ప్రజల సంక్షేమానికి విరుద్ధమని రైతులు పేర్కొన్నారు. మొత్తం 28 గ్రామ ముఖ్యులు జనవరి 28న దందమా గ్రామాలలో సమావేశమై ఒక తీర్మానం చేస్తూ ఒక వేళ ఎటువంటి పరిస్థితులలోనైనా డిస్నీలాండ్ నిర్మాణాన్ని ఆమోదించినట్లయితే అది తమకు చెప్పలేనంత నష్టాన్ని కలుగ చేయడమేగాక తమ వ్యవసాయాధార ఆర్థిక పరిస్థితిని, తమ సంస్కృతిని నాశనం చేస్తుందని ఆందోళన వెలిబుచ్చుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇదే విషయంపై డిస్నీలాండ్ విరోధ మోర్చా ఉపాధ్యక్షులు నత్‌ఖీర్ సింగ్ మాట్లాడుతూ "తమపై బలవంతంగా రుద్దుతున్న డిస్నీలాండ్ నిర్మాణం తమ సామాజిక అస్తిత్వాన్ని నాశనం చేస్తుందని మేము ఇక్కడ శతాబ్దాలుగా నివసిస్తున్నపుడు దాన్ని ఏ విధంగ ఆమోదిస్తామని" ప్రశ్నించారు.

రైతులు ఇంతగా ఆందోళన చేస్తున్నా హర్యానా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. పైగా ప్రభుత్వం సేకరించదలుచుకున్న భూమి వ్యవసాయానికి పనికి రానిదని మొండిగా వాదిస్తున్నది. ప్రభుత్వ వాదనలను రైతులు పూర్వ పరం చేస్తూ కొంత మంది పాత్రికేయులకు ఆ భూమిని చూపించారు. అక్కడి భూమంతా పచ్చగానో లేక పసుపు పచ్చగానో ఉందని వారి పరిశీలనలో వెల్లడయ్యింది. ఇక్కడి 28 గ్రామాలే సొన్హా ధాన్యపు మార్కెట్‌కు ఆధారమని, జలవనరులు కూడ సమృద్ధిగానే ఉన్నాయని, పాత్రికేయులు పేర్కొన్నారు. ఢిల్లీ పరిసర ప్రాంతాలలో భూముల అమ్మకాలు, కొనుగోలులో ఆరితేరిన వ్యాపారులు, వ్యవసాయ క్షేత్రాధిపతులు, డిస్నీలాండ్ నిర్మాణ ప్రతిపాదనగల పరిసరాలలోని భూమి ధర కొన్ని లక్షలకు పెంచారు.

కాని రైతులు మాత్రం డిస్నీలాండ్ వ్యవహారంలో తమ నేల తల్లిని రక్షించుకోవడానికి చావో బతుకో తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

నేపాల్ రాచరికానికి అంతిమఘడియలు

అక్కడ, ఇక్కడ అనికాదు. ప్రపంచ మంతటా ప్రజాస్వామ్య ప్రభంజనం వీస్తున్నది. ప్రజలను నిమిత్తమాత్రులుగా చేసి దశాబ్దాలుగా కొనసాగిన ఏకపార్టీ ప్రభుత్వాలు ఒకటొకటిగా కుప్పకూలి పోతున్నాయి. దీనికి తూర్పుయూరప్ దేశాల్లో, నమీబియాలో, దక్షిణాఫ్రికాలో జరిగిన, జరుగుతున్న పరిణామాలే ప్రబల తార్కాణం. నేపాల్ లాంటి చిన్న దేశాల్లో సైతం ప్రజాస్వామ్య ప్రభంజనం వీస్తున్నది. ఫిబ్రవరి 18న నేపాల్ కాంగ్రెసు ఆధ్వర్యంలో జరిగిన సమావేశం ప్రజాతంత్ర హక్కుల పునరుద్ధరణ కోసం, బహుళ పార్టీ ప్రభుత్వం కోసం గొంతు విప్పింది.

మన రాష్ట్రంలో రెండోవంతు కూడాలేని నేపాల్‌కు మూడు సరిహద్దుల్లో ఇండియా, ఒకవైపున చైనా ఉన్నాయి. సాంస్కృతికంగా హిందూ దేశం. బుద్ధుడు జన్మించిన స్థలం. నేటికీ రాజుల వంశపారం పర్య పాలనే కొనసాగుతున్నది. కాక పోతే 'పంచాయతీ వ్యవస్థ' అనే అందమైన పేరున 'పంచాయతీ' అనగానే ప్రజలందరికీ భాగాస్వామ్యంఉండే వ్యవస్థ అని స్ఫురిస్తుంది. కాని గత 40 ఏళ్లలో ఒక్క 18 నెలలు మినహా స్వతంత్ర నేపాల్‌లో రాచరికమే పాలన సాగిస్తున్నది.

ఇండియాలో బ్రిటిష్ పాలన కొనసాగుతుంటే నేపాల్ స్వతంత్రంగా ఉండలేదు. బ్రిటిష్ ప్రభుత్వం రాణాలు అనే రాజులతో సగౌలి సంధి ద్వారా నేపాల్‌లో తమ ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. రాణాలు బ్రిటిష్ వారి దన్నుతో మిగతా రాజులను కీలు బొమ్మలుగా చేసుకొని నిరంకుశంగా పాలించారు.

ఇండియానుంచి బ్రిటిష్ పాలకులు వెళ్లిన తరువాత, నేపాల్ కాంగ్రెస్ పార్టీ 1950 ఏప్రిల్ 1న ఏర్పడింది. రాజాత్రిభువన్ సాయుధ పోరాటం ద్వారా రాణాలను గద్దెదించి 1951 ఫిబ్రవరి 18న నేపాల్ విముక్తిని ప్రకటించాడు. నేపాల్ స్వాతంత్ర్య పోరాటానికి ఇండియా అండదండలు అందాయని ప్రత్యేకంగా పేర్కొనాల్సిన అవసరం లేదు. రాజాత్రిభువన్ సింహాసనమెక్కాడు. 1959లో ప్రధాన మంత్రి పదవికోసం. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నేపాల్ కాంగ్రెస్ అత్యధిక మెజారిటీ సంపాదించింది. బి.పి. కొయిరాల ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. నేపాల్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ఇదే మొదటిది. ఇదే చివరిదీనూ. రాజు కన్నా ప్రధానమంత్రి కొయిరాలనే ప్రజల అభిమానాన్ని ఎక్కువగా చూరగొంటున్నాడని రాజామహేంద్ర (త్రిభువన్ కొడుకు) తలచి, ప్రధాన మంత్రిని, మంత్రివర్గాన్ని, ఇతర ప్రముఖ నాయకుల్ని 1961లో జైల్లో నిర్బంధించాడు. నేపాల్ ప్రజలకు ప్రజాస్వామ్యం మూణ్ణాల ముచ్చటే అయింది. కొయిరాలను ఎనిమిదేళ్లు జైళ్లోనిర్బంధించాడు. రాజామహేంద్ర ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని రద్దుచేసి, పార్టీ రహిత పంచాయతి వ్యవస్థను ఏర్పాటు చేశాడు. నేపాల్ కాంగ్రెసును వామపక్ష పార్టీలను, ట్రేడ్ యూనియన్‌లను నిషేధించాడు. రాజా మహేంద్ర తరువాత, రాజా బీరేంద్ర సింహాసనం అధిష్టించాడు. బీరేంద్ర అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ప్రజలు మరోసారి ఉవ్వెత్తున లేచారు. ఫలితంగా రాజా బీరేంద్ర 1979లో పంచాయితీ వ్యవస్థ - బహుళపార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజలు దేన్ని కోరుకుంటున్నారని తెలుసుకోటానికి జనవాక్యసేకరణ జరిపించాడు. నేపాల్ ప్రజలు ఊహించినట్టుగానే జనవాక్యసేకరణ ఒక ప్రహసనంగా ముగిసింది. రాజా బీరేంద్ర పంచాయితీ వ్యవస్థనే ప్రజలు కోరుకుంటున్నారని ప్రకటించి తన గద్దెను కాపాడుకున్నాడు. ప్రజాస్వామ్య హక్కుల పట్ల తీవ్రవాంఛ, మరోపక్క దేశంలో కటిక దారిద్ర్యం, ద్రవ్యోల్బణం, దుర్భర జీవన పరిస్థితులు ప్రజల్ని నోరు, కళ్లు మూసుకొని జీవించనీయలేదు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి జ్వాలాల్ని నిర్బంధ, నిషేధ చట్టాల ద్వారా ఆర్పి వేయాలని రాజా బీరేంద్ర ప్రయత్నించాడు, ప్రజాక్షేమం సాకుగా ఎవరినైనా 18 నెలలు నిర్బంధించవచ్చని జిల్లా అధికారులకు అధికారాలు అంటగట్టాడు.

నేపాల్ కాంగ్రెసు రాజా బీరేంద్రకు వ్యతిరేకంగా 1985లో సహాయ నిరాకరణోద్యమాన్ని చేపట్టింది. ఆ సమయంలో కమ్యూనిస్టుల పార్టీకూడా ఉద్యమంలో పాల్గొంది. కాని కాంగ్రెసుకే ఇతర వామపక్షపార్టీలతో మిలాఖత్ కావడం ఇష్టం లేకపోయింది. కాని ప్రస్తుత అంతర్జాతీయ నేపథ్యంలో వామపక్షాలతో కలిసి నేపాల్ కాంగ్రెసు బహుళపార్టీ ప్రభుత్వం కోసం ప్రజాస్వామ్య ఉద్యమాన్ని ఉధృతం చేసింది.

మరోవైపు నేపాల్ - ఇండియా దేశాల సంబంధాలు గత సంవత్సరం సన్నగిల్లడంతో నేపాల్ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ఇండియా నుంచి నేపాల్‌కు రవాణా సౌకర్యాలు రద్దు కావడం వల్ల, ఇండియా నేపాల్‌కు నిత్యావసర వస్తువుల్ని ఎగుమతి చేయడం నిలిపి వేయడంవల్ల నేపాల్‌లో ధరలు మిన్నుముట్టాయి. దేశంలో ప్రజా ఆందోళన ఉధృతిని తగ్గించటానికి నేపాల్ ఇండియాతో స్నేహపూరిత సంబంధాలకోసం ప్రయత్నిస్తున్నది.

నేపాల్ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఆందోళనను అణచటానికి రాజాబీరేంద్ర నిర్బంధాన్ని మరింత పెంచాడు. ప్రదర్శనలపై కాల్పులు జరిపించాడు. ఆందోళన కారులు చాల మంది పోలీసు కాల్పుల్లో మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. అయినా అణచివేతను కాదని ప్రజాతంత్ర్య ఉద్యమం విజృంభిస్తున్నది.

నేపాల్ ప్రజలు తావు కోరుకుంటున్న ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దశలో ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారందరూ నేపాల్ ప్రజల ఉద్యమాన్ని సమర్థిస్తారు. సుదీర్ఘకాలంగా ప్రజాతంత్ర హక్కుల కోసం సాగుతున్న నేపాల్ ప్రజా ఉద్యమం విజయవంతం అవుతుంది.

మండల్ కమీషన్ నివేదిక సారాంశం

సేకరించిన వివరాలు — అనుసరించిన విధానమూ

ఇతర వెనుకబడిన తరగతులను గుర్తించటానికి స్పష్టమైన కొలబద్ద ఏదీ మొదటి వెనుక బడిన తరగతుల కమీషన్ రూపొందించుకోలేక పోవటం పెద్దలోపమని ప్రభుత్వం గ్రహించింది. జనాలలోకి పోయి వివరాలు సేకరించటం, ప్రామాణికత కొలబద్దలు నిర్ణయించుకోవలసిన అవసరం ఎంతో ఉన్నదని సుప్రీంకోర్టు కూడా అనేక సందర్భాలలో అభిప్రాయ పడింది. అందుకని ఈ కమీషన్ (మండల్ కమీషన్) ప్రాథమిక సమాచారం సేకరించటం కోసం ఒక స్వతంత్రమైన పద్ధతిని సంస్థను ఏర్పరుచుకోవటం అవసర మని భావించింది. ఈ సందర్భంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలు ఇవి: సామాజిక వెనుకబడిన తనంపై చర్చలు జరిపించటం; కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలకు మూడు ప్రతులలో ప్రశ్నావళి అందచేయటం; శాసనసభ్యుల, ప్రముఖ వ్యక్తుల సామాజిక శాస్త్ర వేత్తలు మొదలైన వ్యక్తులను కలుసుకొని వారితో సంప్రదిస్తూ విస్తృతంగా కమీషన్ దేశమంతా తిరగటం; సాంఘిక - విద్యా విషయాలలో దేశవ్యాప్తంగా సర్వే జరిపించటం; ఈ విషయంలో ప్రత్యేకమైన పరిశోధన చేసిన వారి చేత ముఖ్యమైన అంశాలపై నివేదికలను తయారు చేయించటం; జనాభా వివరాలను విశ్లేషించటం మొదలైనవి.

వివిధ అంగాలలో ఇంత విస్తృతమైన పరిశీలన జరిపిన మీదట మొత్తం విషయాన్నంతా అవగాహన చేసుకొనే అవకాశం కమీషన్‌కు లభించింది. దీనితో ఎంతో ఉపయోగకరమైన, ఆధారపడ తగిన వివరాలను కమీషన్ సేకరించ గలిగింది.

సాంఘిక వెనుకబడిన తనమూ కులమూ

హిందూ సామాజిక వ్యవస్థకు కులాలు నిర్మాణపు రాళ్ళుగా ఉన్నాయి. శతాబ్దాలుగా హిందూ సమాజాన్ని ఈ కులాలు హెచ్చు తగ్గుల సమాజంగా చీల్చి ఉంచింది. దీనివలన ఒక వ్యక్తి కులానికి అతని సామాజిక హోదాను విద్యా ఆర్థిక స్థాయికి చాల దగ్గర సంబంధాన్ని ఏర్పరిచి ఉంచింది.

ఈరకంగా సమాజం చీలిపోయి ఉండటంవల్ల కొందరు స్వార్థ పరశక్తులకు ఈ వ్యవస్థను ఇదే విధంగా పటిష్ఠంగా ఉంచటానికి అవకాశం దొరికింది. పురోహిత వర్గం స్మృతులు, పూజాపునస్కారాలు, పురాణాల పేరుమీద ఒక విస్తృతమైన తెలివైన పద్ధతిని కనిపెట్టి కొన్ని యుగాలపాటు క్రింది కులాలను బానిసత్వంలో కట్టిపెట్టి ఉంచింది. చాతుర్వర్ణ్య సిద్ధాంతాన్ని చాల శాస్త్రాలు విశ్వసిస్తాయి. మతపరమైన ఈ సమ్మతి ఉండటం వల్ల, అసమానత అసమంజసతపై ఆధారపడిన ఇతర సాంఘిక వ్యవస్థల కంటె ఎక్కువకాలం ఈ కుల వ్యవస్థ మనగలుగుతున్నది.

హెచ్చు తగ్గుల తేడాతో సమాజం శాశ్వతంగా చీలిపోయి ఉండటం వల్ల, నిమ్నకులాలు అనుకున్నవారంతా అన్ని రంగాల లోనూ తేడాకు గురయ్యారు. దీనివల్ల సాంఘికంగా, ఆర్థికంగా, విద్యావరంగా వారు వెనుకబడి ఉండి పోవటం జరిగింది. అందుకనే భారత దేశంలో ఒక వ్యక్తి కులాన్ని బట్టి క్రిందివాడయి ఉంటే అతను సాంఘికంగా కూడా వెనుకబడి ఉండి పోవటం జరుగుతున్నది. (అంటే కులానికి సాంఘిక వెనుకబడిన తనానికి ప్రత్యక్ష సంబంధం ఉన్నదన్నమాట)

కులం — సాంఘిక శక్తులు.

నిత్యం మారుతున్న సాంఘిక వ్యవస్థ వాస్తవాలకు చాల సులువుగా సర్దుబాటు చేసుకొని పోయే స్వభావం అవసరమైతే మార్పులు చేసుకోగలిగే పద్ధతి ఉండటంవల్ల కులవ్యవస్థ ఇన్ని శతాబ్దాలుగా మనగలుగు తున్నది. నాలుగో అధ్యాయంలో చెప్పిన కుల వ్యవస్థ సాంఘిక వాస్తవాలపై ఆధార పడటం కంటే ఎక్కువగా హిందూ శాస్త్రాల మీద ఆధారపడి ఉన్నది. బ్రిటిషు వారు ప్రవేశపెట్టిన న్యాయ విధానం, పట్టణాలు పెరగటం, పరిశ్రమలు పెరగటం, విద్యావ్యాప్తి చెందటం మరీ ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన వయోజన ఓటింగు విధానంవల్ల చాల వరకూ ఈ కుల కట్టుబాట్లు సడలి పోయాయి. ఈ మార్పులన్నీ కూడా కొంత పైపైన కులం పట్టు సడలింది తప్ప ప్రాథమికంగా కులం పునాదులలో చెప్పుకో దగినంత మార్పు మాత్రం రాలేదు.

పైన పేర్కొన్న కారణాలవల్ల కులం కట్టుబాట్లలో కొంత సడలింపు వచ్చిందిగాని రాజకీయాలలో మాత్రం కులవ్యవస్థ ప్రాముఖ్యం బాగా పెరుగుతున్నదనేది మాత్రం చాల మంది ఒప్పుకుంటున్నారు. బహుశా ఈ పరిస్థితి తప్పదేమో. రాజకీయ నాయకులకు ఈ కులవ్యవస్థవల్ల తమ తమ కులాలలోకి సులువుగా చొచ్చుకొని పోయి కూడగట్టుకొనే అవకాశం ఎక్కువగా ఉండటం వల్ల భారత దేశ రాజకీయాలలో కుల ప్రభావం పెరుగుతూనే ఉంటుంది. "రాజకీయాలలో కుల వ్యవస్థ గురించి ఆందోళన చెందేవారు సమాజంలో ఏ ఆధారమూ లేని రాజకీయాలకోసం వెతుకుతున్నట్లున్నారు" అని రజనీకొఠారీ అన్నారు.

సాంఘికంగా ఒకరినొకరు కలవటం అనేది పెరుగుతున్న మాట నిజమే. సాంప్రదాయకమైన కుల కట్టుబాట్లు కూడా కొంతవరకూ బలహీన పడుతున్నాయనేది కూడా నిస్సందేహమే. అయితే ఆచార వ్యవహారాలలో నష్టపోయిన కులం రాజకీయ రంగంలో పుంజుకున్నది. దీని మూలంగా సమీప భవిష్యత్తులో ఈ

కులం నిర్మూలన అయిపోతుందని ఆశించటం అవాస్తవికం అవుతుంది.

సామాజిక న్యాయం, ప్రతిభ, హక్కులు.

చట్టంముందు సమానత అనేది ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలోని 14వ అధికరణ పొందుపరిచింది. కాని "సమానత" అనే సూత్రం రెండంచులా పదును ఉన్న కత్తి లాంటిది. జీవన పోరాటంలో బలవంతుణ్ణీ, ఒకరకంగా బలహీనుణ్ణీ ఒకే గాటన కడుతుంది. "సమానుల మధ్య సమానత్వం" అనేది సామాజిక న్యాయం రూపొందించిన ధర్మసూత్రం. అసమానుల మధ్య సమానత్వం పాటించాలి అనటం అసమానత్వాన్ని పెంపొందించటమే అవుతుంది. బలహీనులకు అయోగ్యతలున్న వారికి, సామర్థ్యం తక్కువ ఉన్న వారికి ఎటువంటి రక్షణలు కల్పిస్తున్నామనే దాని పైననే ఆ సమాజపు మానవదృక్పథం కనబడుతుంది.

"సమాన అవకాశాలు" "సమానదృష్టి" అనేవి బలహీనుణ్ణి బలవంతుణ్ణి ఒకేగాట కట్టటం వలన సాంఘికన్యాయం జరగకుండా పోతున్నది. నిజానికి "సమాన ఫలితాలు" అనేది ఒకటే సమాజం శ్రేయోరాజ్యాన్ని ఆశిస్తున్నాదా లేదా అనేదానికి గీటురాయి. అసమానతలతో నిండిపోయి ఉన్న మనలాంటి సమాజంలో, బలహీనులకు, హక్కులు కోల్పోయిన వారికి ప్రత్యేకమైన రక్షణలు కల్పించటం ద్వారా మాత్రమే బలవంతుల దోపిడీ నుండి బలహీనులను కాపాడగలం.

వీటినన్నిటిని దృష్టిలో పెట్టుకొనే ఎస్.సి,ఎస్.టిల ప్రయోజనాలను కాపాడటానికి రాజ్యాంగం 15(4), 16(4), 46 మొదలైన అధికారణలను రూపొందించింది. వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించటం వలన తమ ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతున్నదని, ప్రతిభ దెబ్బతింటున్నదని కొంత మంది భావిస్తున్నారు. అనుకూల వాతావరణంలో పరిస్థితులు కల్పించిన కొన్ని హక్కుల ప్రభావం వల్లనే అసలు ఈ ప్రతిభ అనేది పుట్టు కొస్తున్నది. పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చినంత మాత్రాన ఆ వ్యక్తి ప్రతిభావంతుడు అనటానికి వీల్లేదు. గ్రామాల్లో ఉంటూ సాంఘికంగా విద్యాపరంగా వెనుకబడిన కుటుంబాల లోంచి వచ్చిన పిల్లలు భాగ్యవంతుల పిల్లలతోటి సహజంగా పోటీ పడలేరు. దీనిని దృష్టిలో ఉంచుకొని "ప్రతిభ" "సమానత్వం" అనే పదాలను సరియైన దృష్టితో పరిశీలించి హక్కులను కల్పించటం అనేదాని అవసరాన్ని గుర్తించవలసి ఉంటుంది. అసమానుల మధ్య జరిగే పోటీలో ప్రతిభకు సమానత్వానికి వేరే అర్థం చెప్పుకోవలసి వస్తుంది.

సాంఘిక న్యాయం, రాజ్యాంగం, చట్టం.

ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య జరుగుతున్న ఘర్షణ పార్లమెంటులో ఎంతో చర్చకు దోహదం చేసింది. ఎన్నో సుప్రీంకోర్టు తీర్పులకు దారితీసింది. రాజ్యాంగంలోని 15(4), 16(4) అధికరణలకు అనుగుణంగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం ఉద్యోగాలలోను విద్యాసంస్థల్లోను రిజర్వేషన్ సౌకర్యం కలుగ చేశాయి. దీనితో అనేక హైకోర్టుల్లో చివరకు సుప్రీంకోర్టులోను ఎన్నో పిటీషన్లు పడ్డాయి. దీనివల్ల చాల తీర్పులు వచ్చాయి. ఇది క్రమంగా పెరుగుతూ ఉన్నది. ఈ తీర్పుల సారాంశం క్రింద ఇవ్వటం జరుగుతున్నది.

హిందూ కులాలు ఇతర వెనుకబడిన కులాలను గుర్తించటానికి కులం అనేది ఒక ప్రధానమైన అంశం. వెనుకబడినతనం అనేది సాంఘికంగానూ విద్యా పరంగానూ ఉండాలి. అంతే కాని సాంఘికంగా లేదా విద్యాపరంగా ఏదో ఒకటి అయి ఉండకూడదు. రెండూ ఉండాలి. కులం అనేది కూడా పౌరులలో ఒక వర్గమే. అది సాంఘికంగా విద్యాపరంగా వెనుకబడి ఉన్నట్లయితే దానికి రాజ్యాంగంలో రూపొందించిన 15(4) అధికరణ ప్రకారం సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన వర్గం క్రిందికి వస్తుంది. కాబట్టి రిజర్వేషన్ సౌకర్యం కల్పించవచ్చు. "వెనుకబడిన వారు" "మరీవెనుక బడిన వారు అనే తేడాను రాజ్యాంగంలో 15(4) అధికరణ క్రింద కల్పించిన రిజర్వేషన్లు మొత్తం 50 శాతంకు మించకూడదు. వెనుకబడిన కులాలను గుర్తించవలసి వచ్చినపుడు సమాజంలోని అనేక అంశాలపై సర్వే చేసి గుర్తించాలి.

వెనుకబడిన తరగతల సంక్షేమంలో ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య పోలిక

శతాబ్దాలనుంచి వస్తూ ఉన్న ఒక చారిత్రిక దోషాన్ని సరిదిద్దడ మనేది కొంత క్లిష్టమైనపనే. కులవ్యవస్థ పాతుకుపోయి ఉన్న హిందూ సమాజంలో, కులానికి సాంఘిక ఆర్థిక స్థాయికి చాల దగ్గర సంబంధం ఉండటంవల్ల చాల కొద్ది మంది అగ్రకులాల వాళ్ళు జీవితంలోని అన్ని మంచి విషయాలను ఐశ్వర్యాలను హస్తగతం చేసుకొని అధిక సంఖ్యలో ఉన్న కింది కులాల వారికి కనీస జీవన అవకాశాలు కూడా లేకుండా చేశారు. దీని వల్ల స్వతంత్రం వచ్చిన తర్వాత ఈ ఎక్కువ తక్కువ కులాల మధ్య ఈ తేడాను తగ్గించటం, శ్రేయోరాజ్యాన్ని స్థాపించటం చాల ప్రధానమైన అంశం అయింది.

ఈ సమస్యను పరిష్కరించటానికి భారత ప్రభుత్వం రెండు మార్గాలు ఎన్నుకున్నది. ఒక పక్క మొత్తం దేశాభివృద్ధికి పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకున్నది, మరొక పక్క అన్ని రకాల వెనుకబడిన తరగతుల పురోభివృద్ధికి రాజ్యాంగంలో 15(4), 16(4) అధికరణల క్రింద ప్రత్యేకమైన రక్షణలు కల్పించింది. పంచవర్ష ప్రణాళికలు తయారు చేయటం అమలు చేయటం బాధ్యత న్యాయానా కేంద్ర ప్రభుత్వమే తీసుకున్నది. కాని షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు తప్ప ఇతర వెనుకబడిన తరగతుల వారి సంక్షేమం చూసే బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసింది. దీనివలన ఇతర వెనుకబడిన తరగతుల ప్రయోజనాలను కాపాడటంలో తీవ్రమైన నిర్లక్ష్యం జరిగిందనేది మాత్రం చెప్పవలసిన పనిలేదు.

(తరువాయి 36వ పేజీలో)

1921 ఖిలాఫత్ ఉద్యమం

తారీఖులూ - దస్తావేజులూ

ఇవి కావోయ్ చరిత్రసారం అని చాటి చెప్పిన చిత్రం "1921". భారత స్వాతంత్ర్యోద్యమకాలంలో 1921 లో, కేరళలోని మాపిల్లా, మలబారు లాంటి ప్రాంతాలలో ఉవ్వెత్తున లేచిన ముస్లిం రైతాంగ ఉద్యమమే 1921 ఖిలాఫత్ ఉద్యమం. దీనిని కొంతమంది చరిత్రకారులు మోప్లా తిరుగుబాటు అని కూడా అంటారు. చాల మంది విద్యావంతులకు, మేధావులకు ఖిలాఫత్ ఉద్యమమనేది ఒకటి జరిగిందనీ కూడా తెలియక పోవచ్చు. కాదు, కాదు, ప్రభుత్వం తెలియనీయదలచుకోలేదు. తెలిసిన వారికి కూడా చాలమటుకు తారీఖులు దస్తావేజుల మేరకు మాత్రమే పరిమితమై ఉంటుందనడంలో అతిశయోక్తికాదు. 1921లో కాకుండా, దానికి అరవై, డెబ్బైసంవత్సరాలు వెనక్కిపోయి, చరిత్ర పుటలు తిరగేస్తే ఉద్యమం పునాదులు కనిపిస్తాయి. 1850 తరువాత భారత దేశంలో వలస విధానం బలపడిన కాలంలో పల్లెల్లో భూస్వాములకు అనివార్యంగా విస్తృతాధికారాలు సంక్రమించాయి. బ్రిటిషు పాలనాయంత్రాంగం రైతాంగంపై విపరీతమైన పన్నుల భారం మోపింది. పన్ను వసూలుకు నిర్దాక్షిణ్యంగా ఖాకీల దాడుల్ని సాగించింది. ప్రధానంగా దళితులు, పేద రైతాంగం భూస్వాముల అణచివేతకు, అస్తవ్యస్త పన్నుల విధానాలకు బలి కావలసివచ్చింది.

పేద రైతాంగం కష్టాలను, కడగండ్లను గూర్చి ఏ.కె. బాబర్, లోగన్ లాంటి ప్రభుత్వాధికారులు (మేజిస్ట్రేట్సు) బ్రిటిషు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అయినా ఫలితం లేకుండా పోయింది. చివరకు ముస్లిం ప్రజలు అలీముసిలియార్, కున్హమ్మద్ హాజీ, చెంబ్రాసారి తంగల్ లాంటి ప్రముఖుల నాయకత్వం కింద 1921లో భూస్వాముల క్రూరత్వానికి, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల అణచివేతకు వ్యతిరేకంగా "ఖిలాఫత్" పేరున బ్రహ్మాండమైన ఉద్యమాన్ని చేపట్టారు.

"1921" చిత్రం ఐ.వి.శశి దర్శకత్వంలో ఇటీవల విడుదలయింది. ఈ చిత్రంలో మౌళిక అంశాలకు ఎటువంటి భంగం కలగకుండా చాలా పాజిటివ్‌గా చూపించారు. సంతలో ముస్లిం జెండాలను (ఖిలాఫత్ ఉద్యమం జెండాలు) తీసి వేయమని, పోలీసుల దాడులతో చిత్రం ప్రారంభ మవుతుంది. తర్వాత ముస్లిం ప్రజలు ముస్లిం నాయకులతో కలిసి ప్రార్థనలు చేసుకుంటున్నప్పుడు, బ్రిటిష్‌వారి తొత్తులు అందించిన సమాచారంతో పోలీసులు దాడి చేస్తారు. మరోపక్క కాంగ్రెసు కార్యకర్తలు "వందే మాతరం" గీతాలాపన చేస్తుంటారు. ఉద్యమం క్రమంలో ముస్లింప్రజలు, ముస్లిం నాయకులు తమ చేతికి అందిన ఆయుధాలతో భూస్వాముల ఇండ్లపై, పోలీసుల స్థావరాలపై తిరుగుబాటు చేసి భవిషత్తులో తాము నిర్మించబోయే సాయుధ పోరాటానికి నాంది పల్కుతారు. నాయకులు ముస్లిం ప్రజలను, హిందూ ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేస్తే ఉద్యమాన్ని బలంగా నిర్మించే క్రమంలో ఉంటారు. కాంగ్రెస్‌లోని అతివాదులు ఉద్యమానికి చేయూత నివ్వడం "ఉన్నికృష్ణన్" పాత్రలో చూపించారు. కొంతమంది కాంగ్రెసు అభిమానులు ఖిలాఫత్ ఉద్యమానికి సానుభూతిపరులౌతారు. ఈ ఉద్యమానికి దేశంలో జరిగే ఇతర ఉద్యమాలతో సంబంధాలు ఏర్పరచాలని ఉన్నికృష్ణన్ పాత్ర ప్రయత్నిస్తుంది. కాని ఈదశలో హిందువుల శవాలు బావిలో పడి ఉండడం చూసి, ముస్లింనాయకులు ఉద్యమాన్ని కుల పోరాటంగా మార్చారన్న దురభిప్రాయంతో ఉద్యమానికి తాత్కాలికంగా దూరం అవుతాడు. ఫలితంగా బ్రిటిష్‌వారికి బందీగా దొరకడం, బ్రిటిష్ వారు పేద ప్రజలను ట్రైన్‌లోని ఒక బోగీలోకుక్కి మూకుమ్మడిగా హత్య చేయడం, చివరకు పోలీసులనుంచి తప్పించుకొని ఖిలాఫత్ ఉద్యమంతో ఉన్నికృష్ణన్ మమేకం అవుతాడు.

చెదురుమదురు దాడుల నుంచి ప్రజలు సాయుధ పోరాటాలను నిర్మించడం, పోలీసు స్టేషన్లనుంచి, ఆయుధాలు సంపాదించుకోవడం, ప్రజలు పోరాట క్రమంలో నిరుపమానమైన త్యాగాలు చేయడంలాంటి - ఘటనలు ఎప్పుడూ చిరస్మరణీయం. ప్రజలే చరిత్ర నిర్మాతలన్న భావన ప్రేక్షకుల మెదళ్ళలో నాటుకుంటుంది. చివరకు తమలోని వాడే "ఉప్పు" అందించటం వల్ల బ్రిటిష్ పోలీసులు ప్రజల స్థావరాలపై దాడి చేయడం, ప్రజలు వీరోచితంగా, తుది శ్వాస వదిలే వరకు పోరాడి, కడకు బ్రిటిష్‌వారికి బందీలుగా చిక్కడం జరుగుతుంది. ఈ విధంగా కుల ప్రేరణతో ప్రారంభమైన ఉద్యమం, భూస్వాముల అణచివేతకు, వలస సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రజలు మిలిటెంటు పోరాటాలకు పరిణతి చెందడం అన్ని వర్గాల ప్రజల మద్దతు, సహకారం ఉంటుందని నిరూపిస్తుంది. దళితులు ఒంటిమీద గుడ్డలు కప్పుకోవడం చూసి సహించలేని భూస్వాముల నీచ మనస్తత్వాన్ని, ప్రాణంకన్నా శీలం ఎక్కువగా భావించే భారతీయ స్త్రీ అశాస్త్రీయల భావాలనూ చాల చక్కగా, నిజాయితీగా చూపించారు. చిత్రంలో సన్నివేశాల

(తరువాయి 33వ పేజీలో)

"న్యాయాన్యాయాలు"

పుస్తకం పేరు : "న్యాయా న్యాయాలు"
రచయిత: నందిగం కృష్ణారావు
ప్రచురణకర్తలు: **ప్రజాస్వామ్య హక్కుల వేదిక.**
(Forum for Democratic Rights (FDR))
వెల: రూ. 30/-
ప్రతులకు :– 1. నవయుగ బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్.
2. ప్రగతి బుక్ హౌస్, మ్యూజియంరోడ్, విజయవాడ-2
3. ప్రజాస్వామ్య హక్కుల వేదిక
1-9-34/4/C, రాంనగర్
హైదరాబాద్ 500 048

నందిగం కృష్ణారావుగారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది. ఆయన వ్రాసిన ఈ "న్యాయాన్యాయాలు" వ్యాసపరంగా 1986లో ఉదయం దినపత్రికలో 'వారం వారం న్యాయశాస్త్ర విషయాలను పాఠకులకు విశద పరచాలన్న ఆలో చనతో ప్రారంభమై ఆ కృషి అలా కొనసాగుతూనే వుంది.

"న్యాయ శాస్త్ర మనేది కేవలం న్యాయవాదులకు, న్యాయమూర్తులకు, పోలీసులకు, తత్సంబంధితులకు, మాత్రమే పరిమిత మైనది కాదు. ఇది అందరికీ వర్తించేది కాబట్టి అందరూ అధ్యయనం చేసి తెలుసుకోవలసి వుంది" అన్న ఉద్దేశ్యంతో ఆయన రచన ప్రారంభించారు.

ఒకనేరం జరగడము, ఆ నేరానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే పోలీస్ వ్యవస్థ ప్రతిస్పందన, దర్యాప్తులో భాగంగా పోలీసులకు ఏర్పడిన అధికారాలూ, వాటి పరిమితులు ఒకవైపున వివరిస్తూ మరోవైపున పోలీసులకున్న అధికారాల పేరిట సాగే అక్రమాలనుండి ప్రజల హక్కులు కాలరాయబడకుండా ఎలా కాపాడుకోవాలో కూడా వివరించారు.

ప్రజలు పోలీసుల వల్లా చట్టాల వల్లా కోర్టుల వల్లా నిత్యం ఎదుర్కొనే అనేక సమస్యలను చిన్న చిన్న వివరాలతో సహా ఈ పుస్తకం చర్చిస్తోంది.

ఎఫ్.ఐ.ఆర్, దర్యాప్తు, సోదా చేసే అధికారం, సెర్చ్ వారెంట్, అరెస్టు, లాకప్, 24 గంటల్లో హాజరు, అక్రమ నిర్బంధం, లాకప్ మరణాలు, బెయిల్ వివరాలు, చార్జిషీట్, న్యాయవాది నియామకం, కాలపరిమితి, కేసు కొట్టివేత, నష్టపరిహారం, హైబియస్ కార్పస్, సెక్షన్ 144, అధికార దుర్వినియోగం - విచారణ, స్థిరాస్తి గొడవలు - ఇలా అనేక శీర్షికల కింద ఆయా విషయాల లోతు పాతుల్లో కెళ్లి సమగ్ర వివరణతో వ్యాసాలున్నాయి. కృష్ణారావ్ గారికే చెల్లిన ప్రత్యేక రచనా విశేషం ఆయన కథా కథన శైలి. పాఠకుడిని ఆవాతావరణంలోకి తీసుకెళ్లడానికీ, పాఠకుడిలో ఆయా విషయాల స్ఫూర్తిని కలిగించడానికి ఉభయత్రా వుపయోగ పడేది ఆయన కథనశైలి. ఆయా శీర్షికల క్రింద చర్చింపబడుతున్న విషయం సులభంగా అర్థమయ్యేందుకు కూడా ప్రతి వ్యాసాన్ని ఆయన కొన్ని వాస్తవ సంఘటనలను వర్ణిస్తూ చెప్పిన పద్ధతి ముఖ్యంగా దోహదం చేసింది. పాఠకుడు కథ చదువుతోన్నంత హాయిగా ఆ రచనలోకి ప్రవేశించి ఎంతో విషయ విజ్ఞానాన్ని అవగాహనని పొంది ఆ విశ్వాసంతో మాత్రమే వుస్తకాన్ని మూస్తాడు.

ఈ పుస్తకాన్ని "ఏ రామనాథం? అంటే ఎ. రామనాథమంటూ చిరు నవ్వుతో జవాబు పలికి, పౌరహక్కుల పోరాటంలో అసువులు బాసి అమరుడైన డాక్టర్ ఎ. రామనాథం గారికి కృష్ణారావుగారు అంకితమిచ్చారు.


ప్రజలందరిదగ్గరా తమ స్వంత కాపీగా వుండవలసిన పుస్తకమిది. మరీ ముఖ్యంగా అంతో ఇంతో రాజకీయ చైతన్యంతో ప్రజల్ని సంఘటితం చేస్తున్న కృషిలో ఉన్న వారికి చాలా ఉపయోగపడుతుంది.

–– సమ్మెట నాగమల్లీశ్వరరావు

(32వ పేజీతరువాయి)

చిత్రీకరణ పట్ల దర్శకుని కమిట్మెంట్ స్పష్టంగా విశదమవు తుంది. చరిత్రలో మరుగు పడిన ప్రజా ఉద్యమాన్ని తెరకెక్కించిన దర్శకులు ఐ.వి. శశిగారు, తన సహజ నటనలో పాత్రకు జీవం పోసిన ముమ్ముట్టి అభినందనీయులు, సినిమా చూసిన తరువాత ఒక మంచి సినిమా మిస్ కాలేదన్న అనిర్వచనీయమైన అనుభూతి ప్రేక్షకులకు మిగులుతుంది. విద్యావంతులకయితే తాము చదివిన చరిత్ర తమను వెక్కిరించినట్టుగా ఫీలవుతారు. చరిత్ర గర్భంలో, దోపిడీ శక్తుల ఉక్కుపాదాల కింద మరుగున పడిన ఇలాంటి ప్రజాపోరాటాలను వెలికితీసి తాము అధ్యనం చేసి, ప్రజలచే అధ్యయనం చేయించవలసిన బాధ్యత ప్రజాతంత్ర వాదులందరిది అని భావిస్తున్నాను. దీని నుండి మనం తీసుకోవలసిన పాఠమేమటంటే వర్తమానంలో జరుగుతున్న కుల,మత పోరాటాలను వర్గాపోరాటాలుగా మార్చవలసిన బాధ్యత ప్రస్తుత పోరాట నాయకులదని మరువరాదు.

కె. శ్రీనివాసులు



"ఏమిరా! ఈ ముండ ఇంకా రాలేదు" గంటైనా బావికి నీళ్ళకు పోయి తిరిగి రాని కోడలు గురించి కొడుకుతో అంది సోమమ్మ.

"వస్తాదిలే యాడికిపోతాది" పొగరుగా అన్నాడు రంగన్న. ఫారంలో రెగ్యులర్ మస్టర్‌గా పనిచేస్తున్నాడతను.

"అల్లేపోయి చూసన్నా రాపోరా!" నిన్నరాత్రి సైకిల్‌కోసం ఇంట్లో జరిగిన కోట్లాట - కొడుకు కోడల్ని విపరీతంగా కొట్టడం గుర్తొచ్చి - అనుమానంగా అంది.

తల్లి బలవంతం మీద ఊరి బయటి బావిదగ్గరకు పోయాడు. వాళ్ళమ్మ అనుమానించినట్టే బావి గట్టుమీద ప్లాస్టిక్ బిందె ఉందికాని భార్య గౌరమ్మ జాడ లేదు. అతనికి కూడ కొంత జంకేసింది. ఇంటికి వస్తూ వస్తూ దారిలో కనబడిన వాళ్ళందర్నీ అడిగాడు. ఎవ్వరూ చూడలేదన్నారు. ఇంట్లోకి అడుగు పెడుతూనే అడిగింది సోమమ్మ. ఏమి చెప్పకుండ మౌనంగా నిలబడిన కొడుకును చూసి తాను అనుకున్నంతా అయిందని భయపడి గట్టిగా ఏడుస్తూ పరుగెత్తుతున్నట్లు బావి దగ్గరకు పోయింది. "ఏమయింది, ఏమయిందంటూ" జనం ఆమె వెంటవెళ్ళారు. అక్కడికి పోయిం తర్వాత అడిగారు అందరు.

"మాగౌరమ్మ బావిలోపడింది తల్లో" అంటూ ఏడుపందుకుంది. అది విని అందరూ నిశ్చేష్టులయిపోయినారు. తేరుకున్నాక కొందరు ఆమెను, కొడుకుని తిట్టడం మొదలు పెట్టారు. కోడిల్ని సైకిల్‌కోసం సతాయించడం వాళ్ళకందరికీ తెలుసు. కొందరు గౌరవమ్మ మీద సానుభూతిగా మాట్లాడడం మొదలు పెట్టారు"

అంతలో ఓ ముసలాయన "దుంకుండతే! బావిలో చూడండి" అన్నాడు.

"ఒరే! నరసన్నా! ఎంకన్నా దుంకండరే" యువకుల్ని పిలుస్తూ ఎవరో ముసలామె గొంతు.

గుంపులోనుండి ఎవరో ఇద్దరు బనీన్లు, పంచెలు విప్పేసి దుంకారు. బావిలో మునిగిన వాళ్ళు నిమిషం తర్వాత బయటికొచ్చారు. అందరూ "ఉందా, ఉందా!" అని అడిగారు. బావిచాలాలోతుందని ఒకడంటే పూడు మాత్రం తగిలిందని ఇంకొకడన్నాడు. రెండు నిమిషాల తర్వాత మళ్ళీ దుంకారు. అరనిమిషానికే బయటికొచ్చారు. భయం వల్లనే, ఊపిరి బిగబట్టలేకో వాళ్ళు వహకేం తగల్లేదన్నారు. ఇంతలో మరో ఇద్దరు దుంకారు. వాళ్ళూ మూడుసార్లు మునిగి వెతికారు కాని పట్టుకోలేక పోయారు. ఒకడు మాత్రం పడమటి దిక్కున బట్టలాంటిది తగిలిందని మాత్రం అన్నాడు.

పొద్దు కూడా వాలిపోయింది. సాయంత్రం అనగా నీళ్ళకు వచ్చిన గౌరమ్మ గంగమ్మలో కలిసి పోయింది. చీకటి అలముకుంటుండగా అందరూ

ఇళ్ళకు మళ్ళారు. దారిలో అందరూ సోమమ్మను, కొడుకు రంగన్నను తిట్టేవాళ్ళే. ఆడవాళ్ళు, ముసలోళ్ళు "బంగారంలాంటి పిల్ల పానం తిన్నాడు, వాడివంశం నాశనంగాను" అంటూ శాపాలు పెట్టారు.

ఇంటికి పోయిన సోమమ్మ ఇంట్లో ఉండక సర్పంచు వెంకటరెడ్డి ఇంటికి పోయింది. అరుగు మీద కూర్చొని జీతగాళ్ళకు వనులు చెపుతున్న రెడ్డికి దండం పెట్టి జరిగిన సంగతి చెప్పింది.

"కేసు కాకుండా కాపాడురెడ్డో" అంటూ మొరపెట్టుకుంది.

శవాన్ని బయటికి తీయలేదని తెలిసి "ఊర్లో సుంకడున్నాడా" అని అడిగాడు.

"లేడు రెడ్డో! వాడన్నా ఉండింటే బయటికి తీస్తుండే" ఎంత తొందరగా బయటికి తీసి పాతిపెడితే అంత మంచిదని ఆమె ఆరాటం.

సుంకడు పక్కూర్లో కొళాయిల బావిలో పైపులు పడిపోయింటే పైకి తెచ్చినప్పుడు చూశాడు రెడ్డి సుంకడి సత్తా. నలభై అడుగుల లోతునుండి ఇనుపపైపులు పైకి లాగాడు వాడు.

అంతా నేను చూసుకుంటాను పొమ్మని సోమమ్మను ఇంటికి పంపి తలారిని పిలిచి సుంకడి గురించి కనుక్కున్నాడు రెడ్డి. వాడు పెళ్ళాం ఊరికి పోయినట్లు తెలిసింది. అది కూడ ఇక్కడికి మూడు మైళ్ళే. సుంకడ్ని పిలుచుకురమ్మని తలారినే పంపాడు రెడ్డి.

ఊరు చిన్నపల్లెటూరు కావడంతో గౌరమ్మ బావిలో పడిన సంగతి ఇంటింటికీ తెలిసిపోయింది. రాత్రి నిద్రపోయేదాకా తల్లీ, కొడుకుల్ని తిడుతూ, గౌరమ్మను దయతలుస్తూ చెప్పుకున్నారు ఊరిజనం.

తెల్లారేసరికల్లా బావిదగ్గర మంది గుంపులుగా ఉన్నారు. సుంకడు కూడ వచ్చేసినాడు. సోమమ్మ, రంగన్న ఒక పక్కగా తలొంచుకొని కూర్చొని ఉన్నారు. సుంకడు బావిలోకి దుంకాడు. నిమిషం తర్వాత బయటికి వచ్చాడు. ఊపిరి ఏగపీలుస్తుంటే వాడి రొమ్ము పొంగుతోంది. ఇంతకు ముందువాళ్ళు చెప్పినట్లు పడమటి దిక్కుకే వాడికి కూడ చీర తగిలిందన్నాడు. నిమిషం తర్వాత మళ్ళీ దుంకాడు. అక్కడున్న వాళ్ళంతా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. అందరూ పడమటి దిక్కుకే చూస్తున్నారు. ఇంతలో నీళ్ళలో అలికిడి అయింది. మెల్లగా శవం తల బయటికి వచ్చింది. చూస్తూనే పిల్లలందరూ జడసుకున్నారు. జుట్టంతా విడిపోయి భుజాల మీద, వీపుమీద పడి ఉంది. కనుగుడ్లు భయంకరంగా తెరిచి ఉన్నాయి. ప్రాణం పోవడానికి పెనగులాడి నట్లుంది. నాలుక కొరుక్కున్నది. ఎర్రగా కందిన రక్తం పెదవుల వెంట, నోటివెంట కారిన చారికలున్నాయి. పెద్దలు కూడ భయపడ్డారు. ముఖ్యంగా ఆడవాళ్ళ గుండెలు దడదడలాడాయి.

"ఎటువంటి ఆడమనిషికీ ఇటువంటి చావు రాగూడదు సూడమ్మా" ఎవరో ఆడామె ఏడుస్తూ అంది. అందరూ రోదిస్తూ ఉన్నారు.

సుంకడు శవాన్ని మెట్టుమీద తెచ్చి పడేశాడు.

"ఒకవేళ పోలీసులొచ్చి అడిగితే ఎవర్వేం చెప్పొద్దు, బూంచుకోపోండి" రెడ్డి అందర్నీ బెదిరిస్తూ గట్టిగా చెప్పేసి ఇంటికెళ్ళిపోయాడు.

అక్కడి కక్కడే నలుగురూ పూనుకొని నాలుగు కట్టెలు తెచ్చిపాడె కట్టారు. గౌరమ్మ తల్లిదండ్రులకు కూడ చెప్పి పంపలేదు. వాళ్ళొచ్చే వరకు ఉంటే ఏం మీదికొస్తుందోనని ఇంటికి కూడ తీసికెళ్ళకుండా నేరుగా శ్మశానానికే తీసి కెళ్ళి పాతిపెట్టించింది సోమమ్మ.

××× ××× ×××

రంగన్న పనిచేసే సెక్షన్ గడ్డి కోసే సెక్షన్. వాళ్ళ సూపర్వైజర్ గోపీకృష్ణ పెళ్ళి ఇటీవలే జరిగింది. రంగన్నతోపాటు అతనికింద పనిచేసే కూలీలందరూ పోయి పెళ్ళిపనులు చేశారు. అతనికి కట్నంకింద నగదు యాభై వేలు, బంగారం, కలర్ టి.వీ. వగైరా కలిసి లక్ష రూపాయలవరకు వచ్చింది. అయినా ఇంకా తృప్తి పడని అతని తల్లిదండ్రులు దనరాకు రెండుతులాలు బంగారం కానుకగా ఇచ్చేటట్లయితే భోజనాలు చేస్తామని అలిగి కూర్చునారు. ఎంతో రాద్ధాంతం జరిగిన తర్వాత, పెళ్ళికూతురు తండ్రి ఒప్పుకొన్నాక పన్నెండుకు మొదలు పెట్టాల్సిన భోజనాలు, మూడు గంటలకు మొదలయ్యాయి. పెళ్ళి కొచ్చిన బంధుమిత్రులు అంతసేపూ వేచి వుండాల్సి వస్తుందనయినా ఆలోచించలేదు గోపీకృష్ణ తల్లి దండ్రులు.

లేబర్ ఇదంతా చూసి ఆశ్చర్యపోలేదు. తమ ఊరికి ఫారం వచ్చిన ఇరవై ఏళ్ళ కింద నుండి వాళ్ళు ఇలాంటి పెళ్ళిళ్ళు, అందులో జరిగే పట్టుదలలు, పంతాలు అనేకం చూశారు. మొదట్లో అయితే సంతోషంగా ఇచ్చింది తీసుకోవాలని ఇట్లా సాధించడం ఏమీ బాగాలేదని తమలో తాము అనుకునేవాళ్ళు. రానూ రానూ వాళ్ళూ దీనికి అలవాటు పడ్డారు.

గవర్నమెంటు ఆస్ట్రేలియా నుండి జెర్సీ ఆవుల్ని, ఆంధ్రావిరియా నుండి ఆఫీసర్లని తెచ్చి అక్కడ ఫారం పెట్టింతర్వాత వాళ్ళూ మారిపోవడం మొదలయింది. ఏళ్ళతరబడి కరవుల్తో బతికే తమ ఊర్లోని మంచి గడ్డలన్నీ రెడ్డివే. తమలాంటి వాళ్ళకున్న వన్నీ చవిటినేలలే. పండీపండని దీనపు బతుకుల్తో వెళ్ళదీసే వాళ్ళ పెళ్ళిలు కనాకష్టంగా జరిగేవి. ఇచ్చి తీసుకోవడాలంటూ ఏమీ ఉండేవికావు.

కరువుబాపడానికివ్వని కాల్వనీరు గవర్నమెంటు పశువులకు గడ్డి పెంచడానికి వాడుకుంది. చుట్టపక్కల నాలుగూర్ల పొలాలు ఫారంలోకి పోయాయి. రంగన్న రెండెకరాలు పోయాయి. ఫారంరాగానే దాన్ని నడపడానికి ఆఫీసర్లు, ఉద్యోగులు వచ్చారు. వాళ్ళకింద పనిచేయడానికి కూలీలు కావాల్సొస్తే ఆ నాలుగూర్ల పేదోళ్ళంతా చేరిపోయారు. వాళ్ళను మొదట రోజు కూలీలుగా చేర్చుకున్నారు. వాళ్ళనే స్పెషల్ మస్టర్లని ఇంగ్లీషులో పిలిచారు ఆఫీసర్లు. ఆ తర్వాత వాళ్ళల్లో కొందర్ని రెగ్యులర్ మస్టర్లుగా చేశారు. ఆ తర్వాత కొందరు మాత్రం అటెండర్లయ్యారు. మరికొంత మంది ట్రాక్టర్లకు డ్రైవర్లుగాను, మెకా

నిక్లుగాను అయ్యారు. పదయిదు రోజులకొక సారి, నెలకొకసారి రెండు వందలు, నాలుగు వందల నుండి వెయ్యి రూపాయల దాకా నగదును జీతంగా తీసుకోవడం మొదలైంది. ఈ లేబర్ పైన మేస్త్రీ, వాళ్ళపైన సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఆఫీసర్లు వచ్చారు. వాళ్ళ కోసం ఆఫీసులు, క్వార్టర్లు, హొటళ్ళు, టీ.వీ.లు వచ్చాయి. పట్టణ సంస్కృతి కూడ వాళ్ళ జీవితాల్లోకి వరదలా వచ్చింది. ఈ వరద వాళ్ళ జీవితాల్లోని పాతని మరిపించి వాళ్ళపై వాళ్ళ జీవితాల్లాంటి జీవితాల పట్ల మోజు పెంచింది.

నెలకు నాలుగువందలు సంపాదిస్తుండడంతో రంగన్నకు తన రోజూ ఫారానికి పోయి రావడానికి సైకిల్ లేకపోవడంతో అందరి ముందు తానేదో తక్కువైపోయినట్లు భావన కలిగింది. అందులోను తమ ఊర్నించి ఫారానికి పోయే వాళ్ళందరికీ సైకిళ్ళున్నాయి. దాంతో సైకిల్ కోసం భార్యని సతాయించడం మొదలుపెట్టాడు. తిట్లు, ఛీత్కారాలతో మొదలు పెట్టి, అప్పుడప్పుడు కొట్టడం, తన్నడం నుండి రోజూ కొట్టడం వరకు వచ్చింది. తన పుట్టింటి వాళ్ళు ఇప్పుడిప్పుడే ఏమీ యివ్వలేరని గౌరమ్మకు తెలుసు. తల్లి, తండ్రీ, తను, తన తమ్ముళ్ళిద్దరూ రోజూ కూలి కెళ్ళి తెచ్చిన దాంతో బతకడానికి పోగా, మిగిలింది వెనకేసిన దాంతోను, అప్పు చేసి పెళ్ళి చేశారు. ఫారంలో పనిచేస్తున్నాడు, తులం బంగారం పెట్టాలంటే అంత కష్టంలోను పెట్టారు. వాళ్ళ ఊరు తుంగభద్ర ప్రాజెక్టు కింద తరి ఉన్న ఊరు అయినందున ఏడాది పొడువునా కూలీలు దొరుకుతున్నాయి. కాబట్టే బతకన్నా గడుస్తోంది. పెళ్ళికి చేసిన అప్పు కూడ తీరలేదు. అందులోనూ పెళ్ళయి ఆర్నెల్లు కూడా కాలేదు. అంతలోనే సైకిల్ అంటే యివ్వలేరని తెలిసే ఎంత తిట్టినా, తన్నినా భరించిందే కాని గౌరమ్మ తల్లిదండ్రులకు తెలియజేయలేదు. తన కష్టం తీరే దారి ఏదీ లేక గౌరమ్మ కాటి కెళ్ళింది.

మరుసటి రోజు గౌరమ్మ తల్లిదండ్రులు, తమ్ముళ్ళూ వచ్చారు. తల్లి ఊరి బయటి నుండే ఏడుస్తూ వచ్చింది. జనమంతా ఆమె వెంట సోమమ్మ ఇంటి వరకు వచ్చారు. సోమమ్మ వాళ్ళని ఇంట్లోకి రమ్మంది. రంగన్న మౌనంగా తలవంచుకొని కూర్చున్నాడు. అంతమంది గుంపుగా తన ఇంటి ముందు ఉన్నందుకు అతనికి కోపంగాను, భయంగాను ఉంది. పిలవకుంటే బాగుండదని కున్నాడేమో అతను కూడ అత్తను, బావమర్దుల్ని ఇంట్లోకి రమ్మన్నాడు. గౌరమ్మ తల్లి గుండె భగ్గుమంది అతడి మర్యాదను చూసి.

"ఇప్పుడేం మర్యాద చేసినవు పోరా! పాపిష్టోడా! నాబిడ్డను అన్యాయంగా సంపితివి గదరా? నీవంశం నాశనంగాను" ఆమెకు, ఏడుపూ, కోపం వచ్చుంచుకొచ్చి అక్కడే కూలబడింది. అది గుంపులో అందరిని కలచివేసింది.

గడ్డికోసి నాలుగునూర్లు సంపాయిస్తడో లేదో వీనికి సైకిల్ కావాల్సి న్నంట. ఈన్ని ఊర్లోలేనట్ల తన్నల్ల" నడివయసు మనిషి ఒకడు మండి పడ్డాడు.

"ఫారం నాయండ్లంతా ఇంతటి నాయండ్లే. ఈ నాయండ్లందరినీ నలుగుర్లో కూసున్నట్ల జేయల".

తలా ఒక రకంగా తిడుతున్నారు. జనమంతా ఆవేశంగా ఉన్నారు. వాళ్ళ నోటి కడ్డు కట్టవేయడం తమ వల్ల కాదని సోమమ్మ, రంగన్న దించిన తల ఎత్తకుండా కూర్చున్నారు. తిట్ల పర్వం సాగుతూనే ఉంది.........

- మదార్

(31వ పేజీతరువాయి)

తమకు విడిచి పెట్టారుకాబట్టి ఈ సమస్యను పరిష్కరించటానికి రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టాయి. వెనుకబడిన కులాల పోరాట చరిత్ర కలిగిన దక్షిణ రాష్ట్రాలు ఈ కులాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాల్లో మంచి పురోగతిని సాధించాయి. మరో పక్క ఈ సమస్యపట్ల ఉత్తర భారత రాష్ట్రాల దృష్టి మాత్రం ఊగిసలాటగానూ, చేసీ చేయనట్టుగా మాత్రమే ఉన్నది. ప్రభుత్వ ఉద్యోగాలలోనూ, వృత్తి విద్యా సంస్థలల్లోను వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించటం ద్వారా ఎంతో సహాయం చేయవచ్చు. చాల కాలం క్రితమే ఇటువంటి సౌకర్యాలను నాలుగు దక్షిణాది రాష్ట్రాలలో అందజేశారు. ఇబ్బందులేమీ లేకుండా అది చాల సులువుగానే జరిగిపోయింది. కాని బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో చాల చిన్న ఎత్తున ఈ సౌకర్యాలు కలుగచేయాలని అనుకున్నప్పుడు అగ్రకులాలనుంచి పెద్ద హింసాకాండ బయలు దేరింది.

దీనిని చూస్తే మాత్రం నిజంగా భయం వేస్తుంది. మామూలుగా చెప్పుకోవాలంటే హిందూ మత ఛాందసం ఉత్తర భారత దేశంలో కంటే దక్షిణ భారత దేశంలోనే ఎక్కువ. దాని వల్ల ఇటువంటి ప్రయోజనాలు ప్రవేశపెట్టాలనుకున్నప్పుడు ఉత్తర రాష్ట్రాల కంటే దక్షిణ రాష్ట్రాలలోనే ఎక్కువ వ్యతిరేకత వస్తుందని అనుకుంటాం. ఇతర వెనుకబడిన కులాల సంక్షేమం విషయంలో ఉత్తర రాష్ట్రాలకు దక్షిణ రాష్ట్రాలకు మధ్య ఇంత తేడా ఎందుకు వస్తున్నదో సరిగ్గా పరిశీలన చెయ్యటం కోసం తమిళనాడు, కర్నాటక, బీహార్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ఇతర వెనుకబడిన కులాల సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించవలసిందిగా బొంబాయిలో ఉన్న టాటా సోషల్ సైన్సెస్ ఇన్‌స్టిట్యూట్ వారిని కోరటం జరిగింది. ఈ పరిశీలన నివేదిక 6వ భాగంలో పొందు పరచటం జరిగింది.

కొన్ని వ్యాఖ్యాలు తప్పిస్తే వారు చేసిన పరిశీలన సారాంశం ఈ క్రింది విధంగా ఉన్నది ఈ పరిశీలనలో వెలువడిన అభిప్రాయాలతో కమీషన్ ఏకీభవించవలసిన అవసరం లేదు.

(మిగతా వచ్చే సంచికలో)

చందాదారులకు

విజ్ఞప్తి

సర్,

మీరు 'నలుపు' ప్రజల పక్షపత్రికను క్రమం తప్పకుండా అందుకుంటున్నారని అనుకుంటున్నాం. మీకు విషయాలు తెలుసుకోటానికి పత్రిక ఉపయోగకరంగా ఉందని ఆశిస్తున్నాము.

సంవత్సరం చివరి సంచికను మూడు సంచికలతో ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాం. ప్రత్యేక సంచికను సంపుటి I, సంచికలు 19 నుంచి 21 * పేర్కొంటున్నాము.

మే నెల నుంచి మా పత్రిక రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నది. సంపుటి II సంచిక I అని మే 1-15, 1990 తేదీతో పత్రిక వెలువడుతుంది. ఈ సందర్భంగా ఏప్రిల్ 1990 ప్రత్యేక సంచికతో 1989-90 సంవత్సర చందా పూర్తవుతున్న వారందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

వెంటనే మీ చందాను పునరుద్ధరించుకోవాలని మనవి చేస్తున్నాం.

ధన్యవాదాలతో

– సిరిల్ రెడ్డి


ప్రింటర్ అండ్ పబ్లిషర్

గమనిక: మీకు ఏవైనా కొన్ని సంచికలు అందనట్లయితే, మాకు తెలియజేయండి. ఆ సంచికలు పంపటానికి ప్రయత్నిస్తాం. ఏవరికైనా అదనంగా కాపీలు కావాలంటే ప్రతి కాపీకి 3 రూపాయలు చొప్పున ఎం.ఓ.లేదా డి.డి. పంపండి.

** సాంకేతిక కారణాలవల్ల 12వ సంచికగా వెలువడాల్సిన అక్టోబర్ 1-15,1990 సంచికను 9వ సంచికగా మార్చాము.*

ALUPU Fortnightly Regd: as N.P. 45022/89 Regd. H/Sd- 173/RNP

స్వేచ్ఛనుంచి సంకెళ్ళకు, సంకెళ్ళనుంచి విముక్తికి
సాగిన ఒక మహాప్రస్థానం



"ఏడు తరాలు"

రచయిత : ఎలెక్స్‌హేలీ
మూడో ముద్రణ వెలువడింది
వెల : 18.00

ఆఫ్రికానుంచి నల్లవారిని బలత్కారంగా, చెరబట్టి అమెరికాకు బానిసలుగా కొనిపోవడం 1619లో ప్రారంభమైంది. అలా ఖండాంతరాలుదాటి వెళ్లినవారు ఐదు, ఆరు తరాలుగా బానిసలుగా బతుకులీడ్చారు. 1865లో అబ్రహాం లింకన్ బానిసత్వనిర్మూలన ప్రకటించాడు. అయినా నల్లవారికి, తెల్లవారితో సమానావకాశాలు లభించలేదు. నల్లప్రజల పోరాట ధ్వనులు ఎలెక్స్‌హేలీ "ఏడుతరాల"లో బానిసవాడల్లో అనేక సార్లు వినిపించాయి.

అమెరికాలో చదువు సంధ్యలు ముగించుకొని పత్రికా రచయితగా ఎదిగిన ఎలెక్స్ హేలీకి ఆరు తరాల వెనుక అట్లాంటిక్ మహాసముద్రానికావల ఆఫ్రికా చీకటి ఖండంలో తన వంశమూల పురుషుని పుట్టు పూర్వోత్తరాలు వెలుగులోకి తేవాలనే సంకల్పం కలిగింది. పన్నెండు సుదీర్ఘ సంవత్సరాల ఎడతెగని అన్వేషణ, అధ్యయనం, పరిశోధనల ఫలితం "రూట్స్" (ఏడుతరాలు)గా రూపెత్తింది.

హైదరాబాద్ బుక్‌ట్రస్టు

Edited by B. Tharakam, and published by Cyril Reddy on behalf of
Hyderabad Book Trust printed at Gayatri Enterprises Hyderabad for Hyderabad Printers.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M292
పుస్తకం పేరు	వలువు
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	39
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Apsar
పేజీలు విడదీసినది	Apsar
స్కాన్ చేసినది	Pariyaulee
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good